

వరద బాధితులకు వేమిరెడ్డి రూ. కోటి విరాళం

Truth of News

# సూర్య వాస్తవం

http://www.suryavastavam.in

చీఫ్ ఎడిటర్ : మహ్మద్ షఫీ అహ్మద్

IRS PUBLICATIONS

irspublications12@gmail.com

బుధవారం, 04 సెప్టెంబర్ 2024 విజయవాడ | సంపుటి: 01 - సంచిక : 86 | పేజీలు : 08 వెల రూ.6.50

Published from Hyderabad, Vishakapatnam, Rajahmundry, Vijayawada, Guntur, Nellore, Tirupati, Anantapuram, kadapa, kurnool, Warangal, Karimnagar, Nalgonda, Chennai, Bengalore, Mumbai, New Delhi



## పీకల్లోతు కష్టాల్లో ... బెజవాడ

❖ కురిసిన భారీ వర్షాలకు జనజీవనం అస్తవ్యస్థం ❖ 121 ఏళ్లలో ఎన్నడూ చూడని వరద

**విజయవాడ-సూర్య వాస్తవం**

ఆగస్టు 30 నుంచి నిన్నటి వరకూ తెలుగు రాష్ట్రాల్లో కురిసిన భారీ వర్షాలకు జనజీవనం అస్తవ్యస్థమైంది. ఆకస్మిక వరదలతో లోతట్టు ప్రాంతాలు జలమయమవ్వగా.. పీకల్లోతు నీటిలో ఉన్నవారందరినీ రెస్క్యూ బృందాలు బోట్లు, ట్రాక్టర్ల సహాయంతో పునరావాస కేంద్రాలకు తరలిస్తున్నారు. భారీ వర్షానికి విజయవాడ పరిస్థితి దయనీయంగా మారింది. వర్షాలు తగ్గినా.. బుడమేరు కట్ట తెగడంతో సింగ్ నగర్, రాణిగారితోట, ఆ పరిసర ప్రాంతాలు వరద ముంపుకు గురయ్యాయి. అక్కడి నివాసితులంతా ఇళ్లను వదిలేసి పునరావాస కేంద్రాల్లో తలదాచుకుంటున్నారు. మరోవైపు.. ప్రకాశం బ్యారేజీకి వరద పోటెత్తడంతో అధికారులు 70 గేట్లను ఎత్తి వరద నీటిని సముద్రంలోకి వదిలారు. విజయవాడను కృష్ణమ్మ పరవళ్ల నుంచి కాపాడేందుకు కట్టిన రిటైనింగ్ వాల్ కూడా వరద తాకిడికి ప్రమాదంలో ఉన్నట్లు తెలుస్తోంది. కృష్ణలంక ప్రాంతం ఇప్పటికే నీటిలో నానుతోంది. రిటైనింగ్ వాల్ కట్టను తెంచుకుని కృష్ణమ్మ దారితప్పితే కృష్ణలంక కూడా వరదనీటిలో పూర్తిగా మునిగిపోవడం ఖాయంగా కనిపిస్తోంది. స్థానికులు ఇసుక కట్టలతో వరద తాకిడికి అడ్డుకట్ట వేసేందుకు ప్రయత్నిస్తున్నారు.ప్రకాశం బ్యారేజీ వద్ద కృష్ణానదికి వస్తున్న వరదను గడిచిన 121 ఏళ్లలో ఎప్పుడూ చూడలేదంటున్నారు అధికారులు. 1903 అక్టోబర్ లో 10 లక్షల 60వేల 830 క్యూసెక్కుల వరద రాగా.. ఆ తర్వాత 106 సంవత్సరాలకు 2009 అక్టోబర్ లో 10 లక్షల 94 వేల 422 క్యూసెక్కుల వరద నదికి పోటెత్తింది.



ఈసారి వచ్చిన వరద ఆ రికార్డును దాటేసింది. ఏకంగా 11 లక్షల క్యూసెక్కులకు పైగా వరదనీటిని అధికారులు దిగువకు విడుదల చేస్తున్నారు. 11.36 క్యూసెక్కుల వరద నీటిని సముద్రంలోకి 500 క్యూసెక్కుల నీటిని పంట కాల్వల్లోకి విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం బ్యారేజీ వద్ద నది నీటిమట్టం 24.2 అడుగుల వద్ద ఉండగా.. అధికారులు రెండో ప్రమాద హెచ్చరిక జారీచేశారు.

కృష్ణమ్మ ఉగ్ర రూపాన్ని చూసిన ప్రజలు.. అమ్మా !శాంతించమ్మా.. అంటూ పూజలు చేస్తున్నారు. కృష్ణమ్మ ఉరకలు చూసి భయాందోళనకు గురవుతున్నారు. వరద మరింత పెరిగితే మరిన్ని లోతట్టు ప్రాంతాలు, చుట్టుపక్కల గ్రామాలు వరద ముంపుకు గురయ్యే ప్రమాదం ఉంది. సీఎం చంద్రబాబునాయుడు స్వయంగా పరిస్థితిని పర్యవేక్షిస్తున్నారు.బ్యారేజీ గేట్లన్నీ ఎత్తి నీటిని దిగువకు విడుదల చేస్తుండగా.. పరవళ్లు

- మిగతా 2లో..

### వరద సహాయక చర్యల్లో..

## అలసత్వం వహిస్తే చర్యలు

◆ ప్రజలకు నష్టం జరిగితే సహించేది లేదు

◆ సమావేశంలో సీఎం నారా చంద్రబాబునాయుడు



**విజయవాడ-సూర్య వాస్తవం**

క్షేత్ర స్థాయిలో పర్యటించి బాధితులకు ఆహారం అందజేస్తున్నాం. విపరీతంగా వచ్చిన వరదతో మూడు రోజులుగా ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. వారిని ఇబ్బందుల నుండి బయటకు తెచ్చేందుకు సర్వశక్తులు ఒడ్డుతున్నా. 6 హెలికాప్టర్లు, 30 డ్రోన్లు తెప్పించి బాధితులకు ఆహారం అందజేస్తున్నాం. 179 సచివాలయవాల పరిధిలో...ఒక్కో సచివాలయానికి ఒక సీనియర్ అధికారిని నియమించాం. బాధితుల వద్దకు ట్రాక్టర్లు, వ్యాన్లు, ప్రొక్లెయిన్లు, బోట్లు...ఎలా వెళ్లడానికి సాధ్యమైతే ఆ విధంగా వెళ్లేందుకు ఏర్పాట్లు చేశాం. 32 మంది ఐఏఎస్ అధికారులు విధుల్లో ఉన్నారు. 10 జిల్లాల నుండి బాధితుల కోసం ఆహారం తెప్పిస్తున్నాం. మూడు పూటలా బాధితులకు ఆహారం అందిస్తున్నాం. చివరి వ్యక్తి వరకూ సాయం అందిస్తాం. నా సర్వశక్తులొడ్డైనా బాధితులను ఆదుకుంటా. రెండు రోజులు ఇబ్బంది పడ్డారు...ఇక ఇబ్బంది పడటానికి అవకాశం ఉండకూడదు. ఇప్పటికే అధికారులకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చాను...వాటిని పాటించకపోతే కఠిన చర్యలకు తీసుకోవడానికి వెనకాడను. ఆహార సరఫరా సమయంలో బాధితులు ఎక్కువగా గుమికూడకుండా ఉంటే మీరుండే ప్రాంతానికే తీసుకొచ్చి

- మిగతా 2లో..

### కేంద్రం పునరావాసం

## ప్యాకేజీని ప్రకటించాలి

- లోక్‌సభ ప్రతిపక్షనేత రాహుల్ గాంధీ



**న్యూఢిల్లీ-సూర్య వాస్తవం:** వరదలతో సతమతమవుతున్న తెలుగు రాష్ట్రాలకు కేంద్ర ప్రభుత్వం పునరావాస ప్యాకేజీని కల్పించాలని లోక్‌సభ ప్రతిపక్షనేత రాహుల్ గాంధీ డిమాండ్

సూర్య వాస్తవం దినపత్రికలోని మరిన్ని వార్తల కోసం సంప్రదించండి

### అపరాజిత బిల్లును తేనున్న

## మమతా ప్రభుత్వం



**కోల్‌కతా-సూర్య వాస్తవం**

కోల్‌కతా ఆర్ జి కర్ ఆసుపత్రిలో ట్రైనీ డాక్టర్ అత్యాచారానికి, ఆపై దారుణ హత్యకు గురైన సంగతి తెలిసిందే. గత నెల ఆగస్టు 9వ తేదీన జరిగిన ఈ ఘటనకు వ్యతిరేకంగా యావత్ దేశవ్యాప్తంగా వైద్యులు ఆందోళనలు చేపట్టారు. మమతా బెనర్జీ ప్రభుత్వాన్ని కుదిపేసిన ఈ ఘటనపై ఇప్పటికీ నిరసనలు కొనసాగుతున్నాయి. ఈ నేపథ్యంలో పశ్చిమబెంగాల్‌లో క్రిమినల్ చట్టాలను మరింత కఠినతరం చేసి దోషులను శిక్షించే విధంగా మమతా బెనర్జీ ప్రభుత్వం ప్రయత్నిస్తోంది. వైద్య విద్యార్థిని హత్యను ఖండిస్తూ కొనసాగుతున్న నిరసనల మధ్యే ఆ రాష్ట్రంలో తాజాగా ప్రత్యేక అసెంబ్లీ సమావేశాలు జరగనున్నాయి. ఈ సందర్భంగా ప్రత్యేక అసెంబ్లీ సమావేశాల్లో మంగళవారం అపరాజిత వుమెన్ అండ్ చైల్డ్ బిల్లు (పశ్చిమబెంగాల్ క్రిమినల్ చట్టాలు, సవరణ) బిల్లు 2024ను ప్రవేశపెట్టనున్నట్లు తెలుస్తోంది. అత్యాచారానికి, లేదా సామూహిక అత్యాచారానికి పాల్పడిన వారికి పెరోల్ లేకుండా జీవిత ఖైదు విధించేలా ఈ తాజా బిల్లు నిర్దేశిస్తుంది. ఈ బిల్లుపై అసెంబ్లీలో దాదాపు రెండు గంటలపాటు చర్చ జరిగే అవకాశం ఉంది.

### తెలంగాణలో

## రూ.5,430 కోట్ల మేరకు నష్టం

వరద బాధితులను పరామర్శించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి



**మహబూబాబాద్-సూర్య వాస్తవం**

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వరద బాధితులను పరామర్శించేందుకు సోమవారం రోడ్డు మార్గంలో ఖమ్మం వెళ్లారు. మంగళవారం ఉదయం మహబూబాబాద్ జిల్లాలో వరద నీటిలో కొట్టుకుపోయిన యువ శాస్త్రవేత్త కుటుంబాన్ని పరామర్శించారు. ఆ తర్వాత ముంపు ప్రాంతాల్లో పర్యటించి మాట్లాడుతూ ప్రభుత్వం అప్రమత్తం వల్లే పెద్ద నష్టం తప్పిందని అన్నారు. కృష్ణ, ఖమ్మం జిల్లాలు పక్కపక్కనే కవల పిల్లలాగే ఉంటాయని వివరించారు.కృష్ణా జిల్లాలో కంటే ఖమ్మం జిల్లాలోనే రికార్డు స్థాయిలో 42 సెమీ. వర్షపాతం నమోదయిందన్నారు. అందుకే విపరీత నష్టం వాటిల్లిందన్నారు. విపత్తుకు కారణమైన మున్నేరు రిటైనింగ్ వాల్ పై త్వరలో నిర్ణయం తీసుకుంటామన్నారు. త్వరలో ఇంజినీర్లతో చర్చిస్తామన్నారు.భారత రాష్ట్ర సమితి(బిఆర్ఎస్) ప్రభుత్వ హయాంలోనే మిషన్ కాకతీయ

- మిగతా 2లో..

## తెలంగాణలో రూ.5,430 కోట్ల మేరకు నష్టం

(మొదటిపేజీ తరువాయి)
పథకంలో భారీగా దోపిడీ జరిగిందన్నారు. అందుకే ఈ స్థాయిలో చెరువులు తెగాయని ఆరోపించారు. వర్షం, వరద కారణంగా నష్టపోయిన రైతులకు ఎకరానికి రూ. 10 వేలు ప్రకటించనున్నారు. ఇప్పటి వరకు రాష్ట్రవ్యాప్తంగా రూ. 5430 కోట్ల మేరకు నష్టం వాటిల్లినట్లు ప్రభుత్వం అంచనా. తెలంగాణ రాష్ట్రానికి సాయం చేయాలని రేవంత్ రెడ్డి ప్రధాని నరేంద్ర మోడీకి ఈ సందర్భంగా విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా రాష్ట్రంలోని ప్రతిపక్షాలపై ఆయన మండిపడ్డారు. కెసిఆర్ కుటుంబం వద్ద లక్ష కోట్ల రూపాయలున్నాయని, ముఖ్యమంత్రి సహాయ నిధికి రూ. 2000 కోట్లు ఇవ్వొచ్చు కదా అన్నారు. అమెరికాలో కెటిఆర్ ప్రభుత్వంపై విష ప్రచారం చేస్తున్నారన్నారు. హరీశ్ రావు ఏపి ముఖ్యమంత్రి చంద్రబాబు భజన చేస్తున్నాడని విమర్శించారు. త్వరలో అందరి లెక్కలు తీస్తానని, ఖమ్మంలో పువ్వాడ అజయ్ ఆక్రమణల గుట్టు తేలుస్తానని, హరీశ్ రావు వస్తే నిజ నిర్ధారణ కమిటీ వేస్తానని సవాల్ విసిరారు. ఈటెల రాష్ట్ర ప్రభుత్వాన్ని విమర్శించడం మాని కేంద్ర నుంచి నిధులను తెప్పించి, చనిపోయిన వారి కుటుంబాలను ఆదుకోవాలన్నారు.

## కేంద్రం పునరావాసం ప్యాకేజీని ప్రకటించాలి

(మొదటిపేజీ తరువాయి)
చేశారు. ఈ సందర్భంగా తెలంగాణలో వరద పరిస్థితిపై విచారం వ్యక్తం చేశారు. రెండు రాష్ట్రాల్లో భారీ వర్షాలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న ప్రజలకు బాసటగా నిలవాలని, సహాయ పునరావాస కార్యక్రమాల్లో పాలుపంచుకోవాలని కాంగ్రెస్ పార్టీ శ్రేణులకు రాహుల్ గాంధీ విజ్ఞప్తి చేశారు. భారీ వర్షాలు, వరదలతో సమస్యలు ఎదుర్కొంటున్న తెలంగాణ, ఏపీ ప్రజల బాగోగులపై తాను కలత చెందుతున్నానని, వరదల కారణంగా మృతి చెందిన వారి కుటుంబాలకు తాను ప్రగాఢ సానుభూతి తెలుపుతున్నానని సోమవారం ఎక్స్ వేదికగా రాహుల్ గాంధీ పోస్ట్ చేశారు. సహాయ, పునారావస కార్యక్రమాల్లో పాల్గొని బాధితులకు సేవలు అందించాలని పార్టీ శ్రేణులను కోరారు.

## 90 విపత్తుకు విరాళాల వెల్లువ

హైదరాబాద్-సూర్య వాస్తవం

ప్రజలకు ఎప్పుడు ఏ ఆపద వచ్చినా, విపత్తు ముంచెత్తినా... తమ వంతు సాయం చేయడానికి తెలుగు చలన చిత్ర పరిశ్రమ ప్రముఖులు ఎల్లప్పుడూ ఓ అడుగు ముందు ఉంటారు. ఏపీ, తెలంగాణలో భారీ వర్షాలు, వరదల కారణంగా ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. వరద బాధితుల సహాయార్థం చేపట్టే చర్యల కోసం మ్యాన్ ఆఫ్ మాసెస్ ఎన్టీఆర్ కోటి రూపాయలు విరాళం ఇచ్చారు. ఏపీ సీఎం రిలీఫ్ ఫండ్‌కు రూ. 50 లక్షలు, తెలంగాణ ముఖ్యమంత్రి సహాయ నిధికి మరొక 50 లక్షల రూపాయలు ఇచ్చారు. ఆయన తర్వాత మరికొందరు విరాళాలు ప్రకటించారు.

మాటల మాంత్రికుడు, గురూజీ త్రివిక్రమ్ శ్రీనివాస్... ఆయనతో వరుసగా సినిమాలు నిర్మిస్తున్న హారిక అండ్ హాసిని క్రియేషన్స్ అధినేత సూర్యదేవర రాధాకృష్ణ (చిన బాబు), సూర్యదేవర నాగవంశీ 50 లక్షల రూపాయల విరాళం ప్రకటించారు. ఏపీ ముఖ్యమంత్రి సహాయ నిధికి రూ. 25 లక్షలు, తెలంగాణ ముఖ్యమంత్రి సహాయ నిధికి రూ. 25 లక్షలు ఇస్తున్నట్టు ఓ ప్రకటనలో తెలిపారు."భారీ వర్షాల వల్ల ఉభయ తెలుగు రాష్ట్రాల్లో జరుగుతున్న భారీ ఆస్తి, ప్రాణ నష్టాలు మమ్మల్ని ఎంత గానో కలసి వేశాయి. ఈ విపత్తు నుంచి తెలుగు ప్రజలు త్వరగా కోలుకోవాలని ఆ భగవంతుడ్ని ప్రార్థిస్తూ... మా వంతు సాయంగా చేయూత అందిస్తున్నాం" అని త్రివిక్రమ్, చినబాబు, నాగవంశీ పేర్కొన్నారు.

### రెండు తెలుగు రాష్టాలకు రూ. 30 లక్షలు ప్రకటించిన సిద్ధూ

'డీజే టిల్లు', 'టిల్లు స్క్వేర్'తో పాటు పలు హిట్ సినిమాలు చేసిన యంగ్ హీరో, స్టార్ బాయ్ సిద్ధూ జొన్నలగడ్డ. ఏపీ, తెలంగాణ... రెండు తెలుగు రాష్ట్రాలకు ఆయన రూ. 30 లక్షల విరాళం ఇవ్వనున్నట్లు తెలిపారు. ఏపీ సీఎం రిలీఫ్ ఫండ్‌కు రూ. 15 లక్షలు, తెలంగాణ సీఎం రిలీఫ్ ఫండ్‌కు రూ. 15 లక్షలు విరాళం ప్రకటించారు. "ఇది కొంత మందికి అయినా ఏదో ఒక విధంగా ఉపయోగపడుతుందని ఆశిస్తున్నాను" అని చెప్పారు. మరో యువ కథానాయకుడు విశ్వక్ సేన్ ఏపీ, తెలంగాణకు ఐదేసి లక్షల చొప్పున విరాళం ప్రకటించిన సంగతి తెలిసిందే.

యువ కథానాయకుడు, ఎన్టీఆర్ వీరాభిమాని విశ్వక్ సేన్ సైతం ఏపీలో వరద విపత్తు సహాయక చర్యల కోసం ఐదు లక్షలు విరాళం ఇస్తున్నట్టు సోషల్ మీడియాలో ట్వీట్ చేశారు. ఏపీకి ఐదు లక్షలతో పాటు తెలంగాణకు మరొక ఐదు లక్షల విరాళం ప్రకటించారు. వైజయంతి మూవీస్ రూ. 25 లక్షలు విరాళం ప్రకటించిన సంగతి తెలిసిందే.

### జూనియర్ ఎన్టీఆర్ విరాళం

టాలివూడ్ నటుడు జూనియర్ ఎన్టీఆర్ వరద సహయం కోసం కోటి రూపాయల విరాళం ప్రకటించారు. ..రెండు తెలుగు రాష్ట్రాల్లో ఇటీవల కురిసిన భారీ వర్షాల వల్ల జరుగుతున్న వరద భీభత్సం నన్ను ఎంతగానో కలచివేసింది. అతిత్వరగా ఈ విపత్తు నుండి తెలుగు ప్రజలు కోలుకోవాలని నేను ఆ దేవుడిని ప్రార్థిస్తున్నాను.

వరద విపత్తు నుండి ఉపశమనం కోసం రెండు తెలుగు రాష్ట్రాల ప్రభుత్వాలు తీసుకొనే చర్యలకి సహాయపడాలని నా వంతుగా ఆంధ్ర ప్రదేశ్ మరియు తెలంగాణ ప్రభుత్వాల ముఖ్యమంత్రి సహాయ నిధికి చెరొక 50 లక్షల విరాళం గా ప్రకటిస్తున్నానని అన్నారు.

# పీకల్లోతు కష్టాల్లో బెజవాడ





(మొదటిపేజీ తరువాయి)
తొక్కుతున్న కృష్ణమ్మను చూసేందుకు విజయవాడ బస్టాండ్ ఎదురుగా ఉన్న ఘాట్ కు పర్యాటకులు పోటెత్తుతున్నారు. లేక్ వ్యూ పాయింట్ పార్క్ లోకి వరద నీరు ఎదురు వస్తుండటంతో పార్క్ ను క్లోజ్ చేశారు. సందర్శకులెవరూ రావొద్దని పోలీసులు వారిస్తున్నా.. జనం వినకుండా నది వద్దకు చేరుకుంటుండటంతో వారిని కంట్రోల్ చేయడం పెద్ద టాస్క్ గా మారింది. ప్రకాశం బ్యారేజీ వద్ద పిల్లర్ నంబర్ 69కి బోట్లు కొట్టుకు రావడంతో.. పిల్లర్ పాక్షికంగా డ్యామేజ్ అయినట్లు వీడియోలు నెట్టింట వైరల్ అవుతున్నాయి. సికింద్రాబాద్ నుంచి విజయవాడకు వచ్చే ట్రైన్ మార్గం మధ్యలో మహబూబాబాద్ వద్ద ట్రాక్ కొట్టుకుపోవడంతో.. ఆ మార్గంలో వచ్చే రైళ్లను గుంటూరు మీదుగా దారి మళ్లించిన విషయం విధితమే. అవన్నీ కృష్ణానది రైల్వే బ్రిడ్జిని దాటి విజయవాడ స్టేషన్ మీదుగా గమ్యస్థానానికి చేరుకావాల్సినవి. ఈ క్రమంలో బ్రిడ్జి మీది నుంచి వెళ్లే రైళ్లలో ఉండే ప్రయాణికులు భయాందోళనకు గురవుతున్నారు. నదికి, ట్రాక్ కు కొంచెం గ్యాప్ మాత్రమే ఉండటంతో ఏ క్షణానైనా ట్రాక్ మునిగిపోయే ప్రమాదం ఉందంటున్నారు. దీంతో విజయవాడ నుంచి, విజయవాడ మీదుగా ఆ బ్రిడ్జి నుంచి వెళ్లే రైళ్లను రైల్వే శాఖ అధికారులు తాత్కాలికంగా క్యాన్సిల్ చేశారు. ఆగస్టు 31న రాత్రి సికింద్రాబాద్ నుంచి బయల్దేరి.. 8-9 గంటల్లో గమ్యస్థానాలను చేరుకోవాల్సిన బీదర్ సూపర్ ఫాస్ట్ ఎక్స్ ప్రెస్, సింహపురి ఎక్స్ ప్రెస్ రైళ్లు.. 25 నుంచ30 గంటల తర్వాత గమ్యస్థానాలను చేరుకున్నాయి. విజయవాడ నుంచి వయా వరంగల్ సికింద్రాబాద్ వెళ్లాల్సిన రైళ్లు సైతం ఆలస్యమయ్యాయి. హైదరాబాద్ వెళ్లాల్సిన ప్రయాణికులు తమ ప్రయాణాలను వాయిదా వేసుకోవాలని రైల్వే అధికారులు, ఆర్టీసీ అధికారులు సూచిస్తున్నారు.

### ఏపీకి పొంచి ఉన్న ముప్పు

ఆంధ్రప్రదేశ్‌కు వాయుగండం ముప్పు తొలగిపోయిందని ప్రజలు కాస్త ఊపిరి పీల్చుకుంటున్నారు. అయితే ఇంతలో మరో ముప్పు ఏపీని వెంటాడుతోంది. రాష్ట్రంలో మళ్లీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణశాఖ హెచ్చరించింది. ఈ నెల 5, 6 తేదీల్లో బంగాళాఖాతంలోని ఉత్తర అండమాన్ ప్రాంతంలో మరో అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. కోస్తాంధ్ర తీరాన్ని ఆనుకొని ఏర్పడనున్న అల్పపీడనం ప్రభావంతో ఏపీలో మళ్లీ వర్షాలు కురుస్తాయని భావిస్తున్నారు.

ఒకవేళ బంగాళాఖాతంలో ఏర్పడే అల్పపీడనం మెల్లిగా బలపడి తుఫాన్‌గా మారి విశాఖపట్నం, ఒడిశా దిశగా ప్రయాణించి తీరం దాటే అవకాశం ఉన్నట్లు మరో అంచనా వేస్తున్నారు. బుధవారంలోపు ఈ అల్పపీడనంపై పూర్తిగా క్లారిటీ వస్తుందంటున్నారు. ఈ అల్పపీడనం ప్రభావంతో ఈ నెల 6, 7 తేదీల్లో కోస్తాలోని పశ్చిమ గోదావరి, ఏలూరు, కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు, పల్నాడు, బాపట్ల, ప్రకాశం జిల్లాల్లో తేలికపాటి నుంచి ఒక మోస్తరు వర్షాలు.. అక్కడక్కడ మాత్రం భారీ వర్షాలు కురుస్తాయని అంచనా వేస్తున్నారు. ఈ నెల 7న ఉమ్మడి తూర్పు గోదావరి, విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల్లో ఒక మోస్తరు వర్షాలు కురుస్తాయంటున్నారు. వాయుగుండం ప్రభావం నుంచి ఇంకా పూర్తిగా తేరుకోకముందే మరో అల్పపీడనం ఇప్పుడు అందరిని టెన్షన్ పెట్టిస్తోంది. అంతేకాదు రాజస్థాన్‌లోని జైసల్మేర్ నుంచి విదర్భ, తెలంగాణ మీదుగా మచిలీపట్నం వరకు రుతుపవన ద్రోణి ఆవరించబోతున్నట్లు మరో అంచనా ఉంది. అలాగే బంగాళాఖాతంలో ఏర్పడ్డ వాయుగుండం హారాష్ట్రలోని తూర్పు విదర్భ, తెలంగాణ పరిసరాల్లో కొనసాగుతోంది. ఈ వాయుగుండం రాబోయే 12 గంటల్లో పశ్చిమ-వాయవ్య దిశగా కదులుతూ తీవ్ర అల్పపీడనంగా బలహీనపడుతుందని తెలిపింది వాతావరణశాఖ.

ఈ ప్రభావంతో ఏపీలో రాబోయే ఐదు రోజుల్లో తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు కురుస్తాయని అంచనా వేస్తున్నారు. గంటకు 30 నుంచి 40 కి.మీ. వేగంతో బలమైన గాలులు వీస్తాయని చెబుతున్నారు. వచ్చే రెండు, మూడు రోజుల్లో కృష్ణానదికి వరద ప్రవాహం మళ్లీ పెరిగే అవకాశం ఉందంటున్నారు. అల్పపీడన ద్రోణి ప్రభావంతో మహారాష్ట్ర, కర్ణాటక ప్రాంతాల్లో వానలు పడుతున్నాయి.. ఇప్పటికే కృష్ణా పరీవాహక ప్రాంతంలోని ప్రాజెక్టులన్నీ నిండిపోవడంతో వచ్చిన నీటిని వచ్చినట్లు దిగువకు విడుదల చేయాల్సిన పరిస్థితి ఉంది. దీంతో శ్రీశైలం, నాగార్జునసాగర్, పులిచింతలకు వరద పెరుగుతుందని ఓ అంచనా ఉంది. ప్రస్తుతం ఉన్న వరద మంగళ, బుధవారాల్లో మరింత పెరిగే అవకాశం ఉందంటున్నారు. ప్రస్తుతం ప్రకాశం బ్యారేజ్ దగ్గర వరద కాస్త తగ్గుముఖం పట్టింది. ప్రస్తుతం బ్యారేజీ దగ్గర 9.40 క్యుసెక్కుల వరద ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. ఇవాళ మరికొంత వరద తగ్గే అవకాశం ఉంది.

# వరద సహాయక చర్యల్లో అలసత్వం వహిస్తే చర్యలు

(మొదటిపేజీ తరువాయి)
అందిస్తాం. ఒక్కో బోటులో నలుగురు సిబ్బంది, ఒక ఆక్టోపస్, ఒక గ్రేహౌండ్ ఉంటారు. సరిగా పనిచేయని పోలీసులను కూడా హెచ్చరిస్తున్నా...ప్రజలకు నష్టం జరిగితే ఊరుకునేది లేదు. రెండు రోజులుగా వరద బాధిత ప్రజలు పడుతున్న బాధలు నేను నేరుగా చూశాను. బిడ్డను బతికించుకోవడానికి భార్యను భర్త వదిలి రావాల్సి వచ్చిందంటే పరిస్థితి ఎంత దారుణంగా ఉందో మనం అర్థం చేసుకోవాలి. వృద్ధులు నడవలేక ఇబ్బందులు పడుతున్నారు. ప్రతి ఇంట్లోకి నీళ్లతో పాటు పాములు వచ్చి చేరుతున్నాయి...దీంతో భయాందోళనకు గురవుతున్నారు. ప్రతి కుటుంబం బాధలో ఉంది..మానవతా దృక్పదంతో పని చేద్దాం. బాధితులు కూడా ఐవీఆర్ఎస్ కాల్ కు సరైన సమాధానం ఇవ్వండి. ఎక్కడ ఆహారం అందలేదో అక్కడికి అధికారులను పంపుతాం. విపత్కర పరిస్థితుల్లో ఉన్నప్పుడు ఎప్పటికప్పుడు సమాచారం అందించాలి. మూడు రోజులుగా వరద ప్రభావిత ప్రాంతాల్లో పర్యటిస్తున్నా.. ఇక నుండి ఎవ్వరు పని చేయకపోయినా కఠిన చర్యలు ఉంటాయి. మానవతా దృక్పదంతో పనిచేసే ప్రభుత్వ ప్రతిష్ట పెంచుకుందాం. ప్రజలు కష్టాల్లో ఉన్నప్పుడు సర్వశక్తులు ఒడ్డి కాపాడాలి. నిర్లక్ష్యంగా వ్యవహరించడం మంచిది కాదు. బాధితుల కోసం ఎంతైనా ఖర్చు చేస్తాం. బాధితులంతా సంయమనం పాటించాలి. అరగంట ఆలస్యమైనా అందరికీ న్యాయం చేస్తాం. రాష్ట్రంలోని ప్రజలకు కూడా పిలుపునిస్తున్నా.. సమాజంలో బాధ్యత కలిగిన మనం బాధితులకు అండగా నిలవాల్సిన అవసరం ఉంది. ఏ విధంగా సాయం అందిస్తారో మీ ఇష్టం. సాటి మనిషి ఇబ్బందుల్లో ఉన్నప్పుడు భోజనం అందిస్తారా, నిత్యావసర సరకులు అందిస్తారా, పరామర్శించి ధైర్యం చెప్తారా...ఏదైనా మీ శక్తి మేరకకు చేయండి. సమాజం బాగుంటేనే మనం బాగుంటాం. మేము చేయాల్సిన పనులన్నీ చేస్తున్నాం.

### వారిది చెత్త రాజకీయం

కొందరు చెత్త రాజకీయాలు చేయకుండా ప్రజాహితం కోసం పనిచేయాలి. ఆపద సమయంలో కుట్రలు జరుగుతున్నాయి. అధికారులు బాధ్యటాయితంగా పనిచేయాలి. సహాయకచర్యలకు భంగం కలిగించి ప్రభుత్వానికి చెడ్డ పేరు తేవాలని కుట్రలు జరుగుతున్నాయి. ఇలాంటి వాటిని సాహించేది లేదు. మీడియా ప్రతినిధులు కూడా నిర్మాణాత్మకంగా వ్యవహరించాలి.

తప్పుడు వార్తలు ప్రచారం చేయడం సమంజసం కాదు. పెద్ద ఎత్తున నీటి ట్యాంకులు తెప్పించి పరిసరాలు శుభ్రం చేస్తాం. మరో కంట్రోల్ రూమ్ కూడా ఏర్పాటు చేస్తాం. ఐదేళ్లు వ్యవస్థలన్నీ నిర్వీర్యం అయ్యాయి...అధికారులు పని చేయడం మానేశారు. ఇప్పటికే విధుల్లో నిర్లక్ష్యం వహించిన కొందరు అధికారులకు షోకాజ్ నోటీసులు కూడా పంపించాం. ఇప్పటికే జక్కంపూడిలో ఓ అధికారిని సస్పెండ్ చేశాం. సరిగా పని చేయకపోతే ఎవరినీ ఉపేక్షించం. మంత్రులు కూడా సరిగ్గా పనిచేయక పోయినా చర్యలు తీసుకుంటాం. మన కుటుంబ సభ్యులు ఒకరు చనిపోతే మనం ఎలా బాధపడతామో అధికారులు కూడా ప్రజల బాధల పట్ల అదే విధంగా ఆలోచించాలి. ఎన్నో ఘటనలు చూశాను...అందుకే నాకు బాధ కలిగింది. వర్షం పడి ప్రజలు ఇబ్బందుల్లో ఉంటే గుడ్లవల్లేరు కాలేజీలో సమస్య అంటూ మాట్లాడుతున్నారు. సిగ్గుంటే ఇలా మాట్లాడతారా.?తీ రాజకీయ ముసుగులో నేరస్తులుగా ఉండేవారు మా అటెన్షన్ డైవర్ట్ చేసి ప్రజల్ని ఇబ్బందులకు గురి చేయాలని చూస్తున్నారు.

ప్రకాశం బ్యారేజీకి కొట్టుకొచ్చిన బోట్లపైనా విచారణ చేస్తాం. బోట్లు తగిలిన చోట్ల పిల్లర్ దెబ్బతింది. ఫుడ్ పాయిజన్ చేస్తున్నారు. బాబాయ్ ని చంపి నారాసుర రక్త చరిత్ర అని నాపై వార్తలు రాసిన వాళ్లపై ఇలాంటి అనుమానులు ఎందుకు రావు.? తప్పులు జరక్కుండా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉంది..దుర్మార్గుల నుండి ప్రజల్ని కాపాడుకుని మనం ముందుకెళ్లాలి. ఏస్థాయిలో తప్పు జరిగినా ఉపేక్షించను. నిన్న, మొన్న కొందరు అధికారులు సరిగా పని చేయలేదు. ప్రజలు కట్టే పన్నుల నుండి జీతాలు తీసుకుంటున్నారని గుర్తుంచుకోవాలి. సమాజానికి తప్పుడు సంకేతాలు ఇచ్చి పరువు పోగొట్టుకోవద్దు. సమాజ హితం కోసం ప్రతి ఒక్కరూ పని చేయాలని కోరుతున్నా.

### 5 నిమిషాలు షో చేసి వెళ్లారు

నిన్న ఐదు నిమిషాలు జగన్ వచ్చి షో చేశారు. కనీసం ఒక్కరికైనా ఒక పొట్లం ఆహారమైనా అందించారా.? ఒక్కరినైనా రక్షించారా..కనీసం పలకరించారా.? వికృత చేష్టలకు పాల్పడుతున్నారు. అంతర్జాతీయ డ్రగ్ మాఫియా డాన్ ఎస్కో బార్ కూడా జగన్ లాగే వ్యవహరించేవారు. వీఆర్ లో పెడితే పని చేయరా...జీతం తీసుకోవడం లేదా.? ప్రజలు ఉంటేనే మనం ఉంటాం. ప్రజలు ఇబ్బందుల్లో ఉంటే కొందరు మీనవేషాలు లెక్కిస్తున్నారు. నేను ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించి, బాధితులకు సాయం అందించాలని ఆదేశించినా క్షేత్ర స్థాయిలో కొందరు అధికారులు పని చేయడం లేదని బాధితులు చెప్తున్నారు. హుద్ హుద్ సమయంలో చేసిన సేవలను నాడు ప్రధాని చూసి అభినందించారు. ఈ వరదలతో ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకునేందుకు ఇక్కడే ఉండి పని చేస్తున్నాం. మూడు రోజులు బిడ్డకు పాలు అందకపోతే ఏ తల్లిదండ్రులైనా బాధపడతారు..అందుకే మానవతా దృక్పందంతో పని చేయాలని చెప్తున్నా. రేపటిలోగా సరిగా పని చేయని అధికారులు తీరు మార్చుకోకపోతే ఇక ఆ తర్వాత మీరే చూస్తారు' అని సీఎం హెచ్చరించారు.

Truth of News
సూర్య వాస్తవం
http://www.suryavastavam.in

## సంపాదకీయం

### జలవిలయాల ప్రభావం

# తగ్గించలేమా!

సరిగ్గా నెల రోజుల క్రితం జులై 30 కేరళలో వయనాడ్‌లో ఆకాశం బద్దలైంది. కొండలు కూలిపోయాయి. ఊళ్లు నామరూపాలు లేకుండా పోయాయి. 392 మంది ప్రాణాలు కోల్పోయారు. ఇప్పటికీ ఏ రోజుకారోజు కేరళ వరదలు సృష్టించిన విధ్వంసం తాలుకూ చేదు జ్ఞాపకాలు ఏదో ఒక రూపంలో స్థానికుల్ని వెంటాడుతునే ఉన్నాయి. నిలువ నీడ లేకుండా మిగిలిన పోయిన కుటుంబాల ఇప్పట్లో తేరుకునేలా కనిపించడ లేదు. యావత్ దేశం కేరళను ఆదుకునేందుకు ముందుకొచ్చింది.ఆగస్ట్ 2024 వర్షాలు స్టిల్ కంటిన్యూ? అయినా వర్షాకాలం వర్షాలు కాక.. ఎండలు కాస్తాయా అన్న వాళ్లు లేకపోలేదు. కానీ ఈ వర్షాలు వర్షాకాలం వర్షాల్లా కురిస్తే.. మనం ఇంత ఘనం మాట్లాడుకోవాల్సిన పని లేదు. మహారాష్ట్రను ముంచేసింది. ముంబై మహానగరం కూడా వర్షాలకు అల్లాడిపోక తప్పలేదు. ఆ పై గుజరాత్‌ను గజగజలాడించాయి. ఇప్పటికే మూడు పదలుకుపైగా ప్రాణాలు పోయాయి. సుమారు 20 వేల మందిని సురక్షిత ప్రాంతాలకు తరలించారు.ఇక తెలుగు రాష్ట్రాల విషయానికొస్తే ఈ ఏడాది నైరుతి ముందే వచ్చినా వర్షాలు ఆలస్యమయ్యాయి. జూలై 3–4 వారాల వరకు పెద్దగా వర్షాల జాడే లేదు. ఎగువన కర్నాటక, మహారాష్ట్రాలలో కురిసిన వర్షాల ధాటికి క్రమంగా ప్రాజెక్టులు నిండటం మొదలైంది. ఆపై తెలుగు రాష్ట్రాల్లోనూ వరణుడు కరుణించడంతో నాలుగైదు రోజుల క్రితం వరకు అన్ని ప్రాజెక్టులు కళకళలాడుతూ కనిపించాయి. ఆగస్టు కూడా ముగిసి సెప్టెంబర్ వస్తూ ఉండటంతో.. ఈ ఏడాదికిక వర్షాలు సరిపోతాయనుకున్నారంతా.. బట్?జూలై 30 కేరళను అతలాకుతలం చేసేస్తే? సరిగ్గా నెల రోజుల్లో అంటే ఆగస్టు 30–31 తెలుగు రాష్ట్రాలను ముంచేశాడు వరుణుడు. ఇప్పటికి ఎన్ని సార్లు వాయుగుండాలు రాలేదు.. అయినా.. ఈ వాయుగుండం సృష్టించినంత విలయం బహశా.. గడిచిన కొన్నేళ్లలో ఎప్పుడూ జరగలేదేమో.. ఎక్కడో ఉత్తరాంధ్రలో కళింగపట్నం దగ్గర తీరం దాటిన వాయుగుండం కృష్ణా, గుంటూరు, ఖమ్మం, నల్గొండ జిల్లాలలో ఇంత బీభత్సం సృష్టిస్తుందని ఎవ్వరూ ఊహించి ఉండరు. నిజానికి వాయుగుండం తీరం దాటిన శ్రీకాకుళం జిల్లా కళింగపట్నం ప్రాంతంలో మాములూ వర్షమే పడింది. పెద్దగా ఈదురు గాలులు కూడా లేవు. దీంతో అక్కడ ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. కానీ అంతంత మాత్రం ప్రభావం ఉంటుందనుకున్న కృష్ణా–గుంటూరు, ఖమ్మం, నల్గొండ జిల్లాల్లోనూ ఇటు తెలంగాణలోని కొన్ని జిల్లాల్లో మాత్రం రికార్డు స్థాయి వర్షాలు నమోదయ్యాయి వాయుగుండం తీరం దాటిన ప్రాంతంలోనే దాని ప్రభావం ఉంటే.. ఈ స్థాయిలో ఆస్తినష్టం సంభవించి ఉండేది కాదు. ఎందుకంటే తీరం దాటిన ప్రాంతంలో విజయవాడ నగరం.. దాని చుట్టు పక్కల ప్రాంతాల్లో ఉండేంత జన సాంద్రత ఉండదు. ఇళ్లు, భవనాలు కూడా ఉండవు. పైగా ఆ ప్రాంతంలో ఉన్నవన్నీ గ్రామాలే. కానీ వాస్తవం వేరుగా ఉంది.విజయవాడ–గుంటూరు–ఖమ్మం–నల్గొండ.. ఈ ప్రాంతాల్లోనే కాదు.కానీ రెండు రాష్ట్రాల్లోని ఆ నాలుగు జిల్లాల్లో ఉన్న ప్రభావం తెలంగాణలోని మిగిలిన జిల్లాల్లో లేదు. అటు ఏపీలోని విజయవాడ–గుంటూరు, ఇటు తెలంగాణలో ఖమ్మం–నల్గొండ.. ఈ నాలుగు జిల్లాలు తెలుగు రాష్ట్రాల సరిహద్దుల్లో ఉన్న జిల్లాలు. అలాగే హైదరాబాద్ మహానగరాన్ని ఏపీతో కలిపే జిల్లాలు. దీంతో ఆ నాలుగు జిల్లాల్లో కురిసిన వర్షాలు, అక్కడ సంభవించిన వరదల వల్ల ప్రభావితమైన ప్రజల సంఖ్య చాలా ఎక్కువగా ఉంది. ఖమ్మం, నల్గొండలో కురిసిన వర్షాల ధాటికి విజయవాడ–హైదరాబాద్ జాతీయ రహదారులు నీటి మునిగాయి. దీంతో రాకపోకలకు బ్రేక్ పడింది. కేవలం విజయవాడ–హైదరాబాద్ రోజుకి సుమారు 24వేల వాహనాలు తిరుగుతాయి. దీంతో గడిచిన 24 గంటలుగా అక్కడ రాకపోకలు స్తంభించడంతో రెండు రాష్ట్రాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అటు రైల్వే లైన్లు కూడా దెబ్బతినడంతో విజయవాడ మీదుగా నడిచే 130 రైళ్లను రద్దు చేశారు. విజయవాడ–హైదరాబాద్‌ల మధ్య కె సముద్రం వద్ద రైల్వేట్రాక్ దెబ్బతినడంతో చాలా రైళ్లపై ప్రభావం పడింది.ఏపీలో విజయవాడ పరిస్థితి అలా ఉంటే.. తెలంగాణ రాష్ట్రానికొస్తే.. ఇక్కడ ఖమ్మం జిల్లాపై ఆ స్థాయిలో ప్రభావం పడిందని చెప్పొచ్చు. శనివారం రాత్రి ఖమ్మం నగరంలో కురిసిన వర్షం ధాటికి జనం అల్లాడిపోయారు. చాలా ప్రాంతాల్లో ఇళ్లల్లోకి నీరు చేరింది. దానికి తోడు మున్నేరు వాగు పొంగడంతో కట్టుబట్టలతో జనం మిగిలిపోయిన పరిస్థితి నెలకొంది. ఈదురు గాలులకు విద్యుత్ స్తంభాలు విరిగిపడ్డాయి. చాలా ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. సెల్ టవర్లు పని చెయ్యలేదు. కొన్ని ప్రాంతాల్లో ఊరేదో.. చెరువేదో.. నది ఏదో కూడా తెలుసుకోలేని పరిస్థితులు నెలకొన్నాయి. ఖమ్మం–హైదరాబాద్ జాతీయ రహదారి కొట్టుకుపోయింది. పాలేరు వరద ఉధృతికి కూసుమంచి దగ్గర హైవే ధ్వంసమైంది. మంత్రి పొంగులేటి నియోజకవర్గంలో చాలా ప్రాంతాల్లో వరదలో చిక్కుకున్నాయి. జనం కట్టుబట్టలతో మిగిలిపోవాల్సిన పరిస్థితి నెలకొంది. భద్రచాలం వద్ద గోదావరికి గతంలో సెప్టెంబర్ నెలలో కూడా వరదలు ముంచెత్తిన చరిత్ర ఉండటంతో స్థానికులు భయం భయంగా కాలం గడుపుతున్నారు.జులై–ఆగస్టు.. రెండు నెలలు కేరళ, మహారాష్ట్ర, గుజరాత్, ఏపీ, తెలంగాణ రాష్ట్రాలకు తీరని వ్యధను మిగిల్చాయి. మరి సెప్టెంబర్ సంగతేంటి..? ఈ నెలలో పరిస్థితి ఎలా ఉండబోతోంది..? గడిచిన 2 నెలలు చూసిన తర్వాత సహజంగానే అందరి దృష్టి ఈనెలపైనే ఉంది. గడిచిన ఐదేళ్లలో సెప్టెంబర్లోను తుపానులు బీభత్సం సృష్టించాయి. 2018లో ఒడిషాలో, 2021లో గుజరాత్, ఏపీ, ఒడిషా రాష్ట్రాల్లో వర్షాలు వణకుపుట్టించాయి. తాజా పరిస్థితిని చూసిన తర్వాత ఇప్పుడు సెప్టెంబర్లో ఏం జరుగుతుందా అన్న భయం నెలకొంది. అదే సమయంలో తాజాగా భారత వాతావరణ శాఖ దాదాపు అలాంటి వార్తనే అందించింది.దేశం మొత్తం మీద ఆగస్టు నెలలో రికార్డు స్థాయిలో 16శాతం అదనంగా వర్షాలు పడ్డాయి. దాదాపు ఇదే పరిస్థితి ఈ నెలలో కూడా ఉండొచ్చున్నది ఐఎండీ అంచనా. చాలా చోట్ల రుతుపవనాల ప్రభావంతో సాధారణ వర్షపాతాలే నమోదవుతాయని వెల్లడించింది. అయితే ఉత్తరాఖండ్, రాజస్థాన్, హిమాచల్ ప్రదేశ్, పంజాబ్ రాష్ట్రాల్లో మాత్రం భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందన్నది వాతావరణ శాఖ తాజా హెచ్చరిక. ముఖ్యంగా హిమాచల్ ప్రదేశ్, పంజాబ్ రాష్ట్రాలలో భారీగా వరదలు, కొండచరియలు విరిగిపడే ప్రమాదం ఉందని కూడా వార్నింగ్స్ ఇచ్చింది.ప్రస్తుతానికి దేశంలో లా నినా ప్రభావం ఇంకా పూర్తిగా ముగియలేదన్నది ఐఎండీ చెబుతున్న మాట. సెప్టెంబర్ చివరినాటికి ముగిసే అవకాశం ఉందని, అయితే ఈ ప్రభావం వచ్చే సమ్మర్ మాన్ సూన్‌పై ఉండదని అప్పటికల్లా లా నినా ప్రభావం పూర్తిగా తగ్గిపోతుందని వాతావరణ శాఖ అధికారులు చెబుతున్నారు. ఈశాన్య భారతం, అలాగే దక్షిణాది రాష్ట్రాలలో సెప్టెంబర్–నవంబర్ నెలల మధ్యలో దాని ప్రభావం కనుమరుగువుతుందని అన్నారు. అయితే ప్రభావం తగ్గే సమయంలో పరిస్థితులు ఎలా ఉంటాయన్నది అప్పడే అంచనా వేసే పరిస్థితి ఉండదు. లానినా వల్ల ముమ్ముందు తుపాను ముప్పు ఉంటుందా.. ఉండదా అన్న అంచనాల విషయంలో ఇంకా వాతావరణ శాఖ ఒక కొలిక్కి రాలేదు.

# బెజవాడపై కన్నెర్ర చేసిన బుడమేరు

**విజయవాడ-సూర్య వాస్తవం**



మనిషి ప్రకృతి ముందు ఎంత అల్పుడో మొన్న కేరళలోని వయనాడ్ బీభత్సం తెలియజేస్తే లేటెస్ట్‌గా బెజవాడ వరదలు మరోసారి కన్నెర్రశాయి. ముఖ్యంగా విజయవాడ సిటీ మధ్యలో ప్రవహించే బుడమేరు అనే చిన్న నది నిజానికి నది అని పిలిచినా ఇది ఒక పెద్ద సైజు కాలువ అని చెప్పుకోవచ్చు) ఈరోజు నాలుగు జిల్లాల ప్రజలను బెంబేలెత్తిస్తోంది. విజయవాడ సిటీ అయితే రెండు రోజులుగా నిద్ర పోవడం లేదు. సగానికిపైనే నగరం మొత్తం నీటిలో మునిగిపోయింది. విజయవాడ శివారు గ్రామాలు, ఏరియాలు పూర్తిగా బాహ్య ప్రపంచంతో సంబంధాలు తెగిపోయాయి. సింగ్‌నగర్, రామకృష్ణాపురం, నందమూరినగర్, నున్న, విజయవాడ వన్‌టౌన్, కృష్ణలంక, ఇబ్రహీంపట్నంలలో ఇళ్ళలోకి నీరు చేరిపోయింది. రామవరప్పాడు రైల్వే స్టేషన్ అయితే మొత్తానికి నీట మునిగింది. బుడమేరు వాగు తన విశ్వ రూపాన్ని చూపిస్తోంది. దాని కట్ట తెగిపోవడంతో విజయవాడను ముంచెత్తింది. చాలామంది ప్రజలు మునిగిపోయిన ఇళ్ళలోనే ఇంకా చిక్కుకు పోయారు. వారిని కాపాడటానికి కేంద్రం నుంచి ఎన్డీఆర్ఎఫ్ బృందాలు, స్పీడ్ బోట్లు, హెలికాప్టర్లు ప్రత్యేకంగా విజయవాడ చేరుకున్నాయి. ఇంతటి విధ్వంసాన్ని సృష్టించిన బుడమేరు కథేంటి. దానివరదను ఎందుకు అంచనా వేయలేకపోయారు అనే విషయాల్లోకి వెళితే చాలా అంశాలు బయటకు వస్తాయి.బుడమేరు అనేది మైలవరం కొండల్లో పుట్టిన ఒక పెద్ద వాగు. అయితే చరిత్రలో చాలా ఏళ్ళ నుంచి దానిని నదిగానే పరిగణిస్తూ అంటారు. ఏడాది పొడువునా ఏదో ఒక స్థాయిలో దీన్లో నీళ్ళు ఉంటాయి. కృష్ణా, గోదావరి పరివాహక ప్రాంతాల మధ్య విస్తరించి ఉన్న అతిపెద్ద మంచినీటి సరస్సు కొల్లేరుకు నీటిని సప్లయి చేసే అతి పుట్టిన ప్రాంతం నుంచి దాదాపు 170ఎం దూరం ప్రవహించే బుడమేరులో ఏటా 10 వేల నుంచి 11 వేల క్యూసెక్కుల వరకు నీరు ప్రవహిస్తూ ఉంటుంది. అయితే 2005 ప్రాంతంలో వచ్చిన వర్షాలకు బుడమేరులో ఏకంగా 75 వేల క్యూసెక్కుల నీరు ప్రవహించింది అని చెబుతారు. అప్పుడే విజయవాడ చాలా వరకూ దెబ్బతింది. ఆ తరువాత 2009లో మరోసారి అలాంటి పరిస్థితే ఎదురైంది. బుడమేరు వాగు తన ప్రయాణంలో చాలా మలుపులు మెలికలు తిరుగుతూ ఉంటుంది. దానివల్ల ఎక్కువ ప్రవాహం వచ్చినపుడు అది గట్టు దాటి చుట్టూ ఉన్న ప్రాంతాలకు చేరిపోతూ ఉండేది. అందుకే ఈ నదికి బెజవాడ దుఃఖ:దాయని అని పేరు పడింది. 2005లో వచ్చిన భారీ వరదలు చూసిన ఇరిగేషన్ శాఖ బుడమేరు నది పొడవునా ఒక రిటైనింగ్ వాల్ నిర్మించాలనే సూచన చేసింది. దీనిపై అప్పట్లో కొంతమేర వర్క్ జరిగినా తరువాత పూర్తిగా పక్కన పెట్టేశారు. బుడమేరు నుంచి నీరు రెండు భాగాలుగా ఒకటి డైరెక్ట్‌గా కొల్లేరు చేరుకుంటే మరొకటి కృష్ణలో కలుస్తుంది. ఈ కృష్ణలో కలిసే భాగం మధ్యలో పోలవరం నుంచి వచ్చే కాలువతో చేరుతుంది. కొల్లేరుకు వెళ్ళే నది మధ్యలో కృష్ణ నుంచి విజయవాడ సిటీ మధ్యగా ప్రవహించే ఏలూరు కెనాల్‌లో కలుస్తుంది. బుడమేరు ప్రవహించే ప్రాంతంలో ఈ రెండు దశాబ్దాల్లో విపరీతంగా భూ ఆక్రమణలు, రియల్ ఎస్టేట్ వ్యవహారాలు పెరిగాయి. ఈ ప్రాంతాల్లో తక్కువ రేటుకే స్థలం లభిస్తుండడంతో పేద మధ్య తరగతికి చెందిన ప్రజలు కొనుగోలు చేసి ఇళ్ళు కట్టుకున్నారు. ఓటు బ్యాంకు పాలిటిక్స్ వారికి అండగా నిలబడడంతో అధికారులు కూడా మిన్నకుండి పోయారు అనే ఆరోపణలు ఉన్నాయి. దానితో బుడమేరు ప్రవహించే చాలా భాగం ఆక్రమణకు గురైంది. ఇప్పుడు భారీ వర్షాలు కురియడంతో పైనుంచి వచ్చిన వరద నీరు ఆ ఆక్రమణలను ముంచేసింది. దానితో బెజవాడ కనీవినీ ఎరుగని విధ్వంసాన్ని ఎదుర్కొంటుంది. గుంటూరు, అమరావతి విజయవాడను కలిపి ఒక విశ్వనగరంగా ఏపీకి క్రొత్త రాజధానిగా నిర్మించాలని చూస్తున్న ప్రభుత్వ ఆలోచనలకు ఈ వరదలు దాగున్న పెద్ద ప్రమాదాన్ని తెలియజేశాయి. ప్రభుత్వం ఇప్పటికైనా చిత్తశుద్ధితో బుడమేరుకు ఇరిగేషన్ డిపార్ట్మెంట్ సూచనలతో రిటైనింగ్ వాల్ నిర్మించడంతోపాటు నదీ పరివాహక ప్రాంతంలోని ఆక్రమణలను తొలగిస్తేనే బుడమేరుతో బెజవాడకు ఉన్న ప్రమాదం తొలగుతుంది అని పర్యావరణ వేత్తలు నిపుణులు చెబుతున్నారు .

### అతడో సామాజిక సారథి..

# నిత్య నూతన వారధి

### -నేడు ప్రపంచ పేపర్ బోయ్స్ దినోత్సవం



నగరం నిద్రపోతున్న వేళ... తొలి కోడి కూతకు ముందే అతడు మేల్కొంటాడు.రవి కిరణాలు ప్రసరించక మునుపే.. ఎముకలు కొరికే చలిలోనూ ప్రపంచాన్ని గుప్పిట పట్టి ఆ సంగతులన్నింటినీ ఇంటింటికీ చేరవేస్తాడు. తానెవరో కూడా కన్పించక... ఇలా వచ్చి, అలా వెళ్లిపోతాడు. పేరుకు మాత్రమే అతడు పేపర్ బాయ్...కానీ, అతడో సామాజిక సారథి.. వార్తా పత్రికలను పాఠకులకు చేర్చే నిత్య నూతన వారధి. అతనికి కూడా ఒక రోజు వుందోచ్.. ఈరోజు ప్రపంచ పేపర్ బోయ్స్ దినోత్సవం. తొలి పేపర్ బాయ్‌గా గుర్తింపు పొందిన బార్నీ ఫ్లాహెర్టీ జయంతిని పురస్కరించుకొని ప్రతి ఏటా సెప్టెంబరు 4న అంతర్జాతీయ పేపర్‌బాయ్ దినోత్సవం జరుపుతున్నారు. మొట్టమొదటి పేపర్ బాయ్ అమెరికాకు చెందిన బార్నీ ఫ్లాహెర్టీ. ఆ రోజుల్లో పేపర్ వెయ్యాలంటే అక్కడి ప్రజలు నామోషీగా భావించేవారు. బార్నీ మాత్రం డిగ్నిటీ ఆఫ్ లేబర్ అన్నట్టు తన పరిస్థితికి తగ్గట్టు తాను పేపర్ బాయ్‌గా చేస్తే తనకు ఖర్చులకు డబ్బులు వస్తాయని అనుకున్నాడు. అనుకున్నదే తడవుగా పేపర్ బాయ్ గా చేరిపోయాడు. 1833 నాటికి అతడి వయస్సు 10 సంవత్సరాలు. ఆయన అప్పట్లో న్యూయార్క్ సన్ పేపర్ వేసేవాడు. తెల్లవారకముందే దిన పత్రిక ఇంటికి చేరవేస్తుండడంతో ఇతర పేపర్ల వినియోగదారులు సైతం బార్నీ వేసే న్యూయార్క్ సన్ పేపర్‌నే కోరుకున్నారు. దీంతో అనతికాలంలోనే ఆ పత్రిక చందాదారులు రెట్టింపయ్యారు. బార్నీ అనంతరం మరికొందరు పేపర్ బాయ్‌గా చేరినా వారందరికీ అతడే ఆదర్శంగా నిలిచారు. బార్నీ సేవలు గుర్తించిన పత్రికా యాజమాన్యం అతడికి మరిన్ని బాధ్యతలు అప్పగించింది. పేపర్ బాయ్‌గా చాలా మంది పాఠకుల హృదయాల్లో స్థానం సంపాదించిన బార్నీ పుట్టినరోజు (సెప్టెంబర్ 4)ను ఆయా పత్రికా సంఘాల నాయకులు పేపర్ బాయ్స్ డే గా ప్రకటించారు. నాటి నుంచి ప్రపంచంలోని అన్ని పత్రికల యాజమాన్యాలు బార్నీ పుట్టిన రోజున పేపర్ బాయ్స్‌డేగా ఫాలో అవుతున్నాయి. ఇదిలా ఉండగా అమెరికాలోని హ్యూస్టన్‌లో టెక్సాస్ ప్రెస్ అసోస్సియేషన్ 125 వార్షికోత్సవం సందర్భంగా బార్నీ గౌరవార్థం అతడి కాంస్య విగ్రహాన్ని 2005లో ఏర్పాటు చేసింది. కత్తిమీద సాములాంటిదే పేపర్‌బాయ్ పని అంటే.. ఏదో పేపర్లు తీసుకొని ఉదయం ఇళ్ల వద్ద వేసి వెళ్లిపోతారని అనుకుంటారు అంతా. అయితే ఇందులో ఉన్న ఇబ్బందులు అన్నీ ఇన్నీ కావు. ఎందరో పాత్రికేయులు రేయింబవళ్లు శ్రమించి సేకరించిన వార్తలను సబ్‌ఎడిటర్లు సరిచేసి ముద్రణ ఆమోదయోగ్యంగా మలుస్తారు. ఆ తర్వాత ముద్రించబడ్డ దిన పత్రికలను పాఠకులకు చేరవేయాల్సిన బాధ్యత పేపర్‌బాయ్‌లదే. తెల్లవారు జామున 3.30 గంటలకు ముందే పేపర్‌బాయ్‌లు నిద్రలేచి సైకిల్‌పై బయలుదేరి పేపర్ కట్టలు వచ్చే పాయింట్లకు చేరుకుంటారు. దినపత్రికలను సర్దుకున్నాక పై అంతస్థులో ఉన్న ఇళ్లకు పేపర్‌ను ఎగర వేసేందుకు తాడుతోనూ, పేపర్‌నే పొట్లంగా మలిచి ఆ కట్టలను సైకిల్‌పై సర్దుకుని బయలు దేరుతారు. తమ ఖాతాదారులకు పత్రికలు వేసుకుంటూ ముందుకు సాగిపోతారు. పేపర్ వేసే క్రమంలో సైకిల్ లేదా ద్విచక్ర వాహనం మరమత్తులకు గురవడం, ఆరోగ్యం బాగలేక నిద్రలేవడం ఆలస్యమైతే ఇక తిట్ల దండకాలే. బిల్లులు సకాలంలో వసూలు చేయకపోతే ఏజెంట్లు జీతాలు ఇవ్వడంలో ఇబ్బందులకు గురిచేయడం ఇలా చాలా బాధలే ఉన్నాయి.... ఎందరో మహనీయులు: భారత రాష్ట్రపతిగా పనిచేసిన డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం విద్యార్థి దశలో పేపర్‌బాయ్‌గా పని చేశారు. తన విద్యార్థి దశలో పుస్తకాల ఖర్చుల కోసం తెల్లవారుజామునే లేచి ఇంటింటా పేపరు వేసేవారు. ఇక ప్రఖ్యాత జ్ఞానపీఠ్ అవార్డు గ్రహీత రాపూరి భరద్వాజ కూడా పేపర్‌బాయ్‌గా పని చేశారు. స్వాతంత్రోద్యమం ఉవ్వెత్తున జరుగుతున్న రోజుల్లో బాలగంగాధర్ తిలక్ సైతం పీపుల్స్‌వార్ పత్రికకు కొన్నాళ్లపాటు పేపర్‌బాయ్‌గా పనిచేశారు. ఇలా చెప్పుకుంటూ పోతే ఎందరో మహనీయులు, మహాను బావులు పేపర్‌బాయ్‌లుగా పనిచేసిన వారే.

# ప్రశాంతంగా వినాయక చవితి వేడుకలు నిర్వహించాలి

## - సిఐ కౌలుట్లయ్య



**నార్పల - సూర్యవాస్తవం:** శింగనమల సర్కిల్ పరిధిలోని గ్రామాలలో వినాయక చవితి వేడుకలు ప్రశాంతంగా నిర్వహించుకోవాలని శింగనమల సిఐ కౌలుట్లయ్య తెలిపారు. మంగళ వారం శింగనమల మండలం చిన్న జలాలపురం గ్రామంలో రానున్న వినాయకచవితి పండుగ గణేష్ నిమజ్జన ఉత్సవాల సందర్భంగా గణేష్ ఉత్సవ కమిటీ నిర్వాహకులతో ఇతర గ్రామ పెద్దలతో సర్కిల్ ఇన్స్పెక్టర్ కౌలుట్లయ్య , ఏ ఏఎస్ఐ చిదంబరం, శింగన మల పోలీసు సిబ్బందితో సింగనమల పోలీస్ స్టేషన్ పరిధిలో శాంతి భద్రతల దృష్ట్యా గ్రామసభ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐ సూచనలు సలహాలు అందజేశారు.

**పోలీసు అధికారుల సూచనలు**

- వినాయక విగ్రహాలు నిలుపడానికి (కమిటీ) తప్పనిసరిగా పోలీసుల అనుమతి పొందాలి.
- విగ్రహాలు నిలుపడానికి వివాదాస్పద స్థలాలు, ట్రాఫిక్ అంతరాయం కలిగించే స్థలాలను ఎంచుకోరాదు.
- వినాయక విగ్రహాలకు నిర్వహకులే తగిన భద్రత ( 24 గంటలు) కల్పించుకొనవలయును.
- తప్పనిసరిగా నలుగురికి తక్కువ కాకుండా విగ్రహ రక్షణ కొరకు ఉండవలయును. బలవంతపు వసూళ్లకు పాల్పడకూడదు. అట్టివారిపై కఠిన చర్యలు తీసుకొనబడును.

వినాయక విగ్రహాల వద్దగాని, లేదా నిమర్జనం రోజున గాని ఎలాంటి డీజే లు, డ్యాన్స్ ప్రోగ్రాములు. నిర్వహించకూడదు.

వినాయక విగ్రహాల వద్ద గాని, నిమర్జనం రోజున గాని ఎలాంటి రంగులు ఇతరుల పై చల్లరాదు. టపాసులు కాల్చరాదు. నిమర్జనం వీలైనంత వరకు చీకటి పడకముందే పూర్తి చేయవలెను.

నిమజ్జనానికి పోయేటపుడు ట్రాఫిక్ అంతరాయం కలిగించకుండా నిర్వాహకులు తగిన జాగ్రత్తలు తీసుకొనవలెను.

మైక్ ఉపయోగించే వారు మైక్ పర్మిషన్ తప్పకుండా తీసుకొనవలయును. పర్మిషన్ లో ఉన్న నిబంధనలను తప్పనిసరిగా పాటించాలన్నారు.

విగ్రహాల వద్ద బాక్స్ టైప్ సౌండ్ బాక్సులను మాత్రమే వాడవలేయును. డి జే సౌండ్ ఉపయోగించరాదు. మసీదు, చర్చిల సమీపములో విగ్రహ ప్రతిష్ట చేయువారు ప్రార్థనలు జరుగు సంధర్భములలో సౌండ్ తగ్గించాలి.

విగ్రహాల వద్ద నిమజ్జనం ఊరేగింపు సమయం లో కొత్తవారు గాని, అనుమానిత వస్తువులు గాని ఉన్నచో వెంటనే సమీపం లో ఉన్న పోలీస్ అధికారులకు తెలియజేయవలెను.

వినాయక విగ్రహాల వద్ద నిమజ్జనం వెళ్ళేటప్పుడు భక్తులు మత్తుపానీయాలు సేవించి ఉండరాదు. ఇందుకు నిర్వాహకులు పూర్తి బాధ్యత వహించి, తగు జాగ్రతలు తీసుకునవలెను.

వదంతులను తప్పుడు ప్రచారాలను నమ్మవద్దు. అవసరమైనచో వెంటనే పోలీసు వారిని సంప్రదించాలన్నారు.

విగ్రహాల వద్ద పూజా ఇతర కార్యక్రమాలను రాత్రి 10 గంటల కల్లా పూర్తి చేసి ముగించవలెను.

విగ్రహ ప్రతిష్టకు విద్యుత్ శాఖ ఇంజనీర్లచే అనుమతి పత్రము తీసుకుని తాత్కాలిక విద్యుత్ సరఫరా ఏర్పాట్లు చేసుకొనేటప్పుడు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా జాగ్రత్తలు. తీసుకొవాలన్నారు.

బంగారు విలువైన ఆభరణములను ధరించి వచ్చు మహిళలకు తగు జాగ్రత్తలు తీసుకొమ్మని, ఇంటికి తాళం వేసి అందరూ ఒకేసారి విగ్రహాల వద్దకు రాకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

విగ్రహాల వద్ద నోట్ బుక్ (పాయింట్ బుక్) తప్పక ఉండవలయును. పోలీసు వారు తనిఖీకి వచ్చినప్పుడు. ఐ ఎన్ నోట్ బుక్ చూపించవలయును. బీటు పోలీసు వారు అందులో సంతకము చేయవలెను. నిమజ్జనం రోజు, ఊరేగింపుకు వాడే వాహనాలకు ముందస్తు అనుమతి తీసుకుని, వాహనాలు తనిఖీ అయిపోయిన తరువాత ఊరేగింపు మొదలు పెట్టాలన్నరు. నిమజ్జనం రోజు, చిన్నపిల్లలను నిమర్జనం జరిగే ప్రదేశమునకు తీసుకొని రాకూడదు. నిర్వాహకులు ప్రమాదములు జరుగకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. వినాయక విగ్రహము పెట్టిన వాహనము నడుపు డ్రైవర్ ఎటువంటి పరిస్థితులలో మద్యము సేవించరాదు. తప్పనిసరిగా డ్రైవింగ్ లైసెన్సు కలిగి ఉండవలయును. వినాయక విగ్రహాలు ఏర్పాటు చేసే మంటపం వద్ద, దగ్గరలోని ముఖ్య కూడళ్ళ వద్ద, నిమజ్జనం చేయు ప్రదేశములలో సి.సి కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. వినాయక విగ్రహాల వద్ద దీపములు వెలిగించి వదిలేయడము వలన అగ్ని ప్రమాదము సంభవించు అవకాశము కలదు. కనుక మంటపములో దీపములు వెలిగించి అన్నిపూర్తిగా ఆరి పోయే వరకు నిర్వాహకులు దగ్గర వుండవలెనన్నారు. వినాయక ఉత్సవ మండ పముల వద్ద ఇసుక బకెట్లు, నీళ్ళ డ్రమ్ములు సిద్ధముగా ఉంచవలెను. దీని వలన ఏవైనా అగ్ని ప్రమాదము జరిగినచో వెంటనే ఆర్పివేయవచ్చును. ఎ ప్పటికప్పుడు పోలీసువారు ఇచ్చు ఆదేశాలను తప్పక పాటించాలి. సర్కిల్ పరిధిలోని ప్రజలుసూచనలను తప్పనిసరిగా పాటించి వినాయక చవితి పండుగ ఉత్సవములు ప్రశాంతంగా జరగడానికి ప్రతి ఒక్కరూ సహకరిం చాలని శింగనమల సీఐ కౌలుట్లయ్య తెలిపారు.

# ప్రభుత్వ చౌక దుకాణాలను ప్రారంభించిన టీడీపీ నాయకులు



**పామిడి- సూర్యవాస్తవం:** గుంతకల్లు నియోజకవర్గం శాసనసభ్యులు గుమ్మనూరు జయరాం తనయుడు పామిడి ఇన్చార్జ్ గుమ్మ నూరు ఈశ్వర్ ఆదేశాల మేరకు పామిడి పట్టణ ముఖ్య నాయకులు పామిడి పట్టణంలోని టీడీపీ నాయకులు బొమ్మ మోహన్ కృష్ణ, జాఫర్. ప్రభుత్వ చౌక దుకాణాలను మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా టిడిపి నాయకులు మాట్లాడుతూ స్టోర్ డీలర్లు ఎల్లప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉండి వాళ్లకు అవసరానికి ఉపయోగపడాలని. తద్వారా బాగా పనిచేసి గుమ్మనూరు జయ రాం మంచి పేరు తీసుకురావాలని ఈ సందర్భంగా స్టోర్ డీలర్లకు టిడిపి నాయకులు సూచించారు.. ఈ కార్యక్రమం లో కత్రిమల ప్రభాకర్ చౌదరి, బొల్లు శ్రీనివాస రెడ్డి, జింకల సంజీవ, శ్రీరాములు, కరూరు శివ శంకర్,తేల్ బాషా,నల్లబోతుల శ్రీని వాసులు, మోదిన్, హమాలీ గోపాల్, మనవల ఆంజనేయులు, మల్లికార్జున, రాజేంద్ర, తిమ్మప్ప, తదితరులు పాల్గొన్నారు.

# గుమ్మనూరు ఈశ్వర్ గొప్ప నాయకుడిగా ఎదుగుతారు



**పామిడి రూరల్- సూర్యవాస్తవం:** గుంతకల్లు నియోజకవర్గం శాసన సభ్యులు గుమ్మనూరు జయరాం తన యుడు యువనాయకుడు గుమ్మనూరు ఈశ్వర్ చిన్న వయసులో గొప్ప సంక ల్పంతో ముందుకు పోతున్నారని భవిష్యత్తులో చాలా గొప్ప నాయకుడిగా ఎదుగుతారని నియోజకవర్గం ప్రజలు చర్చించుకుంటు న్నారు. ఎందుకంటే గుమ్మ నూరు ఈశ్వర్ పేద విద్యార్థులను దృష్టిలో పెట్టుకుని తనను కలవడానికి వచ్చే వారు పూలమాలలు తేవద్దని పేద పిల్లలకు ఉపయోగ పడే నోట్ బుక్కులను తేవాలని కోరారు. చెప్పడమే కాక దానిని అమలు కూడా పరిచారు. పామిడి మండలం పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఈశ్వర్ పిలుపు మేరకు ఆర్ ఆర్ రమేష్ సూచనల మేరకు పామిడి మండల అని మేటర్లు 200 నోట్ బుక్కులు. 200 పెన్నులను అందించి గుమ్మనూరు ఈశ్వర్ సంకల్పానికి బాటలు వేశారు. అందరు ఇలాగే ఆలోచించి ఈశ్వర్ నూ కలవడానికి వెళ్లే ప్రతి ఒక్కరు నోట్ బుక్కులు తీసు కొని వెళ్లి ఈశ్వర్ మద్దతుగా నిలబడాలని కోరుకుంటున్నామని అన్నారు.

# రైతు సేవా కేంద్రంలో సబ్సిడీ విత్తనాలు రిజిస్ట్రేషన్

**పామిడి -సూర్యవాస్తవం :** ప్రత్యామ్నాయ పంటలు సాగు చేసే రైతులు సబ్సిడీ విత్తనాల కోసం ఆయా గ్రామ పంచాయతీల్లోని రైతు సేవా కేంద్రాల్లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి డి.లీనా వసుంధర మంగళవారం ప్రకటనలో తెలిపారు. 80 సబ్సిడీతో ఉలవలు, కొర్ర,జొన్న, పంపిణీ చేయడం జరుగుతాయి. ఉలవలు 10 కేజీల ప్యాకెట్ పూర్తి ధర రూ. 8700 కాగా. సబ్సిడీ పోనూ రూ. 1740, కొర్ర రెండు కేజీల ప్యాకెట్ పూర్తి ధర రూ.8740 కాగా సబ్సిడీ పోనూ రూ.1748. జొన్న మూడు కేజీలు పూర్తి ధర రూ.700 కాగా సబ్సిడీ పోనూ రూ.140 రైతులు చెల్లించాలని అని తెలిపారు.

# అగస్త్యేశ్వరునికి భస్మహారతి

**ప్రొద్దుటూరు-సూర్యవాస్తవం:** పట్టణ నడిబొడ్డున వున్న అగస్త్యేశ్వరాలయంలో ఆలయ చైర్మన్ కొత్త మిద్దె రఘురామిరెడ్డి, పాలకమండలి సభ్యుల ఆధ్వర్యంలో భస్మహారతి నిర్వహించారు. మంగళవారం అమావాస్య సందర్భంగా స్వామివారికి ప్రదోష కాల సమయంలో పంచామృత నానావిధ సుగంధ ద్రవ్య రుద్రాభిషేక సహితముగా స్వామివారికి సహస్రనామ భస్మార్చన, భస్మహారతి, అమ్మవారికి కుంకుమార్చనలు నిర్వహించారు. వందలాది మంది భక్తాదులు వచ్చి స్వామి అమ్మవార్లని దర్శించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.





# పోషకాహారంతో సంపూర్ణ ఆరోగ్యం

**లక్కిరెడ్డిపల్లి - సూర్యవాస్తవం:** పోషకాహారంతో సంపూర్ణ ఆరోగ్యం పొందవచ్చు అని అంగన్వాడీ సూపర్వైజర్ దాద్ బి పేర్కొన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు స్త్రీ శిశు సంక్షేమ శాఖ సెప్టెంబర్ 1 నుంచి 7వ తారీకు వరకు పోషకాహార వారోత్స వాలు నిర్వహిస్తున్నారని ఆమె తెలిపారు. ఈ సందర్భంగా లక్కిరెడ్డిపల్లె మండలం సిడిపిఓ పద్మావతి ఆదేశాల మేరకు పెట్రోల్ బంక్ పరిధిలో ఉన్న అంగన్వాడీ కేంద్రంలో పోషకాహార వారోత్స వాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పోషకాహార ఇబ్బందులు కలగకుండా గర్భిణీలు,బాలింతలు సంతులిత ఆహారం తీసుకునే విధంగా ప్రత్యేక కార్యచరణను ప్రభుత్వం అమలు చేస్తున్నది తెలిపారు.అంగన్వాడీ కేంద్రానికి వచ్చేవారికి గుడ్లు, పాలు,బాలామృతం, మధ్యాహ్నం భోజనం వంటివి అందజేస్తున్నారన్నారు. బాలింతలు గర్భిణీ స్త్రీలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్ రేష్మ భాను, తల్లులు గర్భిణీ స్త్రీలు పిల్లలు తదితరులు పాల్గొన్నారు.

# ఎస్సార్ఐటీలో ప్రాంగణ ఎంపికలు



**ప్రొద్దుటూరు-సూర్య వాస్తవం:** స్థానిక సాయి రాజేశ్వరి ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజి ఇంజినీరింగ్ కళాశాలలో మంగళవారం బెంగళూరుకు చెందిన ప్రముఖ కంపెని కీ లింక్ బిజినెస్ కన్సల్టెంట్ ప్రైవేట్ లిమిటెడ్ వారు బి.టెక్ ఫైనల్ ఇయర్ సివిల్, మెకానికల్ బ్రాంచుల వారికి డిజైన్ ఇంజనీర్ ఉద్యోగాల కొరకు నిర్వహించిన ప్రాంగణ ఎంపికలలో సతీష్, నర్మద, సుమంత్ రెడ్డి, చంద్రిక శివాంజనేయులు, సుచిత్ర, లహరి, శ్రావణ్ కుమార్ రెడ్డి మొత్తం 8 మంది ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ పాండురంగన్ రవి వివరించారు. ఎంపి కైట్ వారికి ఎడాదికి 3 మంది 4 లక్షల వేతనము ఇవ్వబడుతుందని. టిపిఓ సునీల్ తెలిపారు. ఈ సందర్భంగ ఎంపికైన విద్యార్థులను కళాశాల ఛైర్మెన్ బసిరెడ్డి రాజేశ్వరరెడ్డి, వైస్ ప్రెసిడెంట్ వీర కుమార్ రెడ్డి, కరస్పాండెంట్ వీర కళ్యాణ్ రెడ్డి, వెస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ. వెంకటేశ్వర రెడ్డి, హెచ్.ఓ.డి.లు అభినందించారు.

# ప్రమాదంలో లక్ష్మిదేవి మృతి

## - నివాళులర్పించిన టీడీపీ ఇన్చార్జి, ఎమ్మెల్యే,



**రైల్వేకోడూరు - సూర్యవాస్తవం:** రైల్వే కోడూరు నియోజకవర్గంలో ఓబులవారిపల్లి మండలం, కొర్లకుంట గ్రామానికి చెందిన వీటి కుమార్ రెడ్డి సతీమణి వీటి లక్ష్మీదేవి ప్రమాదశాత్తు ద్విచక్ర వాహనం నుంచి కింద పడి మరణించగా ఆమె పార్థివ దేహానికి ముక్కా కుటుంబ సభ్యులు, ఎమ్మెల్యే అరవ శ్రీధర్ పూలమాలవేసి వారికి ఘన నివాళి అర్పించారు. రైల్వే కోడూరు నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇన్చార్జి ముక్కా రూపా నంద రెడ్డి, ఆయన సతీమణి ముక్కా వరలక్ష్మి, రైల్వే కోడూరు శాసన సభ్యులు అరవ శ్రీధర్ వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో వీపి వెంకట రెడ్డి,, వీపీ బాబు, విపి సుధాకర్ రెడ్డి, వీసి శివ రెడ్డి, వివిన్ వికాస్ రెడ్డి కూటమి నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# మంగంపేట గ్రామ సమస్యలను పరిష్కరించాలి

**రైల్వే కోడూరు - సూర్యవాస్తవం:** రైల్వే కోడూరు నియోజకవర్గంలో ఓబులవారిపల్లి మండలంలో మంగంపేట గ్రామ సమస్యలను పరిష్కరించాలని సబ్ కలెక్టర్‌ను కోరిన గుంతకల్ రైల్వే డిఆర్ యుసిసి మాజీ సభ్యులు తల్లెం భరత్ కుమార్ రెడ్డి, అన్నమయ్య జిల్లా రాజంపేట సబ్ కలెక్టర్ వైకోం నిదియా దేవిని గుంతకల్ రైల్వే బిఆర్ యుసిసి మాజీ సభ్యులు తల్లెం భరత్ కుమార్ రెడ్డి సబ్ కలెక్టర్ ఛాంబర్‌లో మర్యాద పూర్వకంగా కలిసి తరలించనున్న మంగంపేట కాపు పల్లి హరిజనవాడ అరుంధతివాడ గ్రామాల సమస్యలను పెండింగ్‌లో ఉన్న ప్యాకెజ్ లు త్వరగా మంజూరు చేయాలని మంగంపేట సర్వే నెంబర్ 8 భూమి స్మశానవాటిక ప్రత్యన్యాయ స్థల తదితర సమస్యలను పరిష్కరించామని కోరినట్లు ఒక ప్రకటనలో తెలిపారు.



# ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిసిన ఒకటవ పట్టణ నూతన సీఐ



**అనంతపురం క్రైం- సూర్య వాస్తవం:** అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ ను మంగళవారం నాడు స్థానిక ఆర్ అండ్ బీ గెస్ట్ హౌస్ లో మర్యాదపూర్వకంగా కలిశారు వన్ టౌన్ నూతన సీఐ రాజేంద్ర నాథ్ యాదవ్. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ..... శాంతి భద్రతల విషయంలో రాజీ లేకుండా పని చేయాలని సీఐ రాజేంద్రనాథ్ యాదవ్ కు ఎమ్మెల్యే దగ్గుపాటి సూచించారు.

# పేద ప్రజలకు న్యాయం చేయండి

**- చట్టవిరుద్ధంగా సబ్ డివిజన్ చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి**
**- జిల్లా కలెక్టర్‌కి వినతి పత్రం అందజేసిన ఏపీ ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షులు యు.రమణ**




**అనంతపురం క్రైం - సూర్యవాస్తవం:** అనంతపురం రూరల్ మండలం కురుగుంట పంచాయతీలోని సర్వేనెంబర్ 51 లో ఉన్న భూమి ల్యాండ్ సీలింగ్ అయిందని ఈ భూమి సబ్ డివిజన్ చేయడానికి అవకాశం లేదని అయితే కొందరు రియల్ ఎస్టేట్ వ్యాపారులు చట్టాన్ని తమకు అనుకూలంగా సర్వే నంబర్లు 41-2 ఏ, 41-2 బి, 41-2సి,41-2 డి,41-3ఏ, 41-3బీ గా సబ్ డివిజన్ గా చేశారని ఈ విషయంపై సోమవారం నాడు ఆంధ్ర ప్రదేశ్ ఎమ్మార్పీఎస్ రాయలసీమ జిల్లాల అధ్యక్షులు ఉల్లికల్లు రమణ జిల్లా కలెక్టర్ వినోద్ కుమార్‌కి వినతి పత్రాన్ని అంద జేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద ప్రజలకు ఇళ్ల పట్టాలను భూమిని రోడ్డు వెనుక వైపు మార్చి వెనకవైపు ఉన్న ప్రైవేటు భూమి 5-35 సెంట్ల భూమిని ప్రభుత్వ భూమిగా సబ్ డివిజన్ చేశారని దీనివల్ల ఇళ్ల పట్టాలు పొందిన పేదలకు అన్యాయం జరుగుతుందని కలెక్టర్ వినోద్ కుమార్ కు ఆయన వివరించారు. పేద ప్రజలకు న్యాయం చేసే విధంగా వెంటనే అవినీతిపరులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

# మురుగునీటి కాలువలను ఏర్పాటు చేసుకోవాలి

**- రైతులతో శాస్త్రవేత్త ముఖాముఖి**




**పెద్దవడుగూరు - సూర్య వాస్తవం :** కృషి విజ్ఞాన కేంద్రం రెడ్డిపల్లి, రిలయన్స్ ఫౌండేషన్ అనంత పురం ఆధ్వర్యంలో పెద్దవడుగూరు మండల పత్తి రైతులతో, టెలికాన్ఫిరెన్సు నిర్వహించిన సస్యరక్షణ శాస్త్రవేత్త డాక్టర్ బి.కె కిషోర్ రెడ్డి మాట్లాడుతూ గత రెండు నుండి మూడు రోజులగా పడిన వర్షాల ప్రత్తి పంటలో నిలువున్న నీటిని బయటకు పోయేందుకు వీలుగా మురుగునీటి కాలువలను ఏర్పాటు చేసుకోవాలి నీటి ముంపునకు గురైన పత్తి మొక్కలు పోషకాలను నేల నుండి నేరుగా గ్రహించలేవు దీనివలన ఆకులు ఎర్రబడడం మరియు మొక్కల పెరుగుదల కుంటుబడుతుంది. ఈ పరిస్థితులలో రైతులు పత్తి చేనులో పైపాటుగా 10 గ్రాముల పొటాషియం నైట్రేట్ లేదా 20 గ్రాముల యూరియాతోపాటుగా రెండు గ్రాములు ఫార్ములా -4 మిశ్రమాన్ని లీటర్ నీటికి చొప్పున కలుపుకొని వారం రోజుల వ్యవధిలో రెండుసార్లు పై పాటుగా పిచికారి చేయాలి. రైతులు వర్షాలు తగ్గిన తరువాత కాస్త ఎండగా ఉన్న సమయంలో మాత్రమే ఎరువులను మరియు రసా యనిక మందులను చేనులో వాడుకోవాలి. ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్త, రిలయన్స్ ఫౌండేషన్ జోనల్ మేనేజర్ ప్రకాష్, గిరిబాబు పాల్గొన్నారు.

# ప్రమాదకరంగా గుంతలు

**- ఇబ్బందిపడుతున్న వాహనదారులు**




**గుత్తి - సూర్యవాస్తవం :** గుత్తి ఆర్ఎస్ రోడ్డు చాలా గుంతలుగా మారి తయారైంది. రోడ్డుపై ఎక్కడ చూసినా లోతయినా గుంతలు కనిపిస్తున్నాయి. గుత్తి ప్రభుత్వ ఆసుపత్రి నుంచి రైల్వే బ్రిడ్జి వరకు రోడ్డు చాలా ప్రమాదకరంగా ఉంది. దీంతో స్కూల్ పిల్లలు, అంబులెన్సు వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కనీసం రోడ్డుపై పడిన గుంతలను మట్టితో పూడ్చ డానికి కూడా అధికారులు ముందుకు రావడం లేదని, ప్రజలు, వాహనదారులు చాలా విమర్శిస్తున్నారు.

# నేత్రదానం మహాదానం

**- జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్**

**అనంతపురం వైద్యం- సూర్య వాస్తవం :** నేత్రదానం మహాదానమని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ పేర్కొన్నారు. మంగళవారం ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ, అనంతపురం శాఖ ఆధ్వర్యంలో 39వ జాతీయ నేత్రదాన పక్షోత్సవం సందర్భంగా భారీ అవగాహన ర్యాలీ నగరంలోని ఆర్ట్స్ కళాశాల నుండి నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి హాజరై ర్యాలీని ప్రారంభించారు. ఈ ర్యాలీ ఆర్ట్స్ కళాశాల నుండి మొదలై టవర్ క్లాక్ సప్తగిరి సర్కిల్ మీదుగా తిరిగి టవర్ క్లాక్ వరకు చేరుకోవడం జరిగింది. ర్యాలీ ఆద్యంతం నేత్రదానంపై అవగాహనా పిలుపులతో, ప్లకార్డులతో చైతన్యం కలిగించే విధంగా సాగింది. ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున యువత మరియు స్వచ్ఛంద సంస్థలు సభ్యులు, కెఎస్ఆర్ బాలికల జూనియర్ కళాశాల, ఎస్ఎస్ఎస్ జూనియర్ బాలిక కళాశాల, ఆఫ్ ల టస్ ఇంటర్నేషనల్ స్కూల్, ఎస్.ఎస్.బి.ఎన్ కళాశాల అలాగే గవర్నమెంట్ కాలేజీ విద్యార్థులు వందల సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో అంధత్వ నివారణ కోసం పెద్ద ఎత్తున అవగాహన ర్యాలీలు సదస్సులు నిర్వహించి నేత్రదానంపై అవగాహన కలిగించాలని, అంధత్వ నివారణపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. మరణానంతరం 6 గంటల లోపల నేత్రాలను సేకరించి కంటి చూపు లేని ఇద్దరికి




కంటిచూపు కలిగించి వారికి కొత్త జీవితాన్ని ప్రసాదించిన వారు అవుతారని తెలిపారు. ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో త్వరలోనే ఐ బ్యాంక్ ఏర్పాటు జరుగుతోందని, దీనికి జిల్లాలోని ప్రముఖులు, స్వచ్ఛంద సంస్థలు సహకరించాలని కోరారు. త్వరలోనే ఒక డెడికేటెడ్ ఫోన్ నెంబర్ ఐ డొనేషన్ కోసం ప్రారంభిస్తామని, ఈరోజే నా కుటుంబం మొత్తం ఐ డొనేషన్ ప్లెడ్జి ఫారం నింపుతున్నానని, ప్రజలు కూడా నేత్రదాన దిశగా ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ర్యాలీ అనంతరం స్థానిక పెన్షనర్ల భవన%శీ%లో అవగాహనా సదస్సు నిర్వహించడం జరిగింది. ఈ సదస్సు నందు వక్తలు మాట్లాడుతూ ప్రస్తుతం సేకరించిన నేత్రాలను ఎల్.వి. ప్రసాద్ ఐ బ్యాంకుకు పంపించటం జరుగుతుందని, జిల్లాలో స్థానికంగా ఐ బ్యాంకు ఏర్పాటు ద్వారా జిల్లాలోని వారికి ఉపయో గ ఎ డ టా ని కి దోహదమవుతుందని, ఎలాంటి తారత మ్యాలు లేకుండా అందరు నేత్రదానానికి ముందుకు రావాలని కోరారు. ఈ ర్యాలీ మరియు అవగాహనా సదస్సు నందు రెడ్ క్రాస్ వైస్ చైర్మన్ డాక్టర్ లక్ష్మణ్ ప్రసాద్, జిల్లా వైద్యాధికారి డా. ఈబీ.దేవి, హాస్పిటల్స్ కోఆర్డినేటర్ డాక్టర్ పాల్ రవి కుమార్, సర్వజన ఆసుపత్రి సూపరింటెండెంట్ డా. వెంకటేశ్వర రావు, జిల్లా అంధత్వ నివారణ ప్రోగ్రాం ఆఫీసర్ డా.సైదన్న, ఇండియన్ మెడికల్ అసోసి యేషన్ జిల్లా అధ్యక్షులు డా.మనో రంజన్ రెడ్డి, ఆపిల్ ఐ కేర్ డాక్టర్ జగన్ మోహన్, సీనియర్ కంటి వైద్య నిపుణులు డా.అక్బర్, పెన్షనర్ల అసోసి యేషన్ అధ్యక్షులు పెద్దన్న గౌడ్, డా.భవాని, డా.భాను కిరణ్, రెడ్ క్రాస్ మేనేజింగ్ మెంబర్లు డా.జనార్ధన రెడ్డి, సుబ్రహ్మణ్యం, అప్ప సుధీర్, ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ డా.దివాకర్ రెడ్డి, ఎస్ఆర్ ఎడ్యుకేషనల్ సొసైటీ రమేష్, ఎన్ ఎస్ ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు డా.గిరిధర్, విష్ణు ప్రియ, విజయ లక్ష్మి, జైను బేగం, పెన్షనర్లు అసోసియేషన్ మెంబర్లు, రెడ్ క్రాస్ వలంటీర్లు, సిబ్బంది, వివిధ సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

# దారులన్నీ వెంకటాపురం వైపే

**- పరిటాల వారి విందుకి వేలాదిగా జనం**
**- ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఇతర నేతలంతా హాజరు**
**- అందర్నీ ఆప్యాయంగా పలుకరించిన పరిటాల సునీత, శ్రీరామ్**

**అనంతపురం క్రైం - సూర్య వాస్తవం:** ఏ దారి చూసినా వెంకటా పురం వైపే.. ఏ వాహనం చూసినా చలో వెంకటాపురమే.. ఎవరి నోట విన్న జై పరిటాల అన్న నినాదాలు. ఇదీ శ్రీసత్యసాయి జిల్లా రామగిరి మండ లంలో కనిపించిన దృశ్యాలు. మాజీ మంత్రి, రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత, ధర్మవరం టీడీపీ ఇన్చార్జి పరిటాల శ్రీరామ్ ఇంట మంగళవారం జరిగిన విందు కార్యక్రమం జన సంద్రాన్ని తలపించింది. కుటుంబ సభ్యులు మొక్కుబడి మేరకు నసనకోట ముత్యాలమ్మ, గ్రామంలో దుర్గమ్మ అమ్మవారి దేవాల యంలో ప్రత్యేక పూజలు, విందు కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా లోని రాప్తాడు, ధర్మవరం నియోజక వర్గాలతో పాటు అన్ని నియోజకవర్గాల్లో ఉన్న అభిమానులు, కార్యకర్త లకు ఆహ్వానం పంపారు. ఈ నేపథ్యంలో ఏ వాహనం చూసినా వెంకటాపురం వైపు కదిలింది. మంగళవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు జనసంద్రాన్ని తలపించింది. ప్రతి ఒక్క కార్యకర్త ముందుగా పరిటాల సునీతను పలుకరించి.. ఆ తర్వాత ఘాట్ వద్ద నివాళు లర్పించారు. అలాగే భోజనం అనం తరం శ్రీరామ్ ను కలిసి తిరుగుపయన మయ్యారు. వేలాదిగా తరలివచ్చిన జనాన్ని పరిటాల సునీత, శ్రీరామ్ ఎంతో



ఆప్యాయంగా పలుకరించారు. విందుకు వచ్చిన ప్రతి ఒక్కర్నీ పలుకరించే ప్రయత్నం చేశారు. కొన్ని సందర్భాల్లో జనాన్ని అదుపు చేయలేక పోయారు. మరోవైపు సామాన్య జనం, కార్యకర్తలే కాకుండా ఎమ్మె ల్యేలు, ఎంపీలు, ఇతర ప్రజా ప్రతినిధులు కూడా వెంకటాపురం తరలివెళ్లారు. ఎమ్మె ల్యేలు కాలువ శ్రీని వాసులు, గుమ్మనూరు జయరాం, దగ్గుపాటి ప్రసాద్, పల్లె సింధూరరెడ్డి, ఎంఎస్ రాజు, మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి, బండారు శ్రావణి, ఎంపీలు పార్థసారథి, అంబికా లక్ష్మీనారాయణ, మాజీ ఎంఎల్సి గుండుమల తిప్పేస్వామి, మాజీ ఎమ్మెల్యే ఈరన్న, ధర్మవరం జనసేన నేత చిలకం మధుసూదన్ రెడ్డి, జిల్లా అధ్యక్షుడు టీసీ వరుణ్, భవానీ రవికుమార్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు సందిరెడ్డి శ్రీనివాసులు, మాజీ మేయర్ స్వరూప, మాజీ జడ్పీ చైర్మన్ చమన్ సాబ్ కుమారుడు ఉమర్ ముక్తర్, గ్రంధాలయ మాజీ చైర్మన్ గౌస్, ఆలం నరసానాయుడు, కేశవరెడ్డి, శ్రీధర్ చౌదరి తదితరులు కార్య క్రమంలో పాల్గొన్నారు. అలాగే కర్ణాటక రాష్ట్ర మాజీ మంత్రి వెంకటరమణప్ప, పావగడ ఎమ్మెల్యే వెంకటేష్ కూడా విందు కార్యక్రమంలో పాల్గొన్నారు. వీరంతా ముందుగా పరిటాల ఘాట్ వద్ద నివాళులర్పించిన తర్వాత సునీత, శ్రీరామ్ తో ప్రత్యేకంగా భేటి అయ్యారు. విందుకు హాజరైన ప్రతి ?ఒక్కరికీ పరిటాల సునీత, శ్రీరామ్ ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. మమ్మల్ని అభిమానించే ప్రతి ఒక్కరూ మా కుటుంబ సభ్యులతో సమానం అని.. అందుకే వారితో కలసి ఒక రోజు భోజనం చేసేందుకే ఈ విందు అని ఈ సందర్భంగా స్పష్టం చేశారు.

# తల్లి పేరుతో ఒక మొక్క

**- జే.బి.వి.ఎస్ ధి ప్రిజర్వేర్ సేవ సమితి**




**అనంతపురం - సూర్యవాస్తవం:** పర్యావరణ పరిరక్షణను ప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసుకోవాలని డాక్టర్ వైయస్సార్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ యూనివర్శిటీ వైస్ ఛాన్సలర్ జి. విశ్వనాథ కుమార్ అన్నారు. జే.బి.వి.ఎస్ ధి ప్రిజర్వేర్ సేవ సమితి, డాక్టర్ వైయస్సార్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్ యూనివర్శిటీ మరియు సమరిటన్ చారిటబుల్ ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో కడప స్థానిక అలంకానిపల్లి సమీపంలో ఉన్న యూనివర్శిటీ ఆవరణంలో నిర్వహిస్తున్న అమ్మ పేరుతో ఒక మొక్క అనే కార్యక్రమాన్ని రిబ్బన్ కటింగ్ చేసి ప్రారంభించిన ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ప్రస్తుతం పెరుగుతున్నటువంటి కాలుష్యాన్ని దృష్టిలో ఉంచుకొని పర్యా వరణ సమతుల్యతను కాపాడేందుకు కనీసం అమ్మ పేరు మీద ఒక మొక్కను నాటా లని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఈ స్వచ్ఛంద సంస్థలతో కలిసి ఈ సెప్టెంబర్ నెలలో 500 పైగా మొక్కలు నాటబోతున్నామని యూనివర్సిటీ రిజిస్టర్ ఎన్. రాజేష్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. జే.బి.వి.ఎస్ ధి ప్రిజర్వేర్ సేవ సమితి వ్యవస్థాపకుడు, ఎన్.ఎస్.ఎస్ వాలంటీర్ అయిన అశోక్ మాట్లాడుతూ.... పూర్వం వన సంపద ఎంతో వైభవంగా ఉండేదని అది ప్రస్తుత కాల కాలుష్యం వలన అతలాకుతలమవుతుంధి కాబట్టి ప్రతి ఒక్క రూ మొక్కలు నాటి బాధ్యతగా సంరక్షించి పర్యావరణ పరిరక్షణకై నడుం బిగించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎన్.ఎస్.ఎస్. రమాదేవి, వరలక్ష్మి, స్టెప్ ఆఫీస్ స్టాఫ్ అబ్బాస్, నాగయ్య, సంస్థ సభ్యులు సిరి, కార్తిక్ విద్యార్థులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.




# ఆర్‌డిటి క్రికెట్ స్టేడియం వద్ద వైద్య శిబిరాల ఏర్పాట్లు పూర్తి

**- డిఎం అండ్ హెచ్ఓ డాక్టర్ ఈబి దేవి**

**అనంతపురం వైద్యం - సూర్య వాస్తవం:** ఈ నెల 5వ తేదీ నుండి అనంతపురం పట్టణంలోని ఆర్‌డిటి స్టేడియంలో ప్రతిష్టాత్మకంగా నిర్వహించేటువంటి" "దులీప్ ట్రోఫీ క్రికెట్ మ్యాచ్"లు ఆడేందుకు దేశవ్యాప్తంగా ప్రముఖ క్రికెటర్లు రానుండటం ఆ మ్యాచ్‌లను తిలకించుటకు జిల్లా వ్యాప్తంగానే కాకుండా దేశంలోని అనేక పట్టణాల నుండి వేలాది మంది క్రికెట్ అభిమానులు తరలివస్తుండడంతో జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఆర్డిటి క్రికెట్ స్టేడియం వద్ద వైద్య అవసరాలు తీర్చడం కోసం డాక్టర్స్‌తో కూడిన టీంతో వైద్య శిబిరాలు, అంబులెన్స్‌లను ఏర్పాటు చేయడం జరిగిందని, అంతేకాకుండా పట్టణంలోని ప్రభుత్వ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిలో ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో, సవేరా ఆసుపత్రి, కేర్ అండ్ క్యూర్ ఆసుపత్రి నందు ఒక్కో ఆసుపత్రిలో రెండు చొప్పున ఐసీయూ బెడ్స్, ఒక్కొక్క రూము ప్రముఖుల అత్య వసర వైద్య చికిత్సల కోసం సిద్ధం చేసి ఉంచినట్లు ఈ వైద్య శిబిరాలు క్రికెట్ మ్యాచ్ లు జరిగే అన్ని రోజుల్లో ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 6:00 దాకా పని చేస్తాయని కావున క్రికెట్ స్టేడియం వద్ద అక్కడికి వచ్చే ప్రజలు, క్రీడాభిమానులు వైద్య అవసరం ఏర్పడినప్పుడు ఉపయోగించు కోవాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఈబిదేవి తెలిపారు.

# విజయవాడ విపత్తును జాతీయ విపత్తుగా కేంద్రం ప్రకటించాలి

**- కాంగ్రెస్ నాయకులు ఎన్.తులసి రెడ్డి**



కడప- సూర్యవాస్తవం: విజయ వాడ విపత్తు బాధాకరం, దురదృష్టకర మని తెలిపారు. కాంగ్రెస్ నాయకులు ఎన్.తులసి రెడ్డి. 19 మంది మృతి. ఇద్దరు గల్లంతయ్యారని అలాగె 136 పశు వులు, 59700 కోళ్లు మృతి చందాయన్నారు. 4.26 లక్షల ఎకరాల లో వరిపంట దెబ్బ తిందనీ తెలిపారు. 39, 964 ఎకరాలలో ఉద్యాన పంటలు దెబ్బ తిన్నా యని 1808 కిలోమీటర్ల రోడ్లు దెబ్బతిన్నా యన్నారు. 73 చెరువు లకు గండ్లు పడ్డాయి. ఇంకా 2.5 లక్షల మంది ముంపు ప్రాంతాల లోనే ఉన్నారు. ముందు జాగ్రత్తలు తీసు కోవ డంలో ప్రభుత్వం వైఫల్యం చెందినట్లు స్పష్టంగా తెలు స్తోందనీ వివిధ ప్రభుత్వ శాఖల మధ్య సమన్వయం లోపం కనిపిస్తోందన్నారు. ప్రస్తుతం పునరావాస కార్యక్రమాలు ముమ్మరంగా సాగుతు న్నాయి. ముఖ్య మంత్రి, మంత్రులు, అధికారులు నిర్వి రామంగా సహాయ కార్యక్రమాలలో పాల్గొంటున్నారు. 176 పున రావాస కేంద్రాలు ఏర్పాటు చేశారు. 171 వైద్య శిబిరాలు ఏర్పాటు చేశారనీ 134 పశువైద్య శిబిరాలు ఏర్పాటు చేశార న్నారు. 36 ఎన్డిఆర్ఎఫ్, ఎస్డిఆర్ఎఫ్ బృందాలు రంగా ప్రవేశం చేశా యని 188 పవర్‌బోట్లు, 283 గజ ఈతగాళ్లు వున్నాం న్నారు. టోల్‌ఫ్రీ నంబర్లు ఏర్పాటు చేసారని విజయవాడ విపత్తును జాతీయ విపత్తుగా కేంద్రం ప్రకటించి ఇతోధికంగా ఆలస్యం చేయకుండా రాష్ట్రాన్ని ఆదుకోవాలని కాంగ్రెస్ పార్టీ విజ్ఞప్తి చేస్తోందన్నారు. సహాయ కార్యక్రమాలలో ముమ్మరంగా పాల్గొ నాలని కాంగ్రెస్ శ్రేణులకు కాంగ్రెస్ పార్టీ విజ్ఞప్తి చేస్తోందనీ తెలియజేశారు.

# సాహితీకీర్తి "పుట్టపర్తి"

**- విద్వాన్ డాక్టర్ గానుగపెంట హనుమంతరావు!**



మైదుకూరు - సూర్యవాస్తవం: ప్రాచీన, ఆధునికాంధ్ర సాహిత్య కీర్తి సరస్వతీ పుత్ర పద్మశ్రీ డాక్టర్ పుట్టపర్తి నారాయణాచార్యులని భారత రాష్ట్రపతి అవార్డు గ్రహీత, మహాకవయిత్రిమొల్ల సాహితీ పీఠం వ్యవస్థాపక అధ్యక్షులు విద్వాన్‌డాక్టర్ గానుగ పెంట హనుమంతరావు శ్లాఘిం చారు. పుట్టపర్తి నారా యణాచార్యుల వర్ధంతి సందర్భంగా మహా కవయిత్రి మొల్లసాహితీ పీఠం కార్యాలయంలో ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు. హనుమంతరావు మాట్లాడుతూ 14 భాషలలో పుట్టపర్తి పండి తుడని, శివతాండవం ఆయన రచనల్లో ఒక కళాఖండం అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో శ్రీ వెంకటేశ్వర నాటక మండలి ప్రధాన కార్యదర్శి మధు బాబు, అన్నమాచార్య ఇంజనీరింగ్ కళాశాల ప్రొఫెసర్లు ఆదిల్ బాషా, సాతాద్ వలి, విద్యార్థులు నందకిషోర్, మధుసూదన్ ,యూసఫ్ తదితరులు పాల్గొన్నారు.

# నేడు బద్వేలులో విద్యుత్ అదాలత్

**- దువ్వూరు విద్యుత్ ఏఈ బి. వీరారెడ్డి**



దువ్వూరు- సూర్యవాస్తవం : మైదుకూరు సబ్ డివిజన్ పరిధిలోని విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారం కోసం నేడు బుధ వారం బద్వేలు పట్టణంలోని నెల్లూరు రోడ్డులో ప్రత్యేక విద్యుత్ అదాలత్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు దువ్వూరు మండల విద్యుత్ శాఖ అసిస్టెంట్ ఇంజనీరింగ్ బి వీరారెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన దువ్వూరులో మాట్లాడుతూ మం డలంలోని విద్యుత్ వినియోగదారులు ఎలాంటి సమస్యలు ఉన్న నేడు బద్వేల్ పట్టణంలో జరుగు విద్యుత్ లోక్ అదాలత్ కార్యక్రమంలో తెలుపు వచ్చునని ఆయన అన్నారు. ఇక్కడ పరిష్కారం కానీ విద్యుత్ వినియోగదారుల సమస్య లను రాతపూర్వకంగా ఫిర్యాదు చేయవచ్చునని సూచించారు. ఈ అవకాశాన్ని మండల వినియోగదారులు ఉపయోగించుకోవాలని ఏఈ సూచించారు.

# నేటి నుంచే 80 శాతం రాయితీతో ఉలవలు పంపిణీ

**- మండల వ్యవసాయ అధికారి ఢిల్లీ ప్రసాద్**

పాలసముద్రం - సూర్యవాస్తవం : మండల కేంద్రంలో ప్రభుత్వం 80% రాయితీతో రైతులకు ఉలవలును పంపిణీ చేయనుందని పాలసముద్రం మండల వ్యవసాయ అధికారి ఢిల్లీ ప్రసాద్ మంగళవారం తెలిపారు. అవసర మైన రైతులు నేటి నుంచి రైతు సేవ కేంద్రాల్లో రిజిస్ట్రేషన్ చేయించుకుని డబ్బులు చెల్లించి విత్తనాలు పొందాలన్నారు.ఉలవలు క్వింటాల్ ధర రూ. 8, 700 కాగా 80 శాతం రాయితీ పోను రైతులు కేవలం రూ. 1, 740 మాత్రమే చెల్లించాల్సి ఉంటుందన్నారు. విత్తనాలు పంట పండించడానికి వాడాలని పశు వులకు పెట్టరాదని. ఈ విత్తనాలలో రసాయన ఎరువులు కలిసాయని తెలిపారు.రైతులు ఈ విత్తనాలు కావాలంటే భూమికి సంబంధించిన పట్టా పాస్ బుక్ , ఆధార్ కార్డు, ఆధార్ లింక్ అయినా మొబైల్ నెంబరు ఇవ్వాలని, ఈ విత్తనాలు బయోమెట్రిక్ ద్వారా ఇవ్వడం జరుగుతుందని తెలిపారు.

# విమానాశ్రయ అభివృద్ధికి చర్యలు

**- కడప ఏరోడ్రమ్, ఎయిర్ ఫీల్డ్ ఎన్విరాన్మెంట్ మేనేజ్మెంట్ కమిటీ సమావేశంలో కలెక్టర్ శివశంకర్ లోతేటి**





కడప -సూర్యవాస్తవం ప్రతినిధి: పర్యావరణా నికి ఎలాంటి అంత రాయం లేకుండా, నిబంధన లకు లోబడి.. కడప ఏరోడ్రమ్ అభివృద్ధి పనులను చేప ట్టేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా కలెక్టర్, ఏరోడ్రమ్ కమిటీ చైర్మన్ శివశంకర్ లోతేటి పేర్కొ న్నారు. మంగళవారం కడప విమా నాశ్రయం టర్మినల్ బిల్డింగ్‌లో.. జిల్లా కలెక్టర్, ఏరోడ్రమ్ కమిటీ చైర్మన్ శివశంకర్ లోతేటి అధ్యక్షతన కడప ఏరోడ్రమ్, ఎయిర్ ఫీల్డ్ ఎన్విరా న్మెంట్ మేనేజ్మెంట్ కమిటీల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సేఫ్టీ, సెక్యూరిటి కు సంబంధించిన పలు విషయాలను, ప్రయాణికులకు మరింత మెరుగైన సౌకర్యాలను కల్పిం చేందుకు, విమానాశ్రయ అభివృద్ధికి తీసుకోవలసిన చర్యలపై కమిటీ చర్చించింది. జిల్లా కలెక్టర్ మాట్లా డుతూ.. కేంద్ర ప్రభుత్వం పౌర విమానయాన సేవా రంగంలో ప్రయాణీకుల అనుభవాలు, సౌకర్యాలను దృష్టిలో ఉంచుకుని.. భారతీయ విమానాశ్రయాలను ఉన్నత ప్రమాణాలతో అంతర్జాతీయ స్థాయికి దీటుగా అభివృద్ధి చేస్తోందన్నారు. ఆధునిక జీవనశైలికి అనుగుణంగా విమానా శ్రయాల్లో ప్రయాణీకులకు సౌకర్యాలను మెరుగు పరుస్తోంద న్నారు. కడప విమానాశ్రయం నుండి భవిష్యత్తులో పయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని నూతన టెర్మినల్ భవన నిర్మాణానికి భారతీయ విమానా శ్రయాల ప్రాధికార సంస్థ తగు చర్యలు చేపట్టిందన్నారు. రూ.266 కోట్ల వ్యయంతో చేపట్టనున్న నూతన టెర్మినల్ భవన అభివృద్ధి పనుల అనంతరం కడప కడప విమానాశ్రయం ఒక అపురూపమైన నూతన జవసత్వాలు సంతరించుకుని, అత్యుత్తమ శ్రేణి ఎయిర్ పోర్ట్‌గా ప్రాముఖ్యత సంతరిం చుకోనుందన్నారు. ఎయిర్ పోర్ట్ నూతన టర్మినల్ అభివృద్ధి పనుల్లో భాగంగా.. ఎయిర్ పోర్ట్ అథారిటీ, ఆర్ అండ్ బి, నేషనల్ హైవే, పోలీస్ శాఖలు జాయింట్ కమిటీగా ఏర్పాటై.. అందుకు సంబంధిం చిన రోడ్లు, రవాణా వ్యవస్థ తదితర మౌలిక సదుపాయాల ఏర్పాట్లను పర్యవేక్షిస్తుందన్నారు. రెండు వారాల్లో పర్యావరణ, అటవీశాఖ అనుమతులను పరిశీ లించి మౌలిక సదుపాయాల ఏర్పాటుకు.. అవసర మైన అన్ని రకాల చర్యలను చేపట్టనున్నట్లు తెలిపారు. పర్యావరణానికి ఎలాంటి అంతరాయం కలగకుండా ఏరో డ్రమ్ అభివృద్ధి పనులను చేపట్టేందుకు సంబందిత శాఖలు చర్యలు తీసుకోవాలన్నారు.

ఏపీఎస్పీఎస్‌లో భాగంగా కొరత ఉన్న భద్రతా సిబ్బందిని కుడా పూరించేందుకు సహకారం అందిస్తామన్నారు. ఏరో డ్రమ్ లో భద్రతా వాహనాల ఏర్పాటు కోసం.. రెవెన్యూ, కడప మున్సిపల్ కార్పోరేషన్, పోలీసు శాఖల సమన్వయ నిర్ణయంతో ముందుకు సాగడం జరుగుతోందన్నారు జరుగుతుంద న్నారు. ఎయిర్ పోర్ట్ పరిసరాలను స్వచ్ఛంగా, పరిశు భ్రంగా, ఆహ్లాదకరంగా ఉంచడంలో కడప మున్సిపల్ కమీషన్, పంచాయతీ రాజ్ శాఖలు ప్రత్యేక బాధ్యత తీసుకోవాలన్నారు. విమానాశ్రయంలో ప్రజలకు మరిన్ని సౌకర్యాలను కల్పించాలని, విమానాశ్రయాన్ని సుందరంగా తీర్చిదిద్దాలని కమిటీ సభ్యులను జిల్లా కలెక్టర్ ఆదేశించారు. విమానాశ్రయ ప్రాంగణంలో భద్రతా భద్రతా చర్యలను పెంపొందించాలని, చుట్టుపక్కల ఎటువంటి చెత్త లేకుండా చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఎయిర్ పోర్ట్ అభివృద్ధికి సంబంధించి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల తరపున, జిల్లా యంత్రాంగం తరపున పూర్తి స్థాయి సహాయ సహకారాలు అందిస్తామని జిల్లా కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు, డిఎఫ్ఓ సందీప్ రెడ్డి, విమానాశ్రయం డైరెక్టర్, కమిటీ కన్వీనర్ సుజిత్ కుమార్ పోదర్, ఏపీఎస్పీఎఫ్ కాషో ఆనందయ్య, సభ్యులు అదనపు మున్సిపల్ కమిషనర్ రాకేష్ చంద్ర, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# జాబ్ మేళాకు విశేష స్పందన

**- 159 మందికి ఉద్యోగ కల్పన**

మైదుకూరు - సూర్యవాస్తవం




ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదుకూరులో ప్రిన్సిపాల్ డాక్టర్ పి నారా యణ రెడ్డి అధ్యక్షతన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్య అభివృద్ధి సంస్థ, సీడాప్, డిస్ట్రిక్ట్ ఎం ప్లాయి మెంట్ ఎక్స్చేంజ్ ఆధ్వర్యంలో సెప్టెంబర్ 03న జాబ్ మేళాను నిర్వహించారు. ప్రిన్సిపల్ డాక్టర్ పి.నారాయణ రెడ్డి తమ స్వాగతం ఉపన్యాసంలో ప్రసంగిస్తూ ఏపీ స్కిల్ హబ్ ఆధ్వర్యంలో తమ కళా శాలలో నిర్వహిస్తున్న జాబు మేళాకి జిల్లా వ్యాప్తంగా వందలాది మంది తరలిరావడం చూస్తే నిరుద్యోగ సమస్య తీవ్రత ఎలా ఉందో అర్థమవుతుంది అని, ముఖ్యంగా యువత తమ వృత్తి నైపుణ్యాలను కోర్సులో ఉండగానే బాగా అభివృద్ధి చేసుకోవాలని సూచించారు. తమ కళాశాలలో స్కిల్ ద్వారా అందిస్తున్న వివిధ రకాల కోర్సులు పట్ల అవగాహన కల్పించారు. అంతేకాక భాషా నైపుణ్యాలని మెంటల్ ఎబిలిటీ అర్థమెటిక్ రీజనింగ్ జనరల్ నాలెడ్జ్ వంటి అనేక అంశాల పట్ల పట్టు సాధించాల్సిన అవసరం ఎంతైనా ఉందని తెలియజేశారు. స్కిల్ హబ్ కో-ఆర్డినేటర్ రాధారాం మాట్లాడుతూ తమ కళాశాలలో చదువుతున్న విద్యార్థు లకు ప్రతి ఒక్కరూ కంప్యూటర్ కోర్సుల పట్ల తగిన నైపుణ్యాలు కలిగి ఉండటం వల్ల సులువుగా ఉద్యోగాలు పొందవచ్చునని సూచిం చారు. జాబ్ మేళాకో హాజరైన ప్రతి ఒక్కరూ ఉద్యోగం పొందా లని ఆశించారు. ఉద్యోగాలు రాని వారు నిరాశ పడకుండా తమ నైపుణ్యాలను మరింతగా పెంచుకొని రాబోయే రోజు లలో జరిగే అనేక ఉద్యోగ మేళా నందు పాల్గొని మంచి ఉద్యోగం పొందే అవకాశం ఉన్నట్లుగా సూచించారు. ముఖ్య అతిథిగా జిల్లా ఉపాధి కల్పనా అధికారి సురేష్ కుమార్, డిస్ట్రిక్ట్ స్కిల్ డెవలప్మెంట్ ఆఫీసర్ డి.నాగా ర్జున, విశిష్ట అతిథులుగా జేడియం వేణుమాధవ్ హాజరయ్యారు. జిల్లా ఉపాధి కల్పనా అధికారి సురేష్ కుమార్ మాట్లాడుతూ జిల్లాలోని నిరు ద్యోగ యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. అలాగే ఇలాంటి జాబ్ మేళాలు ప్రతి నెల జిల్లాలోని ప్రతి ఒక్క నియో జకవర్గంలో జరుగుతుందని వివరిం చారు. ఈ కార్యక్రమానికి 05 సంస్థల అధికారులు హాజరయ్యారని ఆయన వివరించారు. తదనంతరం కళాశాలలో చదువుతున్న విద్యార్థులకు కెరీర్ కౌన్సి లింగ్‌లో భాగంగా డిస్టిక్ ఎంప్లాయ్మెంట్ ఆఫీసర్ అయిన శ్రీ సురేష్ కుమార్‌తో జాబ్ ఆపర్చునిటీస్ గురించి, యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ పోటీ పరీక్షల గురించి అవగాహన కల్పించి జీవన నైపుణ్యాలు ఎలా పెంపొందించుకోవాలో వివిధ రకాల ఉదా హరణలతో విద్యార్థులను ప్రేరేపించి ప్రోత్స హించారు. అభి టెక్నాలజీ, అమర్ రాజా గ్రూప్, ముత్తూట్ ఫైనాన్స్, నవత ట్రాన్స్పోర్ట్, డిక్సన్ కంపెనీలు నిర్వ హించిన ఇంటర్వ్యూలలో మొత్తం 232 మంది అభ్యర్థులు హాజరు కాగా అందులో 129 మంది సెలెక్ట్ అయ్యారు. స్కిల్ అప్ ఇంచార్జ్ ఆఫీసర్ శ్రీ రాదారామ్ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ప్రభు త్వ డిగ్రీ కళా శాల మైదుకూరు నందుగల స్కిల్ హబ్ సిబ్బంది కేశవ, శివ కృష్ణ, వైస్ ప్రిన్సిపాల్ శ్రీ సుభాన్ సాహెబ్, ప్లేస్మెం ట్ ఆఫీసర్ శ్రీనివాసులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

# బీజేపీ సభ్యత్వ నమోదు విజయవంతం చేయండి

**- మండల కార్యకర్తలతో సమావేశం**
**- బిజెపి జిల్లా అధ్యక్షులు వంగల శిశు భూషణ్ రెడ్డి**



దువ్వూరు - సూర్యవాస్తవం : బిజెపి సభ్యత నమోదును విజయవంతం చేయాలని భారతీయ జనతా పార్టీ జిల్లా అధ్యక్షులు వంగల శశి భూషణ్ రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం మండల కేంద్రమైన దువ్వూరులోని బండి వారి కళ్యాణ మండపంలో బిజెపి మండల సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని బిజెపి మండల శాఖ అధ్యక్షులు పల్లె సుబ్బారెడ్డి, బిజెపి రాష్ట్ర మాజీ కార్యవర్గ సభ్యులు ఆరవేటి హరికృష్ణ ఆధ్వర్యం లో కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జిల్లా బిజెపి అధ్యక్షులు వంగల శిశు భూషణ్ రెడ్డి హాజరై మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోడీ ప్రవేశపెట్టిన పథకాలను, ఆశయాలను ముందుకు తీసుకపోవడం లో మన అందరి బాధ్యత ఎంతో ముఖ్యమని, దేశవ్యాప్తంగా 18 కోట్ల సభ్యత్వ నమోదు కార్యక్రమం విజయవంతం కాబోతుందని సెప్టెంబర్ 1 నుండి 25వ తేదీ వరకు దేశవ్యాప్తంగా సభ్యత నమోదు కార్య క్రమం నిర్వహించబడుతుందని తెలిపారు. సెప్టెంబర్ 1వ తేదీ జాతీయస్థాయిలో బిజెపి ప్రధాని నరేంద్ర మోడీ మొదటిగా ప్రారంభి స్తారని రెండవ తేదీ రాష్ట్ర వ్యాప్త స్థాయిలో మూడో తేదీ జిల్లా స్థాయిలో సభ్యత్వ నమోదు కార్యక్రమం విస్తృతంగా కొనసాగించ బడుతుందని ఫోన్ -18800002024) ద్వారా బిజెపిలో సభ్యత్వ నమోదు పొందవచ్చునని మిస్డ్ కాల్ ద్వారా.యువర్ కోడ్ స్కాన్ ద్వారా వెబ్సైట్ నమోదు యాప్ ద్వారా కూడా సభ్యత్వ నమోదు చేసుకొని ప్రధాని నరేంద్ర మోడీ ఆశయాలు ముందుకు తీసుకువెళ్లాలని కార్యకర్త స్థాయినుండి జాతీయస్థాయి నాయకుడు వరకు సభ్యత్వ నమోదు ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు. ప్రధాని నరేంద్ర మోడీ పథకాలతో దేశం జాతీయ స్థాయిలో అభివృద్ధి పథంలో నడుస్తుందని, కేంద్ర ఉచిత విద్యలో భాగంగా సర్వశిక్ష అభియాన్ తో స్కూల్ అభివృద్ధి, పౌష్టిక ఆహారము అన్ని కూడా కేంద్రప్రభుత్వ నిధులతో కొనసా గించబడు తుందని, ఆయుష్మాన్ భారత్ నిధులు కింద ప్రతి వ్యక్తికి ఐదు లక్షలు ఆరోగ్యలపై కేంద్రం ఇస్తున్న ఉచిత, విద్య లో భాగంగా ఫీజు రివర్స్మెంట్, జలయజ్ఞం పూర్తిగా కేంద్రం భరిస్తుందని, డ్వాక్రా సంఘాల కేంద్ర ప్రభుత్వ సహాయంతో నడుస్తున్నాయని, భారతదేశ ప్రజల కోసం 194 సంక్షేమ పథకాలు ఇచ్చిన మన ప్రధాని నరేంద్ర మోడీ అని అన్నారు. భారతదేశంలో అతి పెద్ద పార్టీగా భారతీయ జనతా పార్టీ నమోదు అయిందని జిల్లా అధ్యక్షులు శశి భూషణ్ రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర బిజెపి కార్యవర్గ మాజీ సభ్యులు ఆరవేటి హరికృష్ణ, మండల బిజెపి అధ్యక్షులు పల్లె సుబ్బారెడ్డి, మాజీ బిజెపి మండల అధ్యక్షులు అమ్మిరెడ్డి రాజగోపాల్ రెడ్డి, గుర్రాల మునిరెడ్డి, జిసిబి గుర్రప్ప మండలంలోని బిజెపి కార్యకర్తలు పాల్గొన్నారు.

# ప్రజారోగ్యంపై దృష్టి సారించండి

**- సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు చేపట్టండి..**
**- వైద్యాధికారులకు సూచించిన చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాద రావు**



**చిత్తూరు- సూర్యావాస్తవం:** వర్షాల నేపథ్యంలో.. ప్రజారోగ్యం పై దృష్టి సారించాలని, చిత్తూరు పార్లమెంటు నియోజకవర్గంలో విధులు నిర్వర్తిస్తున్న వైద్యాధికారులకు చిత్తూరు పార్ల మెంటు సభ్యులు దగ్గుమళ్ళ ప్రసాదరావు సూచించారు. మరీ ముఖ్యంగా సీజ నల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు చేపట్టాలని ఆయన తెలియజేశారు. ప్రకృతి విపత్తు వరదల రూపం లో విరుచుకుపడి విలయం సృష్టిస్తున్న నేపథ్యంలో ఆయన మంగళవారం స్పందిం చారు. కురుస్తున్న వర్షాలకు పారిశుద్ధ్యం దెబ్బతినే ప్రమాదం ఉందని, దీని పై అధికారులు అప్రమత్తం కావలసిన అవసరం ఉంద న్నారు. వర్షపు నీటి నిల్వలు దోమలకు ఆవాసంగా మారే ప్రమాదం ఉందని, వీటిని అరికట్టడానికి కావలసిన నివారణ చర్యలు చేపట్టాలని చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ళ సూచించారు. అంతేకాకుండా డెంగీ, మలేరియా, టైఫాయిడ్ వంటి విషజ్వరాలు ప్రబల కుండా జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించే దిశగా అధికారులు ముందుకు సాగాలన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలనీ, పారిశుధ్యం పై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. మరీ ముఖ్యంగా ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రాలు చక్కగా పనిచేయాలని, వైద్యాధి కారులు తమ కర్తవ్యాన్ని చిత్తశుద్ధితో నిర్వర్తించి, ప్రజా ఆరోగ్యాన్ని కాపాడాలని ఆయన కోరారు. ప్రజలు కూడా ప్రమా దకర వ్యాధుల నుంచి తమను తాము కాపాడుకునేందుకు, ఆరోగ్య సూత్రాలను పాటించాలని దగ్గుమళ్ళ ప్రసాదరావు చిత్తూరు పార్లమెంటు ప్రజలకు తెలియజేశారు.

**ఏపీ సీఎం చంద్రబాబు కృషిని కొనియాడిన చిత్తూరు ఎంపీ**

చరిత్రలో కనివిని ఎరుగని రీతిలో కురిసిన భారీ వర్షాలు, బెజవాడను నీట మునిగేలా చేసాయని, అయితే అపార అనుభవం కలిగిన.., ఏపీ సీఎం నారా చంద్రబాబు నాయుడు వరద ముంపు నుంచి విజయ వాడను బయట పడేసేందుకు తీసుకున్న నిర్ణయాలు సత్ఫలితాల నిచ్చాయని చిత్తూరు ఎంపి దగ్గుమళ్ళ ప్రసాదరావు.. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి కృషిని కొనియాడారు. అదే సమ యంలో వరద బాధితులను అన్ని రకాల ఆదుకునేందుకు చేపట్టిన సహాయక చర్యలు సీఎం చంద్రబాబు చిత్తశుద్ధికి నిదర్శనం అన్నారు. వరద ముప్పు చిక్కుకున్న బాధితులను గుర్తించి, వారికి అండగా నిలిచేందుకు ప్రభుత్వ యంత్రాంగం అహర్నిశలు శ్రమిస్తోందన్నారు. ఇప్పుడు విజయవాడలో నెలకొన్న పరిస్థితులను బట్టి చూస్తే ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు లాంటి నాయకత్వం రాష్ట్రానికి ఎంత అవసరమో తెలియ వచ్చిందన్నారు.

# డెంగ్యూ కేసులు పెరగకుండా చర్యలు తీసుకోండి



**బంగారుపాళ్యం - సూర్యవాస్తవం :** చిత్తూరు జిల్లా బంగారుపాలెం మండలం తుంబ కుప్పం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మెడికల్ ఆఫీసర్ డాక్టర్ లోహిత్ చంగల్ రాయల్ ఆధ్వర్యంలో మంగళవారం డెంగ్యూ పై రివ్యూ మీటింగ్ నిర్వహించారు. ప్రతి ఒక్కరిని డెంగ్యూ కేసులు పెరగకుండా తగినటువంటి చర్యలు దోమల నివారణ కార్యక్రమం చేపట్టాలని అందులో భాగంగా దోమను ఎలా అరికట్టాలి అనే విధానాలపై చర్చించారు. యాంటీ లార్వా ఆపరేషన్ ద్వారా లార్వాలను నిషేధించుట ఫాగింగ్ పైరిత్రం అను క్రిమిసంహారిక మందులను ఇంటి లోపల కొట్టడం ద్వారా దోమలు చనిపోయి డెంగ్యూ రావడానికి ఆస్కా రం ఉండదని చెప్పారు. కార్యక్రమాలను ప్రతి సచివా లయం పరిధిలో ప్రతి సచివాలయం ఏఎన్ఎం ఆశా లకు సూపర్వైజర్లకు శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమం లో ఎన్. శరత్ కుమార్ దోమలను నియంత్రించే విధానాలపై అవగాహన చేశారు. ఈ యొక్క నెలలో ప్రతి సెంటర్ లో జీరో కేసు రావాలని దానికి మెడికల్ ఆఫీసర్ చెప్పిన విధంగా ఫాలో అయితే కచ్చితంగా జీరో కేసు వస్తుందని చెప్పడం జరిగింది. అంతేకాకుండా ఎంఆర్ కేసుల టార్గెట్లు విషయంలో వాక్సినేషన్ పై సక్రమంగా వ్యాక్సినేషన్ జరపాలని గర్భవతులకు ఇచ్చేటువంటి సేవలను కచ్చితంగా అందించాలని ప్రతి ఒక్కరిని మోనిటర్ చేయాలని క్లోరినేషన్ ప్రతి ట్యాంకును ప్రతి పంచా యతీలో సెక్రటరీ ద్వారా ఏఎన్ఎం చేయించాలని చెప్పారు. వైద్య సిబ్బందికి సూచనలు సలహాలు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీహెచ్వో రమేష్ సూపర్వైజర్ అమ్ముదా సూపర్వైజర్ రమాదేవి సూపర్వైజర్ హరికృష్ణ సూపర్వైజర్ డిపిఎమ్ఓ మనీ లెప్రసీ క్షయ వ్యాధులపై ఏఎన్ఎం లకు అవగాహన కల్పించారు.



## ఆశా కార్యకర్తల సమీక్ష!




**పాలసముద్రం - సూర్యావాస్తవం:** మండల కేంద్రంలోని స్థానిక ప్రాథమిక వైద్యశాలలో చిత్తూరు జిల్లా లెప్రసీ ఎయిడ్స్,టిబి ఇమ్యునిజేషన్ ఆఫీసర్ జి. వెంకటప్రసాద్ ఆధ్వర్యంలో మంగళవారం వైద్యశాల పరిధిలోని ఆశా కార్యకర్తల సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆశాకార్యకర్తలు వారివారి ఏరియా పరిధిలో ప్రభుత్వ ఆరోగ్య పథకాలు ఆరోగ్య సేవలు గురించి ఆరోగ్యశ్రీ, తదితర వాటి గురించి గ్రామీణ ప్రాంత ప్రజలకు అవగాహన కల్పిం చాలని అదేవిధంగా ఆశా కార్యకర్తల పరిధిలో క్షయ రోగులు, కుష్టురోగులు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులున్న వారిని గుర్తించి వైద్యశాలకు తీసుకొనిరావాలని గర్భిణీలు నెలవారి టీకాలు వేయించుకుంటున్నారా లేదా మందులు తీసుకుంటు న్నారా అని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తుండాలని తెలిపారు. ఈ సమావేశంలో మెడికల్ ఆఫీసర్లు, మోహన్ కృష్ణ, లోకేష్, సిహెచ్ఓ జ్ఞాన శేఖర్, సూపర్వైజరు మురళి, ఏఎన్ఎంలు, వైద్యశాల ఆరోగ్య సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## తగ్గువారిపల్లి తక్కన్నకుంటకు మహర్దశ

**- త్వరలోనే పనులు ప్రారంభం**
**- మండల తహశీల్దార్ బాబు రాజేంద్రప్రసాద్**



**బంగారుపాల్యం- సూర్యావాస్తవం:** చిత్తూరు జిల్లా, బంగారు పాల్యం మండలం, తగ్గు వారి పల్లెకు చెందిన తక్కన్న గుంటను త్వరలోనే సుందరీకరణ పనులు చేపట్టనున్నామని మంగళవారం తహశీల్దార్ కార్యాలయంలో పత్రికా సమావేశంలో మండల తాసిల్దార్ బాబు రాజేంద్రప్రసాద్ తెలిపారు. పూతల పట్టు ఎమ్మెల్యే చొరవతో మండల కేంద్రంలోని తక్కన్న కుంటకు మోక్షం లభించిందని బంగారు పాళ్యం తహశీల్దార్ బాబు రాజేంద్రప్రసాద్ అన్నారు. మంగళవారం తాసిల్దార్ కుంటను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ త్వరలోనే ఎమ్మెల్యే, నాయకులు,దాతల సహకారంతో కుంటను సుందరీకరణలో భాగంగా వాకింగ్ ట్రాక్, బెంచీలు, బోటింగ్ , చెట్లు నాటే కార్యక్రమం, టైల్స్ ఏర్పాటు మొదలగు పనులు చేస్తామన్నారు. కుంటను ఎవరు కూడా ఆక్రమించ రాదని ఆయన విజ్ఞప్తి చేశారు. మండల అభివృద్ధికి ప్రజలు నాయకులు అందరూ సహకరించి అభివృద్ధి పథంలో నడిపేందుకు కృషి చేయాలని పిలుపుని చ్చారు. మన బంగారుపాల్యం మన అభివృద్ధి అనే నినాదంతో ముందుకు వెళ్లాలని దీనికి ప్రతి ఒక్కరూ సహకరించవలసిందిగా కోరారు. అభివృద్ధి పనులకు దాతలు ముందుకు వస్తే నాయకులు సహకారంతో ఈ కార్యక్రమాలన్నీ పూర్తి చేయడానికి అవకాశం ఉంటుందన్నారు. ఇప్పటికే కుంట చుట్టూ సర్వే పూర్తి స్థాయిలో చేయించి ట్రెంచ్ పని ప్రారంభించడం జరిగిందన్నారు.

## హెచ్ఐవి పట్ల అవగాహన కల్పించండి

**- కుప్పం మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సాయి హేమంత్**




**కుప్పం - సూర్య వాస్తవం :** కుప్పం మండలంలోని ప్రతి ఇంటిలోని సభ్యు లందరికీ హెచ్ఐవి పట్ల అవగాహన కల్పించాలని, హెచ్ఐవి బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, హెచ్ఐవి పాజిటివ్ ఉన్న వారిని చులకనగా చూడకూడదని మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సాయి హేమంత్ అన్నారు. 'మీకు తెలుసా' హెచ్ఐవి అనే అవగాహన కార్యక్రమంలో భాగంగా కుప్పం మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆయన కుప్పం మండల వైద్య సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి కోర్ ప్రతినిధి ప్రవీణ మాట్లాడుతూ హెచ్ఐవి పట్ల ప్రతి ఒక్కరూ తెలుసుకొని తమ చుట్టుపక్కల వారికి అవగాహన కల్పించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్ట్ మేనేజర్ సుమలత సూపరింటెండెంట్ సుమిత్ర, సిహెచ్ ఓలు, ఏఎన్ఎంలు ఎంఎల్ హెచ్పీలు, ఆశ వర్కర్లు, పాల్గొన్నారు.

## జాబ్ మేళా విజయవంతం

**- జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి**




**చిత్తూరు, సూర్య వాస్తవం:** రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, ఎంప్లాయి మెంట్ ఎక్స్చేంజ్, సీడప్, డి.ఆర్.డి.ఎ సంయుక్తంగా సెప్టెంబర్ నెల 03వ తేదిన మంగళవారం స్థానిక ప్రభుత్వ ఐ.టి.ఐ. కళా శాలలో జాబ్ మేళా విజయ వంతంగా నిర్వహించడం జరిగిందని చిత్తూరు జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి యమ్. గుణశేఖర్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇందులో జాన్సన్ లైఫ్ ప్రైవేట్ లిమిటెడ్, డైకిన్ ఎయిర్- కండిషనింగ్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్, కేఎల్ గ్రూప్స్ - అమెజాన్, ముత్తూట్ ఫైనాన్స్ లిమిటెడ్, రిలయన్స్ డిజిటల్ ప్రైవేట్ లిమిటెడ్ వారు జాబ్ మేళాలో పాల్గొన్నారు. కనీస విద్యార్హత పదవ తరగతి, ఇంటర్, ఐటిఐ డిగ్రీ ఫెయిల్/పాస్ అయిన 18 సం" నుండి 35 సం" మధ్య వయస్సు కలిగిన స్త్రీ, పురుష అభ్యర్థులు హాజరు అయ్యారని తెలిపారు.

**ఈ మేళాకి హాజరైన వారు :134, సెలెక్ట్ అయిన వారు : 46**

**షార్ట్ లిస్ట్ అయిన వారు : 13.** ఈ కార్య క్రమానికి జి. పద్మజ, డిస్ట్రిక్ ఎంప్లాయ్ మెంట్ అధికారి, యం.రవీంద్ర, ప్రిన్సిపాల్, ఐ.టి.ఐ మురళీకృష్ణ, ప్లేస్మెంట్ అధికారి, ఐ.టి.ఐ,యం. ఏకాంబరం, అదనపు జిల్లా నైపుణ్యాభి వృద్ధి సంస్థ అధికారి, ఏపీఎస్ఎస్డిసి, ఎన్. రూపేష్,స్కిల్ హబ్ కోఆర్డినేటర్, ఏపీఎస్ఎస్డిసి యుగంధర్, రీజినల్ ప్లేస్మెంట్ అధికారి, సీడాప్, యం ఆర్ లోకేష్, డైరెక్ట్ ప్లేస్మెంట్ అధికారి, సీడాప్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

## ఇసుక డంపులు స్వాధీనం



**పాలసముద్రం- సూర్యావాస్తవం:** మండలంలోని పాలసముద్రం గ్రామంలో వాసు మందడి రెవెన్యూ భూమిలో అక్రమంగా నిల్వ చేసిన సుమారు 5 ట్రాక్టర్ల ఇసుక డంపులను మంగళవారం కార్వేటినగరం సిఐ హనుమంతప్ప, పాల సముద్రం ఎస్సై భారతి సీజ్ చేసినట్లు తెలిపారు. ఇసుకను రెవెన్యూ అధికారులకు అప్పగించి వాసు మందడి మీద కేసు నమోదు చేసినట్లు సీఐ హనుమంతప్ప, ఎస్ఐ భారతి తెలిపారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ మండలంలో ఇసుకతో సులభంగా డబ్బుసంపా దించడం అలవాటు చేసుకున్న కొంతమంది ఇసుకాసురులు రింగ్గా ఏర్పడ్డారని. పోలీసుల కదలికలను ఎప్పటికప్పుడు గమనిస్తూ చాకచక్యంగా రాత్రికిరాత్రే ఇసుక లోడింగ్ చేసి తమిళ నాడుకు తరలిస్తున్నారు.గత వారం రోజులుగా పాలసముద్రం పోలీసులు తాను వరుస దాడులు చేసి ఇప్పటికీ మండల వ్యాప్తంగా 15 ట్రాక్టర్ల ఇసుకను సీజ్ చేసినట్టుగా తెలిపారు. ఇసుక అక్రమ రవాణా మూలంగా భూగర్భ జలాలు అడుగంటి బోర్లలో నీటిమట్టం పడిపోతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆయా గ్రామాల నుంచి నిత్యం పగలు, రాత్రి తేడా లేకుండా తమిళనాడుకు ఇసుక అక్రమ రవాణా సాగుతుందని స్థానికులు పేర్కొంటున్నారన్నారు. అప్పుడప్పుడు పోలీసు, రెవెన్యూ అధికారులు దాడులు చేసి కేసులు నమోదు చేసినా ఇసుక వ్యాపారుల తీరు మారడం లేదని. నిత్యం ట్రాక్టర్లు, టిప్పర్ల ద్వారా పెద్ద ఎత్తున ఇసుకను అక్రమంగా తమిళనాడుకు రవాణా చేస్తూ ఇసుక మాఫియా రూ.లక్షలు గడిస్తోంది. తమ ఆగడాలను అడ్డు కుంటున్న వారిపై దాడులకు సైతం తెగబడుతున్నారన్న ఆరో పణలున్నాయి. అనుమతులు లేకుండా ఎవరైనా ఇసుక తరలిస్తే సమాచారం అందించాలని సమాచారం అందించిన వారి పేరు గోప్యంగా ఉంచబడుతుందని ఆయన మీడియాకి పేర్కొన్నారు.

# 6న 35-చిన్న కథకాదు విడుదల




నివేదా థామస్, ప్రియదర్శి పులలికొండ ప్రధాన పాత్రల్లో తెరకెక్కించిన చిత్రం '35-చిన్నకథ కాదు'. నందకిశోర్ ఈమని దర్శకత్వం వహించిన ఈ మూవీని రానా దగ్గుపాటి సమర్పణలో సురేశ్ ప్రొడక్షన్స్, ఎస్ ఒరిజినల్స్, వాల్టెయిర్ ప్రొడక్షన్స్ సంయుక్తంగా నిర్మించాయి. ఇప్పటికే షూటింగ్ పూర్తిచేసుకున్న ఈ సినిమా ఈనెల ఆరోతేదీన



విడుదలకు సిద్ధమైంది. ఈ విషయాన్ని టాలీవుడ్ హీరో రానా ట్విట్టర్ ద్వారా షేర్‌చేశారు. ప్రియదర్శి బర్త్‌డే కావటంతో రిలీజ్‌తోపాటు స్పెషల్ పోస్టర్‌ను పంచుకున్నారు. మిడిల్ క్లాస్ ఫ్లామిలీ ఎమోషన్స్ కథాంశంతో ఈ సినిమాను రూపొందించారు. ఈ మూవీలో విశ్వదేవ్, గౌతమి, భాగ్యరాజ్ కీలకపాత్రలు పోషించారు.

## అద్భుతమైన మెలోడీగా.. అదంతేలే

అద్భుతమైన మెలోడీగా.. అదంతేలేధృవ సర్జా టైటిల్ పాత్రలో నటిస్తున్న భారీ బడ్జెట్ పాన్ ఇండియా చిత్రం 'మార్టిన్'. ఎ.పి.అర్జున్ దర్శకత్వంలో వాసవీ ఎంటర్‌ప్రైజెస్, ఉదరు కె.మెహతా ప్రొడక్షన్స్ బ్యానర్స్‌పై ఉదరు కె.మెహతా, సూరజ్ ఉదరు మెహతా ఈ భారీ యాక్షన్ థ్రిల్లర్‌ను నిర్మిస్తున్నారు. అక్టోబర్ 11న ఈ చిత్రం ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్ రిలీజ్ అవుతుంది. ఈ నేపథ్యంలో సోమవారం ఈ సినిమా నుంచి మేకర్స్ ఓ లవ్ మెలోడీ వీడియో సాంగ్‌ను విడుదల చేశారు. 'అదంతేలే..' అంటూ సాగే పాటను రామజోగయ్య శాస్త్రి రాశారు. మణిశర్మ పాటలకు స్వరాలం దిస్తున్నారు. శ్రీకృష్ణ, శ్రుతికా సముద్రాల పాటను అద్భుతంగా పాడారు. ఇమ్రాన్ సర్దారియా కొరియోగ్రఫీ అందించారు. నటుడు, దర్శకుడు అర్జున్ ఈ చిత్రానికి కథను అందించటం ఓ విశేషమైతే, రవి బస్రూర్ బ్యాగ్రౌండ్ స్కోర్‌ను సమకూర్చటం మరో విశేషం.



## పక్కా ఫ్యామిలీ ఎంటర్‌టైనర్




పక్కా ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గోపీచంద్, డైరెక్టర్ శ్రీను వైట్ల కలయికలో రూపొందుతున్న స్టైలిష్ యాక్షన్, ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ 'విశ్వం'. మేకర్స్ ప్రమోషన్స్‌ను స్టార్ట్ చేస్తూ ఈ చిత్ర టీజర్‌ను రిలీజ్ చేశారు. నరేష్ వాయిస్ ఓవర్‌తో టీజర్ స్టార్ట్ అవుతుంది. గోపీచంద్, కావ్యా థాపర్ పాత్రల పరిచయం, వారి క్యారెక్టర్స్‌లో కామెడీ స్పార్క్ ఆకట్టు కున్నాయి. టీజర్‌లో నటీనటులతో కామెడిక్ సీన్స్ హిలేరియస్‌గా ఉన్నాయి. టీజర్ చివరి భాగంలో యాక్షన్, థ్రిల్లింగ్ ఎలిమెంట్స్ అదిరి పోయాయి. ఎంటర్‌టైన్‌మెంట్, యాక్షన్‌ని ఎఫెక్టివ్‌గా బ్యాలెన్స్ చేస్తూ టీజర్‌ని ప్రజెంట్ చేశారు శ్రీను వైట్ల. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ, వేణు దోనేపూడి చిత్రాలయం స్టూడియోస్ పై నిర్మాత టిజి విశ్వ ప్రసాద్ నిర్మిస్తున్న ఈ మూవీ నిర్మాణ విలువలు టాప్ క్లాస్‌లో ఉన్నాయి. అక్టోబర్ 11న దసరాకి ఈ సినిమా విడుదల కానుంది.






# చరిత్ర సృష్టించిన బంగ్లాదేశ్

## పాకిస్తాన్‌పై టెస్ట్ సిరీస్ క్లీన్‌స్వీప్

**రావల్పిండి :** టెస్టు క్రికెట్‌లో బంగ్లాదేశ్ చరిత్ర సృష్టించింది. పాకిస్థాన్‌తో రెండు టెస్టుల సిరీస్‌ను 2-0తో క్లీన్‌స్వీప్ చేసి ఈ రికార్డును సాధించింది. టెస్టుల్లో పాక్‌పై బంగ్లాదేశ్ సిరీస్ గెలవడం, క్లీన్ స్వీప్ చేయడం ఇదే మొదటిసారి. రావల్పిండి వేదికగా జరిగిన రెండో టెస్టులో బంగ్లాదేశ్ 6వికెట్ల తేడాతో విజయం సాధించింది. 185 పరుగుల లక్ష్యఛేదనలో ఓవర్ నైట్ స్కోరు 42 పరుగులతో మంగళవారం రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన బంగ్లాదేశ్ 56ఓవర్లలో 4వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని అందుకుంది. ఓపెనర్లు జకీర్ హసన్(40), షాద్మాన్ ఇస్లామ్(24), నజ్ముల్ హొస్సేన్ శాంటో(38), మోమినుల్ హక్(34), ముష్ఫికర్ రహీమ్(22నాటౌట్), షకీబ్ అల్ హసన్ (21నాటౌట్) రాణించారు. పాక్ బౌలర్లలో మీర్ హంజా, షాజాద్, అబ్రార్ అహ్మద్, ఆఘా సల్మాన్ తలో వికెట్ పడగొట్టారు. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ లింటన్ దాస్‌కు, సిరీస్ మెహిదీ హసన్‌కు లభించింది. ఇప్పటి వరకు బంగ్లాదేశ్ విదేశాల్లో రెండు టెస్టు సిరీస్‌లను గెలుచుకున్నది. 2009లో వెస్టిండీస్‌తో, 2021లో జింబాబ్వేతో జరిగిన సిరీస్‌ల్లో విజయం సాధించింది.

**స్కోర్లు: పాకిస్థాన్ 274, 172, బంగ్లాదేశ్ 262, 185/4**




## లార్డ్స్‌లో ప్రపంచ టెస్ట్ ఛాంపియన్‌షిప్ ఫైనల్: ఐసిసి

**లండన్:** 2024-25 ప్రపంచ టెస్ట్ ఛాంపియన్‌షిప్ (డబ్ల్యుటిసి) ఫైనల్ లార్డ్స్‌లో జరగనుంది. లండన్‌లోని లార్డ్స్ స్టేడియం డబ్ల్యూటిసి ఫైనల్‌కు తొలిసారి ఆతిథ్యమివ్వనుంది. ఈ విషయాన్ని అంతర్జాతీయ క్రికెట్ మండలి(ఐసిసి) మంగళవారం వెల్లడించింది. 2025 జూన్ 11-15 మధ్య డబ్ల్యూటిసి ఫైనల్ జరగనున్నట్లు ఐసిసి తెలిపింది. డబ్ల్యూటీసీ ఫైనల్‌కు లార్డ్స్ స్టేడియం వేదికవ్వడం ఇది మొదటిసారి. తొలి సీజన్‌లో టీమిండియాను ఓడించిన న్యూజిలాండ్ టెస్టు గదను ముద్దాడింది. 2022-23లో కూడా భారత్ ఫైనల్ చేరినా ఆస్ట్రేలియా చేతిలో ఓడింది. ప్రపంచ టెస్టు చాంపియన్‌షిప్ 2024-25 సీజన్‌లో టాప్-2లో ఉన్న రెండు జట్లు ఫైనల్‌కు అర్హత సాధిస్తాయి. ప్రస్తుతం టెస్టు చాంపియన్‌షిప్ పాయింట్ల పట్టికలో రోహిత్ శర్మ నేతృత్వంలోని భారత జట్టు 68.52 పర్సంటేజ్‌తో




అగ్రస్థానంలో ఉండగా.. ఆస్ట్రేలియా 62.50 పర్సంటేజ్‌తో రెండో స్థానంలో ఉంది.

## అక్టోబర్ 18 నుంచి ప్రొ కబడ్డీ

### ఈసారి మూడు నగరాల్లో హంగామా

PKL

**బెంగళూరు:** ప్రొ కబడ్డీ లీగ్(పికెఎల్) సీజన్-11 షెడ్యూల్ వచ్చేసింది. ఇటీవల ప్రొ కబడ్డీ వేలం ముగియడంతో నిర్వాహకులు 2024 సీజన్ షెడ్యూల్‌ను విడుదల చేశారు. పికెఎల్ 11వ సీజన్ అక్టోబర్ 18 నుంచి ప్రారంభం కానుంది. హైదరాబాద్‌లోని గచ్చిబౌలి ఇండోర్ స్టేడియంలో జరిగే ప్రొ కబడ్డీ ఈ సీజన్ ప్రారంభం కానుంది. ఈ టోర్నీని ఈసారి మూడు నగరాల్లో నిర్వహించనున్నట్లు లీగ్ కమిషనర్ అనుపమ్ గోస్వామి మంగళవారం ఓ ప్రకటనలో వెల్లడించాడు.

### నోయిడా, పూణెలో

హైదరాబాద్ వేదకగా తొలుత పోటీలు జరుగనున్నాయి. అనంతరం నవంబర్ 10నుంచి నోయిడా ఇండోర్ స్టేడియంలో, డిసెంబర్ 3నుంచి పూణెలో పికెఎల్ హంగామా మొదలవ్వనుంది. అక్కడి బలెవడి బ్యాడ్మింటన్ స్టేడియంలో కబడ్డీ.. కబడ్డీ ముగియనుంది. సీజన్-1 ప్రొ కబడ్డీ లీగ్ చరిత్రలో తొలిసారి మూడే వేదికల్లో జరగడం ఇదే ప్రథమం. ఈసారి కూడా 12 జట్లు టైటిల్ కోసం పోటీ పడనున్నాయి. పదో సీజన్ విజేత పుణెరి పల్టన్ డిఫెండింగ్ చాంపియన్‌గా బరిలోకి దిగనుంది.

# గవర్నమెంట్ జీవో ప్రకారం రూ.16వేలు వేతనం ఇవ్వాలి




ప్రొద్దుటూరు–సూర్య వాస్తవం: స్థానిక జిల్లా ప్రభుత్వ హాస్పిటల్ లో పనిచేస్తున్న స్లీపర్స్ కు గవర్నమెంట్ జీవో ప్రకారం 16000 వేతనాలు ఇవ్వాలని సిఐటియు జిల్లా కార్యదర్శి సత్యనారాయణ సిఐటియు పట్టణ కార్యదర్శి విజయ్ కుమార్ డిమాండ్ చేశారు. మంగళవారం వారు గవర్నమెంట్ హాస్పిటల్ వద్ద ఆందోళన నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ నాలుగు నెలల నుంచి ప్రభుత్వ ఆసుపత్రి స్లీపర్స్ కు కాంట్రాక్టర్ వేతనాలు ఇవ్వడం లేదని, వెంటనే పెండింగ్లో ఉన్న వేతనాలు ఇవ్వాలని, పిఎఫ్ ఈఎస్ఐ నమోదు చేయాలని డిమాండ్ చేశారు. హాస్పిటల్ లో పనిచేసే స్లీపర్స్కు ప్రభుత్వం 16,000 వేతనాలు చెల్లించాల్సి ఉందని, కానీ కాంట్రాక్టర్ తక్కువ వేతనాలు ఇచ్చి అది కూడా నెలల తరబడి జీతాలు ఇవ్వకుండా కార్మికులను ఇబ్బందులకు గురి చేస్తూ వారి సమస్యలు పట్టిం చుకోవడం లేదన్నారు. వారికి నెలలు తరబడి జీతాలు ఇవ్వకపోతే వారి కుటుంబాలు ఏ రకంగా తిండి తిని బ్రతకాలి పైగా పీఎఫ్, ఈఎస్ఐ నమోదు చేయడం లేదని, వెంటనే పిఎఫ్ డబ్బులు జమ చేయాలని, తమ జీతాలలో పిఎఫ్ డబ్బులు కట్ అవుతున్నాయే తప్ప కాంట్రాక్టర్ వేస్తున్న 13శాతం జమ లేదని దీనిని ఒకసారి కాంట్రాక్టర్ ఆలోచించాలని కోరారు. కావున వెంటనే వారికి 16 వేల వేత నాలు ఇవ్వాలి పెండింగ్లో ఉన్న నాలుగు నెలల వేతనాలు వారి అకౌంట్లో జమ చేయాలని లేని పక్షంలో ఆందోళన తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఈ ధర్నాలో సిఐటియు కార్యదర్శి రాఘవ డివైఎఫ్ఐ కార్యదర్శి విశ్వనాథ్ తదితరులు పాల్గొన్నారు.

# రేషన్ సరుకులు సక్రమంగా పంపిణీ జరగాలి..

**- మదనపల్లె సబ్ కలెక్టర్ మేఘస్వరూప్...**



మదనపల్లె క్రైమ్ – సూర్య వాస్తవం: చౌక దుకాణాల నిర్వహకులు రేషన్ సరుకులను సక్రమంగా ప్రజలకు సక్రమంగా అందించాలని మదనపల్లె సబ్ కలెక్టర్ మేఘ స్వరూప్ ఆదేశించారు. మదనపల్లి పట్టణంలోని 36, 37 చౌక దుకాణాలను మంగళవారం సబ్ కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. షాపులో అన్ని రకాల నిత్యావసర సరుకులు అందుబాటులో ఉంచి నిర్దేశత వ్యవధిలోగా సరఫరా చేయాలని సూచించారు. డీలర్లు చౌక దుకాణాలలో మొక్కుబడిగా కాకుండా సమయపాలన పాటిస్తూ అందుబాటులో ఉండాలని తెలిపారు. 36, 37 చౌక దుకాణాలలో డీలర్లు అందుబాటులో ఉండటం చూసి సబ్ కలెక్టర్ హర్షం వ్యక్తం చేశారు. నిత్యవసర సరుకుల తుకాల్లో తేడాలు రాకుండా చూడాలని గోడౌన్ డిటి రెడ్డప్పను ఆదేశించారు. తోకల్లో తేడాలు వస్తే సిబ్బందిపై చర్యలు తప్పవని సబ్ కలెక్టర్ డిటిని హెచ్చరించారు.

# జగన్ అసత్య ఆరోపణలు మానుకోవాలి




ప్రొద్దుటూరు–సూర్య వాస్తవం: మాజీ ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి అసత్య ఆరోపణలు మానుకోవాలని ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి సూచించారు. మంగళవారం స్థానిక నెహ్రూ రోడ్డు లోని ఆయన కార్యాలయంలో విలేఖరుల సమావేశంలో మాట్లాడుతూ ఎన్టీఆర్ జిల్లా, విజయవాడ వరదల నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం, టిడిపి నాయకులు, సీఎం, అధికారులు నిరంతరం పర్యవేక్షిస్తూ సహాయ, పునరావాస చర్యలు చేపడుతున్నారని వివరించారు. కానీ మాజీ సీఎం జగన్ మాత్రం కొన్ని ప్రాంతాలలో పర్యటించి అక్కడ ప్రజలతో సహాయ, పునరావాస చర్యలు అందడం లేదని మాట్లాడిస్తూ రాజకీయాలు చేసే ప్రయత్నం చేసినా ప్రజలు నిజాన్ని తెలిపారని స్పష్టం చేశారు. శ్రీశైలం జలాశయం నుండి నీరు వదలకుండా వుంటే విజయవాడ కు వరద వచ్చేది కాదని జగన్ మాట్లాడటం సరికాదన్నారు. ప్రాజెక్టుల ఇన్ ఫ్లో, ఔట్ ఫ్లో గురించి మాజీ ముఖ్యమంత్రి జగన్కు తెలియకపోవడం బాధాకరమన్నారు. విజయవాడలో వరద పరిస్థితిని 11,49,000 క్యూసెక్కుల నీరు ప్రకాశం బ్యారేజి నుండి వదులుతున్నారని గుర్తించాలన్నారు. గత 5 సంవత్సరాల జగన్ పాలనలో రాష్ట్రంలో అభివృద్ధి కుంటుపడిందన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి సీనియర్ నాయకులు ఈ. వి. సుధాకర్ రెడ్డి,టౌన్ బ్యాంకు ఛైర్మన్ బొగ్గుల వెంకట సుబ్బారెడ్డి, టిడిపి మండల కన్వీనర్ బాబుల్ రెడ్డి, మాజీ కౌన్సిలర్ తలారి పుల్లయ్య, మాజీ టిడిపి పట్టణాధ్యక్షులు ఘంటసాల వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

# ఉక్కు కర్మాగారం ఏర్పాటుకు తక్షణ చర్యలు తీసుకోవాలి

**- ఏపీసీసీ చీఫ్ వైయస్ షర్మిల రెడ్డి కలెక్టర్‌కు వినతి**



కడప – సూర్య వాస్తవం ప్రతినిధి
వైఎస్ఆర్ జిల్లాలో ఉక్కు కర్మాగారం ఏర్పాటు చేయాలనే దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న డిమాండ్‌కు సంబంధించి మెమోరాండం సమర్పించాలని భారత జాతీయ కాంగ్రెస్ తరపున నేను మీకు లేఖ రాస్తున్నాను. దశాబ్దాలుగా ఈ డిమాండ్ జ్వలించే సమస్యగా ఉందని, ఈ ప్రక్రియను వేగవంతం చేసేందుకు రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు తక్షణమే చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. మీకు తెలిసిన విషయమే దివంగత డాక్టర్ వై.ఎస్. ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి రాజశేఖరరెడ్డి వైఎస్ఆర్ జిల్లాలో పారిశ్రామిక ప్రగతిని సాధించి, ఉపాధి అవకాశాలను కల్పించేందుకు ఉక్కు కర్మాగారాన్ని ఏర్పాటు చేయాలని భావించారు. ఆయన ఎడతెగని ప్రయత్నాలు చేసినప్పటికీ, ఆయన మరణానంతరం ప్రాజెక్ట్ పట్టాలు తప్పింది. కాంగ్రెస్ పార్టీ ఈ కారణాన్ని నిరంతరం అభిరుచితో కొనసాగిస్తోంది, అయితే దురదృష్టవశాత్తు, ఇతర రాజకీయ పార్టీలలో నిబద్ధత కొరవడింది. 2014లో రాష్ట్ర విభజన సమయంలో వైఎస్ఆర్ జిల్లాలో ఉక్కు కర్మాగారం ఏర్పాటుకు యూపీఏ ప్రభుత్వం నిబంధనలు రూపొందించింది. అయితే ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన బీజేపీ ప్రభుత్వం ఈ డిమాండ్‌ను విస్మరించడంతో ఆ తర్వాత వచ్చిన రాష్ట్ర ప్రభుత్వాలు పెదవి విప్పాయి. సమస్య. ప్రభుత్వం చూపిన నిర్లక్ష్యం, నిర్లక్ష్యం కారణంగా వైఎస్ఆర్ జిల్లా ప్రజలు తీవ్ర నిరాశకు గురయ్యారు. గత దశాబ్ద కాలంగా ఉక్కు కర్మాగారం పురోగతిని బీజేపీతో పాటు టీడీపీ, వైఎస్సార్సీపీ స్తంభించాయి. ఇది వంచన మాత్రమే కాదు, రాజ్యాంగాన్ని అగౌరవ పరచడం కూడా, ఎందుకంటే వారు ఏపీ పునర్వ్యవస్థీకరణ చట్టంలో చేసిన నిబద్ధతను అగౌరవపరిచారు. రాజ్యాంగబద్ధంగా పార్లమెంట్‌లో ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. అప్పటి ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి ప్రచార విన్యాసాలు చేశారు శంకుస్థాపన కార్యక్రమాన్ని ప్రకటిస్తున్నా, ఎలాంటి పురోగతి లేదు. బిజెపి నాయకులు ప్రాజెక్టుకు కట్టుబడి ఉన్నారని తప్పుడు ప్రచారం చేస్తున్నారు, కానీ వారు ఎటువంటి ప్రయత్నాలు చేయలేదు కేంద్ర ప్రభుత్వంపై ప్రభావం చూపుతుంది. ప్రస్తుతం జెఎస్‌డబ్ల్యు కడప స్టీల్ ప్లాంట్‌గా పిలవబడే ఈ ప్లాంట్ నిర్మాణం ఫిబ్రవరి 2023లో ప్రారంభం కావాల్సి ఉంది, కానీ ఎటువంటి పురోగతి లేదు. ముఖ్యంగా ఎన్నికల సమయంలో వైఎస్ఆర్ జిల్లా ప్రజలను తప్పుడు వాగ్దానాలతో పదే పదే మోసం చేశారని కాంగ్రెస్ పార్టీ గట్టిగా నమ్ముతోంది. బిజెపి, టిడిపి మరియు వైసిపి చేసిన కఠోర ద్రోహానికి వ్యతిరేకంగా మేము మా నిరాశను తీవ్రంగా వ్యక్తం చేస్తున్నాము. మేము కోరుతున్నామనిఅన్నారు.

**రాష్ట్ర ప్రభుత్వం పర్యవేక్షిస్తూ ఉక్కు కర్మాగారం స్థాపనను వేగవంతం చేయాలి**

ప్లాంట్ ఏర్పాటుకు పురోగతి మరియు కేంద్ర ప్రభుత్వం నిధులు సమకూర్చింది. ప్రాజెక్టుకు ఇనుప ఖనిజాన్ని సరఫరా చేయాలని కేంద్ర ప్రభుత్వం ఎన్ఎండిసిని నిర్దేశిస్తుంది. రాష్ట్ర ప్రభుత్వం ప్లాంట్‌కు నీరు మరియు విద్యుత్ మరియు ఇతర అనుబంధ మౌలిక మద్దతును అందిస్తుంది. ప్రభుత్వం ఒక రోడ్‌మ్యాప్ మరియు సమయ పాలనతో ముందుకు వచ్చి తక్షణమే అమలును ప్రారంభించాలని మేము అభ్యర్థిస్తున్నాము. లేని పక్షంలో తమకు జరిగిన అన్యాయాన్ని ప్రజలు గుర్తించేలా కాంగ్రెస్ కార్యకర్తలు రాష్ట్రవ్యాప్తంగా నిరసన కార్యక్రమం చేపడతారు. ఈ చొరవకు ప్రాణం పోసి, సులభతరమైన అమలు కోసం అడ్డంకులను తొలగించిన పార్టీగా, కాంగ్రెస్ స్టీల్ ప్లాంట్ కోసం పోరాటం కొనసాగిస్తుంది. ప్రజలలో నెలకొన్న ఈ నిరుత్సాహాన్ని గమనించి, రాష్ట్ర ప్రభుత్వానికి మరియు కేంద్ర ప్రభుత్వానికి మా డిమాండ్‌ను అందించవలసిందిగా కోరుతున్నాను. దయచేసి ఈ మెమోరాండమ్‌ను ప్లాంట్ పని తక్షణ ప్రారంభానికి అల్టిమేటంగా పరిగణించండి.

# పెండింగ్ జీతాలను వెంటనే చెల్లించాలి..

**- పస్తులతో ఉద్యోగాలు చేయలేమని ఆవేదన..**
**- సర్వజన బోధనాస్పత్రి వద్ద ధర్నా చేసిన కాంట్రాక్టు కార్మికులు...**



మదనపల్లె క్రైమ్ –సూర్యావాస్తవం : పెండింగ్ జీతాలను వెంటనే చెల్లించాలంటూ మదనపల్లె సర్వజన బోధనసుపత్రిలో పనిచేస్తున్న జీడీఏలు ఆఫీస్ అసిస్టెంట్లు, ఓటీ అసిస్టెంట్‌లు మంగళవారం ధర్నా చేశారు. ఈ ధర్నా సిపిఐ నియోజక వర్గ కార్యవర్గ సభ్యులు కృష్ణప్ప ఆధ్వర్యంలో జరిగింది. కృష్ణప్ప మాట్లాడుతూ.. గత 18 ఏళ్లుగా తాము ప్రభుత్వ ఆసుపత్రిలో విధులు నిర్వహిస్తున్నామని 13వేల వేతనంతో పనిచేస్తూ కుటుంబాలను పోషించుకుంటున్నామని తెలిపారు. 26 మంది పని చేస్తుండగా కొంతమందికి 13 నెలలుగా జీతాలు లేవని, మరి కొంతమందికి ఎనిమిది నెలలుగా జీతాలు అందక పోవడంతో మా పరిస్థితి దుర్భరంగా మారిందన్నారు. ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్, స్థానిక ఎమ్మెల్యే, డిసిహెచ్ఎస్, సబ్ కలెక్టర్ లకు పలుమార్లు విన్నవించినా తమకు జీతాలు ఇవ్వకపోగా పైపెచ్చు ఉన్నత స్థాయి అధికారులు తమను అవహేళనగా మాట్లాడడంతో పాటు పని భారాన్ని పెంచుతూ తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆరోపించారు. తమ బాధను అర్థం చేసుకొని వెంటనే జీతాలు చెల్లించాలని కోరారు. ఈ సందర్భంగా సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు తోపు కృష్ణప్ప కాంట్రాక్టు కార్మికులకు మద్దతు తెలియజేస్తూ అరకొర జీతంతో పని చేస్తున్నప్పటికీ కార్మికులను ఇంతలా వేధింపులకు గురి చేయడం సబబు కాదన్నారు. కొంతమందికి 13 నెలలు, మరికొంత మందికి 8 నెలలుగా జీతాలు ఇవ్వకపోవడంతో కుటుంబాలు పస్తులున్న పరిస్థితి నెలకొంద న్నారు. పిల్లలకు ఫీజులు కట్టలేక, స్కూలుకు పంపలేక, డ్యూటీలు అయిపోయిన తర్వాత టిఫిన్ సెంటర్లలో పనిచేసుకొని కుటుంబాన్ని నెట్టుకు రావాల్సిన పరిస్థితి కార్మికులకు తలెత్తిందని తెలిపారు. ఇప్పటికైనా ఉన్నత స్థాయి అధికారులు స్పందించి జీతాలు లేక అల్లాడుతున్న జీడిఎ, ఆఫీస్ అసిస్టెంట్, ఓటీ అసిస్టెంట్లకు వెంటనే జీతాలు చెల్లించి ఆదు కోవాలని కోరారు. లేనిపక్షంలో ఉద్యమాన్ని ఉధృతం చేసి ధర్నా కార్యక్రమాలు చేపడతామని ప్రభుత్వ అధికారులను హెచ్చరిం చారు. అనంతరం ఇన్చార్జ్ సూపరింటెండెంట్ కు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంట్రాక్టు కార్మికులు అమరావతి, పెద్దయ్య, ఉమా, లోకేష్, అహ్మద్, తులసి, ప్రభావతి, మృదుల, ప్రభావతి, హరి, పెద్దన్న తదితరులు పాల్గొన్నారు.



# అంకితభావంతో బోధన

**- విజ్ఞాన దీపారాధనుజాతీయ స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత విద్వాన్ డాక్టర్ గానుగపెంట హనుమంతరావు**

మైదుకూరు –సూర్య వాస్తవం: ఉపాధ్యాయుడు విరంతర అధ్యయనశీలిగా ఉండాలన్నది ఆయన విధానం.విద్యార్థులు విజ్ఞాన సముపార్జన నుంచి పక్క దారి పట్టకూడదన్నది ఆయన లక్ష్యం.అంకితభావంతో పనిచేస్తే ఎటువంటి విద్యార్థిలోనైనా విజ్ఞాన దీపాలు వెలిగించవచ్చనేది ఆయన దృఢ విశ్వసం.ఏ మార్గంలోనైనా ఎదురీత,చీకటి వెలుగులు,ఎత్తుపల్లాలు సహజమని,వాటిని అధిగమిస్తూ ముందుకుసాగితేనే విజయం సిద్ధిస్తుందని చెప్పే జాతీయ స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత, ప్రముఖ సాహితీ వేత్త విద్వాన్ డాక్టర్ గానుగపెంట హనుమంతరావు ఆ బాటలోనే సాగుతూ 70కి పైగా జిల్లా,రాష్ట్ర,కేంద్రస్థాయి అవార్డులను కైవసం చేసుకున్నారు.ఈ నెల 5వ తేదీ భారత మాజీ రాష్ట్రపతి జన్మదినం ,గురుపూజోత్సవం(టీచర్స్ డే) సందర్భంగా నేటి విద్య విధానం పై ఆయన తన అభిప్రాయాలను విస్పష్టంగా చెబుతూ అనేక సూచనలు చేశారు.విద్యారంగాన్ని పాలకులు అశ్రద్ధ చేస్తున్నారని,విద్య వ్యాపారంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. డాక్టర్ సర్వేపల్లి రాధా కృష్ణన్ గురువులకే స్ఫూర్తిప్రధాతగా,విద్యార్థి లోకానికి నిత్య స్మరణీయుడిగా చిర యశస్సు అందుకున్నారు–డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్! ఈ రోజు ఆయన జయంతి.నా పుట్టిన రోజును నాకెంతో ప్రియమైన ఉపాధ్యాయ వృత్తితో సమన్వయం చేయండి.నా జన్మదినాన్ని ఉపాధ్యాయ దినోత్సవంగా నిర్వహిస్తే నా జన్మకు సార్థకత చేకూరుతుందని ఆయన రాష్ట్రపతి పదవిలో ఉండగా ఆకాంక్షించారు.

# వైద్య, ఆరోగ్య సమస్యలపై ఎంపీజే రాష్ట్రవ్యాప్త ఉద్యమం




ప్రొద్దుటూరు– సూర్య వాస్తవం: వైద్య, ఆరోగ్య సమస్యలపై రాష్ట్ర వ్యాప్తంగా ఎంపీజే ఆధ్వర్యంలో సెప్టెంబర్ 1 నుంచి 15 తేది వరకు ఉద్యమాన్ని నిర్వహిస్తోందని మూమెంట్ ఫర్ పీస్ అండ్ జస్టిస్ (ఎంపిజే) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సలీం తెలిపారు. మంగళవారం స్థానిక ఎంపిజే కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం వైద్య పరంగా ప్రజలకు కల్పించే ఆరోగ్యశ్రీ మరియు సీఎం రిలీఫ్ ఫండ్లను రాజకీయాలకు అతీతంగా అర్హులైన వారందరికీ అందేలా కృషి చేస్తోందని, ఎన్టీఆర్ ఆరోగ్యశ్రీ ద్వారా ఆసుపత్రిలో ఉచితంగా వైద్య సేవలు గ్రామీణ, ఏరియా, జిల్లా హాస్పిటల్స్ లో రోగులకు అవసరమైన సౌకర్యాల గురించి దర్యాప్తు చేసి అవసరమైన మరియు మెరుగైన సేవలను అందించాలని ప్రజల జీవితాలను, ఆరోగ్యాన్ని సర్వనాశనం చేసే మద్యపాన నిషేధం అమలు చేసేలా ప్రజలతో మమేకమై ప్రభుత్వంపై పోరాటం చేస్తుందని వివరించారు. మున్సిపల్, కార్పొరేషన్లలో పరిశుభ్రతను పాటించేలా మరియు మౌలిక సదుపాయాలను కల్పించాలని రాష్ట్రంలోని మెడికల్ షాపులలో నిషేధిత, ఎక్స్పైర్ అయిన మందుల విక్రయాలను జరిపే వారిపై చర్యలు తీసుకునేలా సంబంధిత డ్రగ్స్ ఇనిస్పెక్టర్లపై ఒత్తిడి తెస్తుందని తెలిపారు. ప్రజల ఆరోగ్యంతో చెలగాటం ఆడుతున్న హెూటల్స్, స్వీట్, బేకరీ షాప్ లపై, కాలం చెల్లిన తినుబండరాలు ప్లాస్టిక్ కవర్ల వాడకాన్ని పరిశీలించి చర్యలు తీసుకునేలా ఫుడ్ ఇన్స్పెక్టర్ లపై ఒత్తిడి తెస్తుందన్నారు. ఈ సందర్భంగా అవసరాన్ని బట్టి వినతి పత్రాలు, ధర్నా తదితర కార్యక్రమాలను చేపడుతుందన్నారు. ప్రభుత్వ హాస్పిటల్స్ లలో రోగులకు అవసరమైన మిషనరీలు,మెరుగైన సదుపాయాలు కల్పించాలని ప్రభుత్వం పై ఒత్తిడి తీసుకుని వస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు జాకీర్ ఉమ్రి, పట్టణ అధ్యక్షుడు హుస్సేన్ భాష, కార్యదర్శి మహ్మద్ రఫీ, సభ్యులు అల్లాబకస్ తదితరులు పాల్గొన్నారు.

### వినాయక చవితి మండపాల ఏర్పాటుకు

# సింగిల్ విండో క్లియరెన్స్ విధానం

- అనుమతులకు ఆన్లైన్లో దరఖాస్తు చేసుకోవాలి
- ప్రజల వెసులుబాటు కొరకు రాష్ట్ర ప్రభుత్వం రూపకల్పన
- పోలీస్, అగ్నిమాపక, పురపాలక, విద్యుత్ శాఖల నుండి ఏకకాలంలో అనుమతి ఇవ్వడమే సింగిల్ విండో విధానం యొక్క ముఖ్య ఉద్దేశం



**అనంతపురం క్రైం ((సూర్య వాస్తవం):** వినాయక చవితి ఉత్సవ కార్యనిర్వాహకులు 7995095800 మొబైల్ నంబర్ కు వాట్సాప్ ద్వారా "హాయి "అని సందేశం పంపిస్తే, విధి విధానాలుతో కూడిన ప్రత్యుత్తరం వస్తుందనిhttps://ganeshutsav.net అనే వెబ్సైట్ లో కార్యనిర్వాహకుల వివరాలు నింపి పొందుపరచాలన్నారు. ఆఫీసుల చుట్టూ తిరగకుండా, సింగిల్ విండో విధానాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలనీ అనంతపురం డీఎస్పీ టి.వి.వి ప్రతాప్ కుమార్ విజ్ఞప్తి చేశారు.జిల్లాలో వినాయక చవితి ఉత్సవాల నేపథ్యంలో ఉత్సవ మంటపాలు, పందిళ్ళు ఏర్పాటు చేసే ప్రజల సౌకర్యార్థం రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా సింగిల్ విండో విధానాన్ని అందుబాటులోకి తీసుకొచ్చిన వివరాల గురించి అనంతపురం డీఎస్పీ టి.వి.వి ప్రతాప్ కుమార్ తెలియజేస్తూ జిల్లా ప్రజలు సద్వినియోగ పరుచుకోవాలని ఆయన తెలియజేశారు.గతంలో వినాయక మంటపం ఏర్పాటు కోసం ప్రజలు అగ్నిమాపక శాఖ, పురపాలక శాఖ, విద్యుత్ శాఖ, పోలీసు శాఖల నుంచి నిరభ్యంతర పత్రం తీసుకోవలసి ఉండేదనీ దీనికోసం ప్రజలు ఆయా శాఖల చుట్టూ తిరగవలసి వచ్చేదన్నారు. ప్రజల సౌకర్యం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఈ సింగిల్ విండో క్లియరెన్స్ విధానమును ొందించారన్నారు.ఇందులో భాగంగా ప్రజలు "7995095800 మొబైల్ నంబర్ కు వాట్సాప్ ద్వారా హాయి అని సందేశం పంపిస్తే చాలు", నిరభ్యంతర పత్రం కోసం అనుసరించవలసిన ప్రక్రియ మొత్తం వాట్సాప్ ద్వారా ప్రజల యొక్క మొబైల్ ఫోన్ కు ప్రత్యుత్తరం వస్తుందన్నారు.ఆ తరువాత ప్రజలు https://ganeshutsav.net అనే వెబ్సైట్ లో గణేష్ మంటపం ఏర్పాటు చేయదలచిన కమిటి సభ్యుల వివరాలు, మంటపం ఏర్పాటు చేయు ప్రదేశం, ఏ పోలీసు స్టేషన్ పరిధి లోకి వస్తుంది, విగ్రహం ఎత్తు, మంటపం ఎత్తు, విగ్రహ ప్రతిష్ఠ ఏ రోజు జరుగుతుంది, నిమజ్జనం ఎక్కడ ఏ సమయం లో చేస్తారు, ఏ వాహనం ద్వారా నిమజ్జనం చేస్తారు వంటి వివరాలను నమోదు చేసి దరఖాస్తు చేసుకోవాలి. ఆ దరఖాస్తు సంబంధిత పోలీసు స్టేషన్ ఎస్.హెచ్.ఓ కి వెళ్తుందన్నారు. సదరు ఎస్.హెచ్.ఓ ఆధ్వర్యంలో పురపాలక శాఖ, అగ్నిమాపక శాఖ, విద్యుత్ శాఖల యొక్క సిబ్బంది ఒక బృందంగా ఏర్పడి మంటపం ఏర్పాటు చేయు ప్రదేశమును సందర్శించి, ఏర్పాట్లను పరిశీలించి సానుకూలంగా ఉంటే అనుమతికి అవసరం అయిన రుసుము వివరాలు తెలియచేస్తారన్నారు. ప్రజలు వారికి దగ్గరలో ఉన్న మీ-సేవ కేంద్రము నందు తగిన రుసుమును చెల్లించి ఆ రసీదును వెబ్సైట్ లో అప్లోడ్ చేసిన యెడల ఎస్.హెచ్.ఓ వాటిని పరిశీలించి వెంటనే క్యూ ఆర్ కోడ్ తో కూడిన నిరభ్యంతర పత్రం ను జారీ చేస్తారన్నారు.ఈ నిరభ్యంతర పత్రాన్ని ప్రింట్ తీసి గణేష్ మంటపంలో ఉంచవలెను. పోలీసువారు సందర్శన సమయములో క్యూ ఆర్ కోడ్ ని స్కాన్ చేసి తనిఖీ చేస్తారని తెలిపారు.అనంతపురం సబ్ డివిజన్ పరిధిలోని వినాయక ఉత్సవ మండపాల కార్యనిర్వాహకులు ఈ సింగిల్ విండో విధానాన్ని సద్వినియోగపరుచుకోవాలన్నారు.

# విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదు

### ❖ కురవంకలో అక్రమ నిర్మాణాలు వెంటనే తొలగించండి ❖ అధికారులకు ఎమ్మెల్యే షాజహాన్ బాషా

**మదనపల్లె క్రైమ్-సూర్య వాస్తవం:** మదనపల్లె పట్టణం, కురవంకలో చెత్తవేయడం వలన వర్షం పడిన సమయంలో నీరు వెళ్లే మార్గం లేక అ నీరు ఇండ్లలోకి చేరుతున్నా యని ఎమ్మెల్యే షాజహాన్ బాషా ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం ఆయన సంబంధిత అధికారులతో కలసి కురవంకలో పర్యటించి ఆక్రమణలను పరిశీలించారు. ఈ సందర్భంగా పారిశుద్యం అధ్వానంగా ఉండడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ వెంటనే ఆరోగ్యకరమైన వాతావరణం నెలకొల్పాలని పారిశుధ్య సిబ్బందికి ఆదేశించారు. పారిశుధ్య విభాగంలో బాధ్యతారహితంగా వ్యవహరించే మున్సిపాలిటీ మరియు గ్రామపంచాయతీ సిబ్బంది వైఖరిని ఖండిస్తూ విధులు సక్రమంగా నిర్వహించని వారిపై సస్పెన్షన్ వేటు వేస్తామని హెచ్చరించారు.గతంలో సమస్య తమ దృష్టి వచ్చిందని,తిరిగి మూడవసారి సమస్య పునరావృతం కావడంపై ఆయన అసహనం వ్యక్తం చేశారు.టౌన్ ప్లానింగ్,ఇంజనీగింగ్,శానిటేషన్ అధికారులు సమన్వయం చేసుకొని ఎక్కడెక్కడ ఆక్రమణలు ఉన్నాయో వాటిని పూర్తిగా తొలగించాలని ఆదేశించారు.సమస్య ఒక్కసారి వస్తానే పరిష్కారం కావాలని,తిరిగి మళ్ళీ మళ్ళీ రాకూడదన్నారు.అ ప్రాంతం లో ఒక రోడ్డు అవసరం ఉందని,దానిని వెంటనే వేయాలని ఆదేశాలు ఇచ్చారు.సమస్యలపై సకాలంలో అధికారులు స్పందించాలని,స్థానికంగా జరుగుతున్న అక్రమ నిర్మాణాలపైన చర్యలు తీసుకోవాలన్నారు.అవసరమైతే క్రిమినల్ కేసులు పెట్టాలన్నారు.ఈ కార్యక్రమంలో తహసీల్దార్ ఖాజాబీ, మునిసిపల్,సచివాలయం సిబ్బంది,నాయకులు రంగస్వామి నాయుడు,బొమ్మిశెట్టి పురుషోత్తం, రాటకొండ శ్రీనివాసులు నాయుడు, మార్పూరి నాగార్జున బాబు, రైస్ మిల్ శశి కుమార్,కంచర్ల మల్లికార్జున నాయుడు,జెసిబి వేణు,దుర్గా ప్రసాద్, అప్పినపల్లె భాస్కరాచారి, రెడ్డి రాయల్స్,మాజీ కౌన్సిలర్లు పులి మహాలక్ష్మి,రాధమ్మ స్థానిక ప్రజలు పాల్గొన్నారు.





# ప్రశాంత వాతావరణంలో వినాయక చవితి ఉత్సవాలు

**మదనపల్లె క్రైమ్ -సూర్య వాస్తవం:** ప్రశాంత వాతావరణంలో వినాయక చవితిని జరుపు కుందామని మదనపల్లె డిఎస్పి కొండయ్య నాయుడు కోరారు. డీఎస్పీ కార్యాలయంలో మంగళవారం వినాయకుల ఏర్పాటుపై ఉత్సవ కమిటీతో సమావేశం నిర్వహించి మాట్లాడుతూ. వినాయకుని విగ్రహాల ఏర్పాటుకు పోలీసుల అనుమతి తప్పనిసరి అన్నారు. పట్టణంలోని అన్ని పోలీస్ స్టేషన్ ల సిబ్బందితో పాటు ఉత్సవ కమిటీ నాయకులకు ప్రశాంత వాతా వరణంలో పండుగ జరుపుకునేలా చూడాలని, ఎక్కడ గొడవలు, అల్లర్లు ఉండకూడ దన్నారు. పోలీసులు, ఉత్సవ కమిటీల నేతలు పాల్గొన్నారు.



### ఆంగ్ల విద్యాభ్యాసానికి

# అంగన్వాడి సెంటర్లు తొలి మెట్టు



**హిందూపురం టౌన్-సూర్య వాస్తవం:** ప్రస్తుత పరిస్థితులలో తెలుగుతోపాటు ఆంగ్ల విద్యాభ్యాసానికి ఎంతో ప్రాధాన్యత ఉందని అలాంటి విద్యాభ్యాసం అంగన్వాడి సెంటర్లలో కూడా ఆట బొమ్మలతో పిల్లలకు విద్యాభ్యాసం గావిస్తున్నామని సిడిపిఓ రెడ్డి రమణమ్మ పేర్కొన్నారు,ఈ సందర్భంగా హిందూపురం డివిజన్ శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో హిందూపురం పట్టణంలోని హస్నాబాద్ అంగన్వాడి సెంటర్లో పోషణ్ మాసోత్సవ కార్యక్రమం నిర్వహించారు,ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన సిడిపిఓ రెడ్డి రమణమ్మ మాట్లాడుతూ ప్రభుత్వ ఆశయానికి అనుగుణంగా అంగన్వాడి సెంటర్లకు వచ్చే పిల్లలకు ఆట పాటలతో పాటు మంచి విద్యాబుద్ధులు, తెలుగు ఆంగ్ల విద్యా బోధన బోధిస్తూ పౌష్టికాహారం అందిస్తున్నామని అని తెలిపారు ,మంచి విలువైన బొమ్మలతో పిల్లలకు అర్థమయ్యే విధంగా తెలుగు, ఆంగ్ల విద్యాభ్యాసం గా విస్తున్నామన్నారు,ప్రతి విద్యార్థి ఉన్నత విద్య భ్యాసం గావించి ఉన్నత శిఖరాలు అధిరోహిస్తున్నారంటే అందుకు పట్టణ గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న అంగన్వాడి సెంటర్ల విద్యాభ్యాసమే ప్రధాన కారణమని సిడిపిఓ అభిప్రాయపడ్డారు,ఈ కార్యక్రమంలో సూపర్వైజర్లు శాంతి, అనిత రాధా అంగన్వాడి వర్కర్లు శైలజ, లక్ష్మి, సునీత, సుజాత, రాజేశ్వరి, మస్తాన్ బి షాహిదా అంగన్వాడి పిల్లలు తల్లులు పాల్గొన్నారు.

# జాతీయ లోక్ అదాలత్ సద్వినియోగం చేసుకోవాలి

### - పత్తికొండ జూనియర్ సివిల్ కోర్టు జడ్జి ఎంఎస్. భారతి



**పత్తికొండ టౌన్ (సూర్య వాస్తవం):** ఈనెల 14వ తేదీన జరిగే జాతీయ లోకాదాలత్ ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని పత్తికొండ జూనియర్ సివిల్ కోర్టు జడ్జి ఎంఎస్ భారతి తెలిపారు. మంగళవారం పత్తికొండ కోర్టు లోని మండల న్యాయ సేవాధికార కార్యాలయంలో ఆమె మాట్లాడుతూ.... దేశంలోని వివిధ కోర్టులలో పెండింగ్లో ఉన్న కేసులను దృష్టిలో పెట్టుకొని భారత సర్వోన్నత న్యాయస్థానం (సుప్రీంకోర్టు) 1987 సంవత్సరంలో జాతీయ లోక్ అదాలత్ ఏర్పాటు చేసిందన్నారు. ఈ లోక్ అదాలత్ కార్యక్రమంలో పెండింగ్ లో ఉన్న కేసులను మరియు కోర్టులో వ్యాజ్యానికి ముందు దశలో ఉన్న కేసులను పరిష్కరించేందుకు ఉపయోగపడుతుందని తెలిపారు. చాలా రోజుల నుండి ఉన్న ఆస్తి తగాదాలు, ప్రొనోట్, చెక్ బౌన్స్ తో పాటు పెండింగ్ లో ఉన్న సివిల్ కేసులను పరిష్కరించుకోవచ్చు అని వివరించారు. ప్రతి మూడు నెలలకు ఒకసారి జరిగే జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమంలో చాలా కేసులు పరిష్కారానికి వచ్చాయని తెలిపారు. రాజీ అయ్యే క్రిమినల్ కేసులు కూడా ఈ లోక్ అదాలత్ లో పరిష్కరించుకోవచ్చు అని అన్నారు. పత్తికొండ కోర్టులో దాదాపు రెండు వేలకు పైగా కేసులు పెండింగ్లో ఉన్నాయని అన్నారు. రాజీమార్గమే....రాజ మార్గమని, కాక్షిదారులు లోక్అదాలత్ ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. లోక్అదాలత్ గురించి పూర్తి సమాచారం కోసం కక్షిదారులు న్యాయవాదిలను లేదా పోలీస్ స్టేషన్ లో పోలీసులను సంప్రదించి తెలుసుకోవచ్చని తెలిపారు.

# కార్యకర్తలకు అండగా జనసేన



**తిరుపతి -సూర్య వాస్తవం:** చంద్రగిరి నియోజకవర్గం అనుప్పల్లిలో జన సైనికుడు గోపి తల్లితండ్రులకు జేఎంసి ట్రస్ట్ నుంచి లక్ష రూపాయల చెక్ ను ఆరణి మదన్ అందించారు. జనసేన అధ్యక్షులు పవన్ కళ్యాణ్ పుట్టిన రోజు వేడుకలకు ఫ్లెక్సీ లు కడుతుండగా విద్యుత్ షాక్ కు గురై గోపి మృతి చెందగా మధు అనే యువకుడికి గాయాలయ్యాయి. కాగా తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు రుయా ఆస్పత్రిలో బాధితులను పరామర్శించి గోపి కుటుంబానికి వ్యక్తిగతంగా లక్ష రూపాయల ఆర్థిక సాయం ప్రకటించారు. దీనికి అనుగుణంగా ఆరణి మదన్ గోపి అంతిమ యాత్రలో పాల్గొని నివాళులు అర్పించారు. అనంతరం గోపి తల్లి రాజేశ్వరి, తండ్రి దామోదరం లకు లక్ష రూపాయల చెక్ అందించారు. అన్నివిధాలా అండగా ఉంటామని గోపి తల్లితండ్రులకు ఆరణి మదన్ భరోసా ఇచ్చారు. జనసేన అధ్యక్షులు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ పార్టీ తరుపున ఇప్పటికే ఐదు లక్షల రూపాయల ఆర్థిక సాయం ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ కార్యక్రమంలో జనసేన చంద్రగిరి ఇంచార్జ్ దేవర మనోహర్, తిరుపతి నగర అధ్యక్షులు రాజారెడ్డి, ఆకేపాటి సుభాషిణి, శ్రావణ్ తదితరులు పాల్గొన్నారు.

## 16 నుండి 18వ తేదీ వరకు

# తిరుచానూరు శ్రీ పద్మావతి అమ్మవారి పవిత్రోత్సవాలు

**తిరుపతి-సూర్య వాస్తవం:** తిరుచానూరు శ్రీపద్మావతి అమ్మవారి ఆలయంలో సెప్టెంబరు 16 నుంచి 18వ తేదీ వరకు మూడు రోజుల పాటు పవిత్రోత్సవాలు జరుగనున్నాయి. ఈ ఉత్సవాలకు సెప్టెంబరు 15వ తేదీ సాయంత్రం విష్వక్సేనారాధన, పుణ్యహవచనం, మృత్సంగ్రహణం,సేనాధిపతి ఉత్సవం, అంకురార్పణం జరుగనుంది. ఆలయంలో యాత్రికుల వల్లగానీ, సిబ్బంది వల్ల గానీ తెలియక దోషాలు జరుగుతుంటాయి. ఇలాంటి వాటివల్ల ఆలయ పవిత్రతకు ఎలాంటి లోపం రానీయకుండా నివారించేందుకు ప్రతి ఏడాదీ మూడు రోజుల పాటు పవిత్రోత్సవాలు నిర్వహించడం ఆనవాయితీ. ఈ పవిత్రోత్సవాలలో ఆలయ శుద్ధి, పుణ్యాహవచనం వంటి కార్యక్రమాలు నిర్వహిస్తారు. ఈ సందర్భంగా సెప్టెంబరు 16వ తేదీన పవిత్రప్రతిష్ఠ, సెప్టెంబరు 17న పవిత్ర సమర్పణ, సెప్టెంబరు 18న పూర్ణాహుతి కార్యక్రమాలు జరుగనున్నాయి. రూ.750/- చెల్లించి గృహస్తులు (ఒకరికి ఒక రోజు ) ఈ పవిత్రోత్సవాల ఆర్జిత సేవలో పాల్గొనవచ్చు. గృహస్తులకు 2 లడ్డూలు, 2 వడలు బహుమానంగా అందజేస్తారు.

పవిత్రోత్సవాల సందర్భంగా సెప్టెంబరు 10వ తేదీన కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం, సెప్టెంబరు 15వ తేదీన అంకురార్పణ సందర్భంగా కల్యాణోత్సవం, ఊంజల్‌సేవ, సెప్టెంబరు 16వ తేదీ అష్టదళ పాద పద్మారాధన సేవలను రద్దు చేశారు. ఆదేవిధంగా సెప్టెంబరు 16, 17, 18వ తేదీలలో కల్యాణోత్సవం, బ్రేక్ దర్శనం, వేద ఆశీర్వచనం, కుంకుమార్చన, ఊంజల్‌సేవను టిటిడి రద్దు చేసింది.

### 10న కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం

శ్రీ పద్మావతి అమ్మవారి వార్షిక పవిత్రోత్సవాలను పురస్కరించుకొని సెప్టెంబరు 10వ తేదీన ఆలయంలో కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం జరుగనుంది. ఉదయం సుప్రభాతంతో అమ్మవారిని మేల్కొలిపి సహస్రనామార్చన, శుద్ధి నిర్వహిస్తారు.

అనంతరం ఉదయం 7 నుండి 9.30 గంటల వరకు కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం జరగనుంది. ఇందులో ఆలయ ప్రాంగణం, గోడలు, పైకప్పు, పూజాసామగ్రి తదితర వస్తువులను నీటితో శుద్ధి చేసిన అనంతరం నామకోపు, శ్రీచూర్ణం, కస్తూరి పసుపు, పచ్చాకు, గడ్డ కర్పూరం, గంధం పొడి, కుంకుమ, కిచిలిగడ్డ తదితర సుగంధ ద్రవ్యాలు కలగలిపిన పవిత్రమిశ్రమాన్ని ఆలయం అంతటా ప్రోక్షణం చేస్తారు. అనంతరం భక్తులను ఉదయం 10 గంటల నుండి సర్వదర్శనానికి అనుమతిస్తారు.

# కొనసాగుతున్న నామినేటెడ్ పదవుల కసరత్తు

**గుంటూరు-సూర్య వాస్తవం:** ఏపీలో నామినేటెడ్ పోస్టుల సందడి ప్రారంభమైంది. 20 రోజుల్లో నామినేటెడ్ పోస్టులు భర్తీ చేయడానికి ప్రభుత్వం కసరత్తు ప్రారంభించింది. దీంతో ఆశావహుల్లో ఆశలు చిగురించాయి. ఇప్పటికే నామినేటెడ్ పోస్టుల కోసం వేలాది మంది దరఖాస్తు చేసుకున్నారు. పదవులు వందల్లో ఉంటే.. వేలల్లో దరఖాస్తులు వచ్చాయి. మూడు పార్టీల శ్రేణులు పదవులపై ఆశ పెట్టుకున్నాయి. దీంతో నామినేటెడ్ పదవుల పంపకం కత్తి మీద సాము కానుంది. మూడు పార్టీల కూటమి నేపథ్యంలో.. నామినేటెడ్ పదవుల్లో సైతం తమకు ప్రాధాన్యత ఇవ్వాలని ఆ రెండు పార్టీలు కోరుతున్నాయి. జనసేన అయితే 100% విజయంతో దూకుడుగా ఉంది. కేవలం 21 స్థానాల్లో పోటీ చేసి.. అన్ని స్థానాలను కైవసం చేసుకుంది. మిగతా చోట్ల కూటమి గెలుపునకు కృషి చేసింది. అందుకే నేతల కృషిని గుర్తించి ఎక్కువ శాతం నామినేటెడ్ పదవులు కేటాయించాలని ఆ పార్టీ కోరుతోంది. మరోవైపు బిజెపి సైతం ఇదో చక్కటి అవకాశంగా భావిస్తోంది. ఏపీలో బలపడాలన్న ఆకాంక్షతో ఉన్న బిజెపి వీలైనంత ఎక్కువగా నామినేటెడ్ పోస్టులు తీసుకోవాలని చూస్తోంది. ఆ రెండు పార్టీల ఒత్తిడితో చంద్రబాబు ఉక్కిరి బిక్కిరి అవుతున్నారు.వాస్తవానికి ఆగస్టు 17 నాటికి నామినేటెడ్ పదవులను ఖాయం చేస్తారని ప్రచారం సాగింది. టీటీడీ అధ్యక్ష పదవి నుంచి మార్కెట్ కమిటీల వరకు అన్ని ఒకేసారి ప్రకటిస్తారని టాక్ నడిచింది. కానీ ఎందుకో ఆ ప్రక్రియ నిలిచిపోయింది. మూడు పార్టీల మధ్య సయోధ్య కుదరక నిలిపివేసినట్లు ప్రచారం జరిగింది. అయితే ఇప్పుడు మరోసారి కదలిక వచ్చింది. 20 రోజుల్లో నామినేటెడ్ పదవులను ప్రకటిస్తారని తెలుస్తోంది.అయితే మూడు పార్టీల్లో ఆశావాహులు అధికంగా ఉన్నారు. పొత్తులో భాగంగా టిడిపి 31 అసెంబ్లీ స్థానాలను వదులుకుంది. అలాగే 8 పార్లమెంట్ స్థానాలను సైతం విడిచిపెట్టింది. చివరి నిమిషంలో అక్కడ నేతలు సీట్లు వదులుకోవాల్సి వచ్చింది. ఇప్పుడు వారందరికీ నామినేటెడ్ పదవులు కేటాయించాల్సిన అనివార్య పరిస్థితి ఎదురయింది. తొలి ప్రాధాన్యంగా వారికే పదవులు కేటాయించనున్నట్లు తెలుస్తోంది.మరోవైపు జనసేన పార్టీలో సైతం ఒక రకమైన అసంతృప్తి ఉంది. తమ బలానికి తగ్గట్టు అసెంబ్లీ సీట్లు కేటాయించలేదని జనసైనికుల వాదన. జనసేనకు ఎన్ని సీట్లు కేటాయించి ఉన్నా.. అన్ని స్థానాలను గెలిచేవారమని వారు చెబుతున్నారు. కూటమి విజయంలో తమ పాత్ర కీలకమని.. అందుకే తమ పార్టీ క్యాడర్ కు నామినేటెడ్ పదవుల్లో ప్రాధాన్యం ఇవ్వాలని వారు కోరుతున్నారు.కీలక పోస్టుల్లో తమ వారిని నియమించాలని డిమాండ్ చేస్తున్నారు.అయితే జాతీయ పార్టీగా ఉన్న బిజెపి సైతం నామినేటెడ్ పదవులను ఆశిస్తోంది. ఏపీలో బిజెపి బలోపేతానికి అవసరమైన చర్యల్లో భాగంగా పదవులు కీలకమని భావిస్తోంది. పైగా మొన్నటి ఎన్నికల్లో టికెట్లు దక్కించుకున్న వారంతా చంద్రబాబు అస్మదీయులేనని ప్రచారం ఉంది.పూర్వం నుంచి బిజెపిలో ఉన్నవారికి టికెట్లు దక్కలేదు. అటువంటి వారంతా ఇప్పుడు నామినేటెడ్ పదవులు కోరుకుంటున్నారు. అందుకే మూడు పార్టీల నేతలతో నామినేటెడ్ పదవుల జాబితా ప్రకటనకు చంద్రబాబు కిందా మీదా పడుతున్నారు.




# ఇంటింటి సర్వే పక్కాగా చేయాలి






### తిరుపతి నియోజకవర్గ ఓటర్ నమోదు అధికారి ఎన్.మౌర్య

**తిరుపతి-సూర్య వాస్తవం:** ఓట్ల మార్పులు, చేర్పులు, తొలగింపు కోసం నిర్వహించే ఇంటింటి సర్వే పక్కాగా నిర్వహించాలని తిరుపతి నియోజకవర్గ ఓటర్ నమోదు అధికారి ఎన్.మౌర్య అధికారులను, సిబ్బందిని ఆదేశించారు. ఇంటింటి ఓటర్ల సర్వే నిర్వహణపై మంగళవారం కచ్చపి ఆడిటోరియం నందు సూపర్ వైజర్లు, బూత్ లెవెల్ ఆఫీసర్లతో తిరుపతి నియోజకవర్గ ఓటర్ నమోదు అధికారి ఎన్.మౌర్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పారదర్శకమైన ఓటర్ జాబితా కోసం ఇంటింటి సర్వే నిర్వహిస్తున్నామని అన్నారు. ఓటర్ల జాబితాలో ఎటువంటి పొరపాట్లకు తావులేకుండా ప్రతి సంవత్సరం ఈ సమ్మరీ రివిషన్ నిర్వహిస్తామని అన్నారు. ఓటర్ల ఇంటింటి సర్వేకు 18రోజులు సమయం ఉందన్నారు.

మీరందరూ సమన్వయం చేసుకుని ప్రతి ఇంటికి వెళ్లి ఎవరైనా మరణించారా? ఇల్లు మారారా? అడ్రెస్స్ మార్పులు ఏమైనా ఉన్నాయా? అని వివరాలు సేకరించాలని అన్నారు. , కొత్త ఓటు నమోదు చేసుకునే వారికి 18 సంవత్సరాలు నిండి ఉండాలని, కొత్త ఓటర్ నమోదుకు సంబందించిన అన్ని ధ్రువపత్రాలు పరిశీలించాలని అన్నారు. డూప్లికేట్, షిఫ్టింగ్, మరణించిన ఓట్లలో చాలా జాగ్రత్త వ్యవహారించాలని అన్ని ధ్రువ పత్రాలు క్షుణ్ణంగా పరిశీలించాలని అన్నారు. ఈ సర్వే ని చాలా జాగ్రత్తగా చేయాలని, ఏవైనా సమస్యలు ఉత్పన్నమైతే ఉన్నతాధికారుల దృష్టికి తేవాలని అన్నారు. ఈ సమ్మరీ రివిషన్లో ఏదైనా తప్పులు చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ సమావేశంలో అదనపు కమిషనర్ చరణ్ తేజ్ రెడ్డి, డిప్యూటీ కమిషనర్ అమరయ్య, అర్బన్ తహసీల్దార్ బాగ్యలక్ష్మి, తదితరులు ఉన్నారు.

## జగన్ విదేశీ పర్యటన

# ఏపీ పొలిటికల్ సర్కిల్స్ లో డిఫరెంట్ చర్చ

**విజయవాడ-సూర్య వాస్తవం:**



జగన్ విదేశీ పర్యటన నుంచి వచ్చేసరికి వైసిపి ఖాళీ అవుతుందా? ఆ పార్టీని వీడేందుకు చాలామంది సిద్ధంగా ఉన్నారా?తెర వెనుక ఏదో జరుగుతోందా? ఏపీ పొలిటికల్ సర్కిల్లో ఇదే చర్చ నడుస్తోంది. టిడిపి అనుకూల మీడియాలో పెద్ద ఎత్తున ప్రచారం జరుగుతోంది. జగన్ కుటుంబ సమేతంగా లండన్ వెళ్ళనున్నారు.దాదాపు 20 రోజులు పాటు అక్కడే ఉంటారు. కూతురి పుట్టినరోజు వేడుకల్లో పాల్గొంటారు. విదేశాలకు వెళ్లేందుకు ఇప్పటికే సిబిఐ అనుమతి తీసుకున్నారు జగన్. ఈరోజు తండ్రి రాజశేఖర్ రెడ్డి వర్ధంతి కావడంతో ఇడుపాలపాయలో నివాళులు అర్పించారు. ప్రత్యేక విమానంలో లండన్ వెళ్ళనున్నారు. గత మూడు రోజులుగా పులివెందుల నియోజకవర్గంలోనే జగన్ గడిపారు. తిరిగి ఈనెల 25న రాష్ట్రానికి రానున్నారు. అయితే ఆయన వచ్చే సమయానికి వైసీపీని అడ్డగోలుగా చీల్చుతారని ప్రచారం జరుగుతోంది. సాధారణంగా అధికారంలో ఉన్న పార్టీల అధినేతలు, ముఖ్యమంత్రులు విదేశాలకు వెళ్లే సమయంలో ఆ పార్టీని అడ్డగోలుగా చీల్చడం చూశాం. అధికారాన్ని హస్తగతం చేసుకోవడం చూశాం. అయితే ఇప్పుడు వైసీపీ బలాన్ని, బలగాన్ని తీసుకునే ప్రయత్నం చేస్తారని జోరుగా ప్రచారం సాగుతోంది. అయితే అది ఎంతవరకు సాధ్యమా అన్నది తెలియాల్సి ఉంది.ఇప్పటికే వైసీపీ నుంచి జంపింగ్ లు ప్రారంభమయ్యాయి. ఆ పార్టీకి చెందిన రాజ్యసభ సభ్యులు మోపిదేవి వెంకటరమణ, బీదా మస్తాన్ రావు పార్టీకి గుడ్ బై చెప్పారు. రాజ్యసభ పదవులకు రాజీనామా చేశారు. మరో ఎంపీ చేరెందుకు సిద్ధంగా ఉన్నారు. మరొకరి పేరు ప్రముఖంగా వినిపిస్తోంది. మరో ఏడుగురు మాత్రం తాము జగన్ వెంటే ఉంటామని తేల్చి చెబుతున్నారు. వారిలో ఒకరిద్దరు తప్ప అంత వైసీపీకి వీర విధేయులు కావడం గమనార్హం. అయితే పరిస్థితులకు తగ్గట్టు చాలామంది నేతలు మారుతారు. వైసీపీ రాజ్యసభ సభ్యుల్లో చాలామందికి వ్యాపారాలు, వ్యాపార సంస్థలు ఉండడంతో.. వారు వైసీపీలో ఫిక్స్ గా ఉంటారా? లేదా? అన్నది అనుమానమే.మరోవైపు శాసనమండలిలో సైతం సభ్యులు కూటమి వైపు చూస్తున్నట్లు ప్రచారం సాగుతోంది. ఎన్నికల్లో 164 అసెంబ్లీ సీట్లలో కూటమి గెలిచింది. కానీ శాసనమండలి విషయానికి వచ్చేసరికి కూటమి బలం అంతంత మాత్రమే. వైసీపీకి ఇక్కడ 38 మంది సభ్యుల బలం ఉంది. అందుకే టిడిపి ప్రత్యేకంగా దృష్టి పెట్టినట్లు తెలుస్తోంది. ఇప్పటికే వైసీపీకి చెందిన బల్లి కళ్యాణ్ చక్రవర్తి, సుంకర పద్మశ్రీ, పోతుల సునీత పార్టీకి గుడ్ బై చెప్పారు. ఎమ్మెల్సీ పదవులకు రాజీనామా ప్రకటించారు. నేరుగా మండలి చైర్మన్ కు రాజీనామాను సమర్పించారు. ఇంకా చాలామంది వైసీపీ ఎమ్మెల్సీలు వారి బాటలో ఉన్నట్లు సమాచారం.అయితే వైసీపీ రాజ్యసభ సభ్యులు, ఎమ్మెల్సీలు పార్టీతో పాటు పదవులకు రాజీనామా చేస్తున్నారు. వీరు పదవులతో టిడిపి కూటమి పార్టీలో చేరే పరిస్థితి లేదు. ఆ రెండు చోట్ల కూటమి పార్టీల ప్రాతినిధ్యం పెరగడమే ముఖ్య ఉద్దేశం. వీరు రాజీనామా చేస్తే కనీసం పోటీ పెట్టే స్థితిలో వైసీపీ లేదు. ఆ కారణం చేతనే వారితో రాజీనామాలు చేయిస్తున్నారు. అయితే రాజ్యసభ సభ్యుల రాజీనామా ఆమోదం ఇట్టే లభించే అవకాశం ఉంది. కానీ ఎమ్మెల్సీల రాజీనామా ఆమోదం అంత ఈజీ కాదు. ఇప్పటికీ మండలి చైర్మన్ గా వైసీపీకి చెందిన మోసేన్ రాజు ఉన్నారు. ఆయన ఆమోదిస్తే కానీ వైసీపీ ఎమ్మెల్సీల రాజీనామాలు కుదిరే పని కాదని తెలుస్తోంది.గతంలో ఉమ్మడి ఏపీ సమయంలో శాసనసభ స్పీకర్ గా నాదెండ్ల మనోహర్ ఉండేవారు. రాష్ట్ర విభజనకు వ్యతిరేకిస్తూ వందమంది ఎమ్మెల్యేల వరకు రాజీనామా అప్పట్లో ప్రకటించారు. కానీ కాంగ్రెస్ నాయకత్వం ఒత్తిడితో నాడు స్పీకర్ గా ఉన్న మనోహర్ ఆమోదించలేదు. దీంతో వారి రాజీనామా చెల్లుబాటు కాలేదు. ఇప్పుడు కూడా వైసీపీకి చెందిన మండలి చైర్మన్ ఉండడంతో ఎమ్మెల్సీల రాజీనామా ఆమోదం అంత ఈజీ కాదని తెలుస్తోంది. అందుకే జగన్ విదేశాలకు వెళ్లి వచ్చిన తర్వాత కూడా వైసీపీకి ఏమీ కాదని కేవలం నలుగురు రాజ్యసభ సభ్యులు చేజారే అవకాశం ఉందని ప్రచారం జరుగుతోంది. మరి ఏం జరుగుతుందో చూడాలి.

# కల్లూరు గ్రామంలో గుర్తుతెలియని అనుమానాస్పద మృతి




**ప్రొద్దుటూరు, (సూర్య వాస్తవం)**

మండలంలోని కల్లూరు గ్రామంలో మంగళవారం గుర్తు తెలియని వ్యక్తి అనుమానా స్పదంగా మృతి చెందారని రూరల్ సీఐ బాల మద్దిలేటి తెలిపారు. ఈ విషయం తెలుసుకున్న ఆయన, పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని దర్యాప్తు చేపట్టారు. కల్లూరు గ్రామంలోని క్రిస్టియన్ స్మశాన వాటిక వద్ద మృతదేహం గుర్తించామని, మృతి చెందిన వ్యక్తి కల్లూరు గ్రామానికి ఎందుకు వచ్చారు, అక్కడ ఉన్న గ్రామస్తుడు, కాని మరో వ్యక్తి ఎవరు అన్న విషయంపై ఆరా తీస్తున్నామన్నారు. ఈ హత్య విషయంలో పూర్తి వివరాలు తెలియాల్సి ఉందని వివరించారు.

# ఇది ఘోరమైన వైఫల్యం



**విజయవాడ-సూర్య వాస్తవం:** నాలుగు రోజుల పాటు కరెంట్ లేకుండా, నీళ్లు లేకుండా, ఆహారం లేకుండా కష్టాలు పడ్డారంటే...ఇంతకంటే ఘోరమైన వైఫల్యం మరొకటి ఉండదని మాజీ మంత్రి రోజా అన్నారు. నాలుగు రోజుల పాటు సుమారు మూడు లక్షల మందిని ముంచేసి కనీసం నీళ్లు, పాలు కూడా అందించకపోవడం అంటే ఇంతకంటే దారుణం ఇంకోటి లేదు. ఈ ప్రభుత్వంలో ఉన్న ముఖ్యమంత్రికి, మంత్రులకు వీకెండ్ విహార యాత్రలకు ప్లాన్ చేసుకుంటున్నారు కానీ, ప్రజల కష్టాల కోసం ఆలోచించడం లేదని అన్నారు. ఈనెల 29,30 వ తేదీల్లో సీఎం నుండి మంత్రుల వరకు అందరూ వీకెండ్ విహార యాత్రలకు ప్లాన్ చేసుకున్నారు. 28 వ తేదీనాడే వాతావరణ శాఖ భారీ వర్షాలు పడతాయి అయినా సమాచారం ఇచ్చినా... కనీసం సీఎం చంద్రబాబు కానీ హోంమంత్రి కానీ, పంచాయతీరాజ్ మంత్రి కానీ, రెవెన్యూ మంత్రికానీ, మున్సిపల్ శాఖ మంత్రి కానీ, ఇరిగేషన్ మంత్రి కానీ...ఒక్కరంటే ఒక్కరు కూడా ఎలాంటి సమీక్ష కూడా చేయలేదు. ప్రభుత్వం భారీ వర్షాలపైనా ముందస్తు చర్యలు తీసుకోకపోవడం వలన 10 మంది ప్రాణాలు పోయాయి. వరదల కోసం కూడా ముందస్తు చర్యలు తీసుకోకపోవడం వలన ఏకంగా మూడు లక్షల మంది విజయవాడ సెంట్రల్, వెస్ట్, మైలవరం, నందిగామ, గన్నవరం, అవనిగడ్డ, పామర్రు నియోజకవర్గాల్లో జనం వరదలో చిక్కుకుపోయారు. మా జగనన్న ప్రభుత్వం లో ఉన్నప్పుడు వర్షాలు, వరదలు, తుఫాన్లు వస్తాయన్న సమాచారం ఉంటే.. ముందుగానే సచివాలయాలు, వాలంటీర్ వ్యవస్థ ద్వారా ప్రజలను అప్రమత్తం చేసే వాళ్లం. పునరావాస కేంద్రాల్లో ప్రజలకు ఆహారం, పాలు, మంచినీళ్లు అందించేవాళ్లమని అన్నారు. అంతేకాదు వరద, తుఫాన్ బాధితులకు వాళ్ల ఇళ్లకు కూడా ఆహారం, నిత్యవసరాలు పంపిణీ చేసేవాళ్లం. జగనన్న నిరంతరం అధికారులతో సమీక్షలు జరిపి, ఆయన చుట్టూ అధికారులను తిప్పుకోకుండా ప్రజలకు ముందు సహాయ చర్యలు అందేలా చేసేవారు. ఈరోజు విజయవాడ వరదల్లో అలాంటి సహాయం ఎవ్వరికైనా ఇంటికి వెళ్లి అందించారా..? అధికారులను కనీసం సీఎం కానీ, మంత్రులు కానీ ముందుగా సిద్ధం చేశారా..? ఈ మంత్రులు ఏం చేస్తున్నారు. హోంమంత్రి , విపత్తుల నిర్వహణ మంత్రి కనీసం ఈ విపత్తుపైనా అధికారులను కానీ, ఇతర శాఖలను కానీ అప్రమత్తం చేసిందా..? ఒక్క సమీక్ష అయినా ముందుగా చేసిందా..? ఇక మంత్రి లోకేష్ ఏం చేశారు...మంగళగిరిలో వర్షాలు కురిస్తే , విజయవాడలో వరద వస్తే వాళ్లను వదిలేసి హైదరాబాద్ కి వెళ్లిపోతారా అని రోజా ప్రశ్నించారు.

## సమస్యలను పరిష్కరించాలి

**హైదరాబాద్-సూర్య వాస్తవం:** దేశ ప్రగతిని శాసించే విద్యార్థుల సమస్యలను... కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పరిష్కరించాలని... బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్. కృష్ణయ్య డిమాండ్ చేశారు. జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో... బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వేముల రామకృష్ణ అధ్యక్షతన రవీంద్రభారతిలో బీసీ విద్యార్థుల రాష్ట్ర సదస్సు జరిగింది. బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు అర్. కృష్ణయ్య, ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరామ్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత వి. హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆర్ కృష్ణయ్య మాట్లాడుతూ... స్కై ఓవర్లు , ఫ్లై ఓవర్లు కట్టడానికి ప్రభుత్వం దగ్గర డబ్బులు ఉన్నాయిగాని ఉంటాయి కానీ , పేద వర్గాలు పిల్లలు ఉండే బీసీ హాస్టల్ లకు సొంత భవనాలకు నిధులు లేకపోవడం బాధాకరమన్నారు. చదువుకునేందుకు మౌలిక సదుపాయాలు కల్పించాలని విద్యార్థులు రోడ్డెక్కడం పట్ల పాలకుల నిర్లక్ష్యం స్పష్టంగా కనిపిస్తుందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కొంతమంది అధికారులు తప్పుదోవ పట్టించున్నారని... భజన చేసే అధికారులను పక్కన పెట్టి ప్రజా సంఘాలతో సమస్యలపై చర్చించాలని సూచించారు. ఎస్సి , ఎస్టీ సబ్ ప్లాన్ తరహాలో బీసీలకు కూడా సబ్ ప్లాన్ ప్రవేశపెట్టాలని ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరామ్ అన్నారు. ఆ నిధులతో హాస్టల్ వసతి , సొంత భవనాలు నిర్మాణం చేపట్టవచ్చునని పేర్కొన్నారు. విద్యారంగానికి బడ్జెట్ లో ఎక్కువ శాతం నిధులు కేటాయించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. చదువుపై ఖర్చును మనుషుల వికాసానికి పెట్టుబడిగా చూడాలి తప్ప , ఖర్చుగా చూడకూడదని అన్నారు. పెండింగ్ ఫీజ్ రియంబర్స్మెంట్ , స్కాలర్ షిప్ ల విడుదల అంశాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి , పరిష్కరిస్తానని కోదండరామ్ హామీనిచ్చారు. చట్ట సభల్లో 50 శాతం రిజర్వేషన్ల పెట్టాలన్న అర్. కృష్ణయ్య డిమాండ్ , అమలు కావడానికి దగ్గరలోనే ఉందని వి.హనుమంతరావు అన్నారు. అలాగే కులగణననపై తమ అధినేత రాహుల్ గాంధీ అనుకూలంగా ఉన్నారని గుర్తు చేశారు. అన్ని రంగాల్లో నిధులు పెంచుతున్నారని... కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యకు నిధులు పెంచాలని కోరారు.

## వరద ప్రాంతాలను పరిశీలించిన ఎమ్మెల్సీ

**జగిత్యాల-సూర్య వాస్తవం:** జగిత్యాల నియోజకవర్గం లోని రాయికల్ మండలంలో ఇటీవల కురిసిన వర్షాల వల్ల నష్టపోయిన పలు వంతెనలను పట్టభద్రుల ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి మంగళవారం సందర్శించారు.రాయికల్ పట్టణంలోని పెద్ద చెరువు అధిక వరద ఉధృతికి ధ్వంసమైన తూములు, మత్తడిని పరిశీలించారు.

# హైడ్రాకు ఫ్లడ్స్ బ్రేక్



**హైదరాబాద్ -సూర్య వాస్తవం:** అక్రమ నిర్మాణాలు చేపట్టిన వారి గుండెల్లో గుబులు రేపిన హైడ్రా ప్రస్తుతం కూల్చివేతలకు బ్రేక్ ఇచ్చింది. గత రెండురోజులుగా రాష్ట్రంలో భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో పలు ప్రాంతాలు జలమయం కాగా.. లోతట్టు ప్రాంతాలు పూర్తిగా మునిగిపోయాయి. హైదరాబాద్‌లోనూ వర్ష బీభత్సం సృష్టిస్తుండగా హైడ్రా టీమ్ మొత్తం సహాయక చర్యల్లో నిమగ్నమయ్యారు. ఈ మేరకు గ్రేటర్ పరిధిలో మాన్సూన్ సహాయక చర్యల్లో హైడ్రా బృందాలు పాల్గొంటున్నాయి. హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ సైత రంగంలోకి దిగి వాటర్ లాగిన్ పాయింట్స్, లోతట్టు ప్రాంతాల్లో పర్యటిస్తున్నారు. కాలనీలు నీట మునిగేందుకు గల కారణాలను అడిగి తెలుసుకుంటున్నారు. ముఖ్యంగా చెరువుల చుట్టుపక్కల కాలనీల్లో పరిస్థితిని సమీక్షిస్తూ నీటి శాతం చూసి ఆయా ప్రాంతాలను మార్క్ చేస్తున్నారు. వర్షాలు తగ్గుముఖం పట్టిన తర్వాత జలమయం అయిన ప్రాంతాలకు నోటీసులు ఇచ్చే అవకాశం కనిపిస్తోంది. ఇప్పటికే ఎఫ్టీఎల్ పరిధిలో నిర్మాణాలకు నోటీసులు ఇవ్వగా మరికొన్ని ప్రాంతాలకు నోటీసులు ఇచ్చేందుకు సిద్ధమయ్యారు. ఇప్పటికే నోటీసులు అందినవారు వారం రోజుల్లోగా ఇళ్లు ఖాళీ చేయాలని ఆదేశాలు జారీ చేశారు.ఇదిలా ఉంటే.. హైడ్రా హెచ్ఎండీఏ పరిధిలో నాగార్జున ఎన్ కన్వెన్షన్ తోపాటు 200కు పైగా అక్రమ నిర్మాణాలు కూల్చివేసినట్లు తెలుస్తోంది. ఇక చట్ట ముందు అందరూ సమానమేనని సీఎం రేవంత్ రెడ్డి ఇప్పటికే స్పష్టం చేయగా.. రేవంత్ రెడ్డి సోదరుడు తిరుపతి రెడ్డి ఇల్లు, ఆఫీసుకు నోటీసులు అందజేశారు. వర్షాలు తగ్గిన తర్వాత అక్బరుద్దీన్ ఓవైసీ ఫాతిమా కాలేజీ, కేటీఆర్ ఫామ్ హౌస్ కూల్చేందుకు హైడ్రా రంగం సిద్ధం చేసినట్లు సమాచారం

# మహేష్ కుమార్ కే ఛాన్స్

**హైదరాబాద్-సూర్య వాస్తవం:** టీపీసీసీ కొత్త చీఫ్ ఎంపిక ప్రక్రియ ఓ కొలిక్కి వచ్చింది. ఏ క్షణమైనా ప్రకటన వెలువడే అవకాశం ఉంది. అనేక సమావేశాలు, చర్చల అనంతరం, తెలంగాణ పీసీసీ అధ్యక్షుడిగా మహేష్ కుమార్ గౌడ్ పేరు ఖరారైనట్లు సమాచారం. ఈమధ్యే దీనిపై చర్చించేందుకు సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, ఇతర నేతలు ఢిల్లీ వెళ్లొచ్చారు. పార్టీ పెద్దలతో చర్చలు జరిపారు. ఆశావహులు ఇప్పటికీ ఢిల్లీలోనే ఉండి మంతనాలు జరుపుతున్నారు. టీపీసీసీ చీఫ్ పదవిని బీసీలకు ఇవ్వాలని హైకమాండ్ నిర్ణయించింది. ఈ నేపథ్యంలో మహేష్ కుమార్ గౌడ్, మధుయాష్కీ గౌడ్ మధ్య తీవ్ర పోటీ నెలకొంది. ఇద్దరూ పదవి కోసం పట్టుబట్టారు. ఈ నేపథ్యంలో ఎవరిని ఎంపిక చేయాలనే దానికి పార్టీ నేతలతో అధిష్టానం అనేక చర్చలు జరిపింది. చివరకు మహేష్ కుమార్ గౌడ్‌ను ఎంపిక చేసినట్టు తెలుస్తోంది. ఈయన గత మూడేళ్లుగా పీసీసీ ఆర్గనైజింగ్ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఉన్నారు. యువజన కాంగ్రెస్ నుంచి పార్టీలో పని చేస్తున్నారు. ఢిల్లీ స్థాయిలో పరిచయాలు ఉన్నాయి. తెలంగాణతో పాటు మరో రెండు రాష్ట్రాలకు కొత్త పీసీసీ చీఫ్‌లను కాంగ్రెస్ నియమించనుంది. ప్రస్తుతం తెలంగాణ కాంగ్రెస్ వ్యవహారాల ఇంఛార్జ్‌గా ఉన్న దీపా దాస్ మున్షీకి వెస్ట్ బెంగాల్ పీసీసీ పగ్గాలు అప్పగించే ఛాన్స్ ఉంది. తెలంగాణ వ్యవహారాల ఇంఛార్జ్‌గా చత్తీస్ గఢ్ మాజీ సీఎం భూపేష్ బఘేల్ వచ్చే అవకాశం ఉంది. ఇక కేసీ వేణుగోపాల్‌కు కేరళ పీసీసీ అధ్యక్ష పదవి దక్కే ఛాన్స్ ఉందని ప్రచారం జరుగుతోంది. ఈ నియామకాలపై ఏ క్షణమైనా ప్రకటన వెలువడే ఛాన్స్ ఉంది.

**ఉక్కపోతలో సీనియర్లు:** కాంగ్రెస్ పార్టీ అంటేనే గ్రూపులు, కయ్యాలు, అసూయ, అణచివేత.. ఇలా అనేక అంశాలు ఉన్నాయి. దేశానికి ఫ్రీడం సాధించిన పార్టీలో ఉన్న ఫ్రీడంతో నేతలు క్రమశిక్షణ లేకుండా వ్యవహరిస్తారు. అందుకే ఆ పార్టీలో కయ్యాలు నిరంతర ప్రక్రియ. పార్టీలో ఒక లీడర్ ఎదుగుదలను ప్రోత్సహించే వారికన్నా.. ఓర్వలేని నేతలే ఎక్కువగా ఉంటారు. అందుకే ఎదిగే నేతలు.. అనేక ఇబ్బందులు పడుతుంటారు. వాటిని అధిగమించిన వారే పార్టీ అధ్యక్షులుగా, ముఖ్య మంత్రులుగా నిలదొక్కుకుంటారు. లేదంటే రోషయ్యలా తప్పుకుంటారు. తెలంగాణ ఇచ్చిన పార్టీగా కాంగ్రెస్‌కు గుర్తింపు ఉంది. ఇది ఎవరూ కాదనలేదు. కానీ, ఇచ్చిన పార్టీకంటే ఉద్యమ పార్టీకే తెలంగాణ ప్రజలు రెండు ఎన్నికల్లో పట్టం కట్టారు. దీంతో తెలంగాణలో కాంగ్రెస్ పదేళ్ల అధికారానికి దూరమైంది. టీపీసీసీ చీఫ్‌గా రేవంత్‌రెడ్డిని నియమించిన అధిష్టానం అతని సారథ్యంలోనే ఎన్నికలకు వెళ్లి సక్సెస్ అయింది. లోక్‌సభ ఎన్నికల్లోనూ 8 స్థానాలు సాధించింది. టీపీసీసీ చీఫ్‌గా రేవంత్‌కు పగ్గాలు అప్పగించినప్పుడు చాలా మంది సీనియర్లు వ్యతిరేకించారు. అసలైన కాంగెస్ వాదులు పేరిట గ్రూపు కట్టారు. డబ్బులు పెట్టి తెచ్చు కున్నారని ఆరోపించారు. కానీ, వాటిని అధిగమించుకుంటూ రేవంత్‌రెడ్డి కాంగ్రెస్‌ను అధికారం లోకి తెచ్చారు. తర్వాత ముఖ్యమంత్రి కూడా అయ్యారు.టీపీసీసీ ప్రెసిడెంట్‌గా రేవంత్ అయ్యాక వేరు కుంపటి పెట్టిన సీనియర్లు క్రమంగా ఆయనను అణచివేయాలని చూశారు. పదవి నుంచి తప్పించాలని అధిష్టానానికి ఫిర్యాదు కూడా చేశారు. కానీ, అధిష్టానం ఫిక్స్ అయి ఉండడంతో వారి పప్పులు ఉడకలేదు. మరోవైపు రేవంత్ రెడ్డి తన వ్యతిరేకులను తనకు అనుకూలంగా మలచుకున్నారు. అయితే కొందరు రేవంత్ ను కారణం చూపించి పార్టీని వీడారు. అలాంటి నేతల్లో మొదటి వరుసలో ఉంటారు కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి. ఎవరు వెళ్లిపోయిన మొండికిపడి పార్టీకి ఊపు తీసుకు వచ్చి విజయతీరాలకు చేర్చిన నేత రేవంత్ రెడ్డి. మళ్లీ కాంగ్రెస్ గెలుస్తుందని తెలిసిన తర్వాతనే బెల్లం చుట్టూ ఈగలు మూగినట్లుగా ఇతర నేతలు వచ్చి చేరారు. అలాంటి వారిలోనూ ఉన్నాడు కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి. పదవి తప్పితే ఆయనకు మరో రాజకీయం తెలియదు. అందు కోసమే కూర్చున్న కొమ్మను కూడా నరుక్కుంటాడు. తెలంగాణలో సీఎంగా రేవంత్‌రెడ్డి బలపడుతున్నారు. అది కాంగ్రెస్ పార్టీకి.. అందులో లీడర్ గా ఉన్న కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డికి నచ్చడం లేదు. తన సామర్థ్యానికి మించిన పదవుల కోసం ఆశలు పడుతూ సొంత పార్టీలో కుంపట్లు పెట్టే ప్రయత్నం చేస్తున్నారు. ఆయనకు మంత్రి పదవి కావాలంటే.. ఆయన సోదరుడి పదవిని తీసేయాలి. పోనీ ఇద్దరికీ ఇవ్వాలంటే.. పార్టీకి ఆయన విధేయుడు కాదు. కొన ఊపిరితో ఉన్న పార్టీ పీక నొక్కడానికి బీజేపీతో కలిసి మునుగోడు ఉపఎన్నిక తెచ్చిన తెచ్చిన ఘనుడు.ఇక రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రిగా తనదైన ముద్ర వేస్తున్నారు. పథకాల అమలుతో పాటు.. హైడ్రా వంటి నిర్ణయాలతో ఆయన ప్రజల్లో ప్రత్యేకమైన ఇమేజ్ తెచ్చుకుంటున్నారు. మిగతా వారు ఆయనకు దూరంగా ఉండిపోతున్నారు. రేవంత్ కాకపోతే ఇంకెవరు అన్న ప్రశ్న వస్తే.. రేవంత్ లేకపోతే ఇంకెవరూ ఉండరన్న సమాధానం వస్తోంది. అందుకే లాబీయింగ్‌లకు అలవాటు పడిన లీడర్లు.. కొత్తగా పుకార్లు రేపుకుంటున్నారు.

# డిజిటల్ అగ్రికల్చర్ మిషన్

**న్యూఢిల్లీ -సూర్య వాస్తవం:** అన్నదాతలకు కేంద్ర ప్రభుత్వం శుభవార్త ప్రకటించింది. రైతులకు సంబంధించిన 7 కీలక నిర్ణయాలు తీసుకుంది. వివిధ పథకాలకు రూ.13,966 కోట్లు కేటాయించింది. ఈ క్రమంలోనే రైతులకు సత్వరంగా లోన్లు ఇచ్చేందుకు పథకాన్ని ప్రకటించింది. కేవలం 20 నిమిషాల్లోనే రైతులకు రుణాలు అందించేలా డిజిటల్ అగ్రికల్చర్ మిషన్ కేంద్రం తీసుకువస్తున్నట్లు కేంద్రమంత్రి అశ్వినీ వైష్ణవ్ తెలిపారు. ఇందులో డిజిటల్ అగ్రికల్చర్ మిషన్‌కు రూ.2,817 కోట్లు కేటాయిస్తూ కీలక నిర్ణయం తీసుకుంది. వ్యవసాయ రంగానికి టెక్నాలజీని అనుసంధానం చేయడంలో భాగంగానే ఈ డిజిటల్ అగ్రికల్చర్ మిషన్‌ను తీసుకువచ్చినట్లు కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది.మొత్తం వ్యవసాయ రంగానికి సంబంధించి 7 పథకాలకు కేంద్ర ప్రభుత్వం రూ.13,966 కోట్లను కేటాయిస్తూ కేంద్ర మంత్రివర్గం ఆమోదం కల్పించిందని అశ్వినీ వైష్ణవ్ వివరించారు. రూ.2,817 కోట్ల డిజిటల్ అగ్రికల్చర్ మిషన్ పథకం.. క్రాప్ సైన్స్ కోసం రూ.3,979 కోట్లు కేటాయించింది. వ్యవసాయ విద్య, నిర్వహణను బలోపేతం చేసేందుకు రూ.2,291 కోట్ల విలువైన కార్యక్రమానికి ఆమోదం తెలిపినట్లు కేంద్రమంత్రి పేర్కొన్నారు. పశువుల సుస్థిర ఆరోగ్యం, వాటి ఉత్పత్తి కోసం రూ.1,702 కోట్లతో స్కీమ్‌కి సైతం ఆమోదం తెలిపినట్లు చెప్పారు. ఉద్యానవనాల సుస్థిర అభివృద్ధికి రూ.860 కోట్లతో మరో బృహత్తర పథకానికి మంత్రివర్గం గ్రీన్ సిగ్నల్ ఇచ్చిందన్నారు. దీంతోపాటు వ్యవసాయ విజ్ఞాన కేంద్రాలను బలోపేతం చేసేందుకు రూ.1,202 కోట్లు వెచ్చించనున్నట్లు తెలిపారు. అదే సమయంలో సహజ వనరుల నిర్వహణకు సంబంధించిన పథకానికి రూ.1,115 కోట్లు వెచ్చించనున్నారు. దేశంలో వ్యవసాయానికి సాంకేతికతను జోడిస్తూ రైతులకు మరింత మేలు చేసేలా డిజిటల్ అగ్రికల్చర్ మిషన్ తీసుకువచ్చినట్లు కేంద్రమంత్రి అశ్వినీ వైష్ణవ్ వెల్లడించారు. ఈ డిజిటల్ అగ్రికల్చర్ మిషన్ ద్వారా 20 నిమిషాల్లోనే రైతులు రుణాలు పొందే కొత్త విధానాన్ని అందుబాటులోకి తీసుకువస్తుందని తెలిపారు. అంతేకాదు 2047 నాటికి వాతావరణ పరిస్థితులను తట్టుకుని పంటలు పండించేలా రైతులను సిద్ధం చేయడం వంటి కీలక నిర్ణయాలకు కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపింది. ఇక అగ్రికల్చర్ ఎడ్యుకేషన్ బలోపేతానికి రూ.2,291 కోట్లతో ప్రణాళిక రచించింది. ప్రస్తుత ప్రతికూల వాతావరణ పరిస్థితులను ఎదుర్కొనేలా పరిశోధనలు చేయాలని సూచించింది.


PRINTED AND PUBLISHED OWNED BY MOGAL IRSHAD BAIG, ON BEHALF OF IRS PUBLICATIONS , 13-2-819-2 RAMBOW RESIDENCE , RTC BUS STAND ROAD, SRINIVASA NAGAR, ANANTAPURAM, ANDHRAPRADESH-515001, GSTIN : 37AAJF15233N1ZY, TEL: 7672042522.VIJ. ADDRESS : SHEETAL APARTMENT, TF2 DR NO : 30-2-15/IE VIJAYAWADA-10, EDITOR : M.IRSHAD BAIG, CELL : 918500425222 (FOUNDER -N.ARIF ALI )